www.andhrajyothy.com


ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHI

గురువారం | 28-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 240 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి పూర్తి; నక్షత్రం: చిత్త ఉ. 7.36 తదుపరి స్వాతి; వర్జ్యం: మ.1.49-3.36, దుర్ముహూర్తం: ఉ.10.12-10.56, మ.2.37-3.22; అమృతఘడియలు: రా.12.30-2.17; రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 6.31; సూర్యాస్తమయం: 5.34 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అశ్రునివాళి







కీ॥ శే॥ శ్రీ నారా రామమూర్తి నాయుడు గారు

మాజీ శాసనసభ్యులు, చంద్రగిరి

సగటు మనిషి కోసం పాటు పడిన ఓ మహర్షి...
మెలికలను మలుపులుగా మార్చిన ఓ మార్గదర్శి...
పోరాటమే ఊపిరైన చైతన్యమూర్తి...
ఇచ్చే మనసున్న, అడిగే అవసరం రాని
సమాజం కోసం పాటుపడ్డ ఓ ప్రజాశక్తి...
చరిత్ర మీ కీర్తిని ముందుమాటగా రాసుకుంటుంది...
మీ స్ఫూర్తిని ముందు తరాలతో పంచుకుంటుంది.
ఓ మనిషీ...
ఓ మహాత్మా...
మీకు ఇవే మా జోహార్లు....

నారా చంద్రబాబు నాయుడు
నారా లోకేష్, నారా గిరీష్, నారా రోహిత్



అట్లూరి నారాయణరావు,
కన్వీనర్ - NTR Literature Committee
గౌరవాధ్యక్షులు, ఆం.ప్ర. సాధు పరిషత్

హోండా యాక్టివా ఎలక్ట్రిక్ వచ్చేస్తోంది..



బెంగళూరు: దేశంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఎలక్ట్రిక్ స్కూటర్ల విభాగంలోకి జపాన్‌కు చెందిన హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ కూడా ప్రవేశించింది. దేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న స్కూటర్ మోడల్ యాక్టివాలో ఎలక్ట్రిక్ వెర్షన్‌తోపాటు క్యూసీ1 అనే కొత్త ఎలక్ట్రిక్ మోడల్‌ను బుధవారం ఆవిష్కరించింది. వీటి బుకింగ్ సౌకర్యం వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ప్రారంభమవుతుందని, ఫిబ్రవరి నుంచి కస్టమర్లకు వాహనాలను అందించనున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది. అయితే, వీటి ధరలను మాత్రం వెల్లడించలేదు.

మార్కెట్లోకి రియల్‌మీ జీటీ 7 ప్రో

ప్రారంభ ధర రూ.56,999



న్యూఢిల్లీ: ప్రముఖ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ రియల్‌మీ తాజాగా 'జీటీ 7 ప్రో' మోడల్‌ను భారత మార్కెట్లోకి విడుదల చేసింది. క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ ఫ్లాగ్‌షిప్ చిప్‌సెట్‌తో దేశీయ విపణిలోకి వస్తున్న తొలి స్మార్ట్‌ఫోన్ మోడల్ ఇదే. దీని (12జీబీ ర్యామ్+256 జీబీ మెమొరీ) ప్రారంభ ధర రూ.59,999 కాగా, 16జీబీ ర్యామ్+ 512 జీబీ మెమొరీ సామర్థ్యంతో కూడిన మోడల్ రేటు రూ.65,999. ఈనెల 29 నుంచి అమెజాన్, రియల్‌మీ వెబ్‌సైట్లతోపాటు ఆఫ్‌లైన్ స్టోర్లలోనూ ఈ ఫోన్ అందుబాటులోకి వస్తుంది. లాంచింగ్ ఆఫర్‌లో భాగంగా కంపెనీ ఈ ఫోన్‌పై రూ.3,000 బ్యాంక్ ఆఫర్‌ను ప్రకటించింది. ఈనెల 28 కల్లా బుక్ చేసుకున్న వారికి ఏడాది అదనపు వారెంటీ కూడా కల్పిస్తోంది.

భారీగా పెరిగిన వెండి

» ఒక్కరోజే రూ.5,200 అప్

న్యూఢిల్లీ: దేశీయంగా విలువైన లోహాల ధరలు మళ్లీ పుంజుకున్నాయి. ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.650 పెరిగి రూ.78,800కు చేరుకోగా.. కిలో వెండి ఏకంగా రూ.5,200 పెరుగుదలతో రూ.95,800 ధర పలికింది. వెండి ధర ఒక రోజులో ఇంత భారీగా పెరగడం ఇదే ప్రథమం. అంతర్జాతీయ విపణిలో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం 1.02 శాతం పెరిగి 2,673 డాలర్లకు చేరుకోగా.. వెండి 30.94 డాలర్లకు ఎగబాకింది.

ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ షేరు 13% వృద్ధి

ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ లిస్టింగ్ రోజున అంచనాలను మించి దూసుకుపోయింది. ఐపీఓ ధర రూ.108తో పోలిస్తే, బీఎస్ఈలో ఈ షేరు 3.33 శాతం లాభంతో రూ.111.60 వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. ఒకదశలో 13.65 శాతం వరకు పెరిగిన షేరు.. తొలి రోజు ట్రేడింగ్ నిలిచేసరికి రూ.13.06 శాతం లాభంతో రూ.122.10 వద్ద ముగిసింది. దాంతో కంపెనీ మార్కెట్ విలువ మొదటి రోజే రూ.లక్ష కోట్ల మైలురాయిని దాటేసింది.

ఎస్‌బీఐ రూ.50,000 కోట్ల సేకరణ

బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ ఏడో విడత ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బాండ్ల జారీ ద్వారా రూ.10,000 కోట్లు సమీకరించింది. దాంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఎస్‌బీఐ సేకరించిన మొత్తం నిధుల విలువ రూ.50,000 కోట్లకు చేరుకుంది.

లంచం ఆరోపణల్లేవ్..

స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు ఏజీఈఎల్ వివరణ



న్యూఢిల్లీ: తమ ఛైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన అనుచరులపై అమెరికాలో లంచం అభియోగాలు మాత్రం నమోదు కాలేదని గ్రూప్ కంపెనీ అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఏజీఈఎల్) బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు వివరణ ఇచ్చింది. అయితే వారిపై కేవలం జరిమానాలు విధించేందుకు అవకాశాలున్న సెక్యూరిటీస్ అండ్ వైర్ ఫ్రాడ్ సహా మూడు ఇతర అభియోగాలు నమోదైనట్లు ఏజీఈఎల్ తెలిపింది. న్యూయార్క్ కోర్టులో యూఎస్ డీఓజే (డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్) దాఖలు చేసిన అభియోగాల్లో గౌతమ్ అదానీ, ఆయన అల్లుడు సాగర్ లేదా వినీత్ జైన్‌ల పేర్లను యూఎస్ ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సీపీఏ) ఉల్లంఘనల ఆరోపణల్లో ఎక్కడా ప్రస్తావించలేదని ఏజీఈఎల్ పేర్కొంది. ఏజీఈఎల్ నుంచి సౌర విద్యుత్ సరఫరా ఒప్పందాలు చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ సహా నాలుగు రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారులకు 25 కోట్ల డాలర్ల (రూ.2,200 కోట్లు) లంచాలు ఇచ్చారనే ఆరోపణలపై అదానీ గ్రూప్‌పై అమెరికాలో కేసు నమోదైన విషయం తెలిసిందే.

20% వరకు పెరిగిన గ్రూప్ షేర్లు

ఏజీఈఎల్ తాజా వివరణతో అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు బుధవారం 20 శాతం వరకు లాభపడ్డాయి. అదానీ టోటల్ గ్యాస్ 19.76 శాతం, అదానీ పవర్ 19.66 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 11.56 శాతం, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ , అదానీ గ్రీన్ ఎనర్జీ 10 శాతం చొప్పున ఎగబాకాయి. ఎన్‌డీటీవీ షేరు 9.35 శాతం వృద్ధి చెందగా.. అదానీ విల్మార్ 8.46 శాతం, అదానీ పోర్ట్స్ 6.29 శాతం, అంబుజా సిమెంట్స్ 4.40 శాతం, ఏసీసీ 4.16 శాతం, సంఘీ ఇండస్ట్రీస్ 4.73 శాతం పెరిగాయి. దాంతో అదానీ గ్రూప్‌లోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.1,24,693 కోట్లు పెరిగింది.

మార్కెట్‌కు అదానీ బూస్ట్

అదానీ గ్రూప్‌తోపాటు కొన్ని ప్రధాన కంపెనీల షేర్లలో కొనుగోళ్లు, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులతో స్టాక్ మార్కెట్ సూచీలు ఒక మోస్తరు లాభాల్లో ముగిశాయి. బుధవారం ఉదయం సెషన్‌లో స్వల్ప లాభనష్టాల మధ్య ఊగిసలాడిన సెన్సెక్స్.. మధ్యాహ్నం ఒకదశలో 507 పాయింట్ల మేర ఎగబాకింది. చివరికి 230.02 పాయింట్ల వృద్ధితో 80,234.08 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 80.40 పాయింట్ల లాభంతో 24,274.90 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 18 రాణించాయి. అదానీ పోర్ట్స్ షేరు 6శాతానికి పైగా ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది.

ఐటీలో కొలువుల పండుగ

వచ్చే 6 నెలల్లో 12 శాతం వృద్ధి అంచనా



న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా పరిశ్రమలు, ఆర్థిక వ్యవస్థల స్వరూపాన్ని సంపూర్ణంగా మార్చి వేయగల టెక్నాలజీలు త్వరితగతిన అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఐటీ సర్వీసుల విభాగంలో నియామకాలు జోరందుకోనున్నాయి. రాబోయే ఆరు నెలల కాలంలో ఐటీ రంగంలో నియామకాలు 10-12 శాతం పెరుగుతాయని క్వెస్ కార్ప్ తాజా నివేదికలో అంచనా వేసింది. ప్రధానంగా జెనరేటివ్ ఏఐ, డీప్ టెక్, క్వాంటమ్ కంప్యూటింగ్ విభాగాల్లో 2030 నాటికి 10 లక్షల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని ఆ సంస్థ చెబుతోంది. జూన్ త్రైమాసికంతో పోల్చితే నిపుణుల డిమాండు గ్లోబల్ కెపాసిటీ సెంటర్ల (జీసీసీ) విభాగంలో 71 శాతం, సైబర్ సెక్యూరిటీ విభాగంలో 58 శాతం పెరిగినట్టు ఆ నివేదికలో పేర్కొన్నారు. వర్తమాన ఆర్థిక సంవత్సరం తొలి రెండు త్రైమాసికాల గణాంకాల ఆధారంగా ఈ నివేదిక రూపొందించారు. క్వెస్ ఐటీ స్టాఫింగ్ డిజిటల్ నైపుణ్యాల నివేదిక ప్రకారం డెవలప్‌మెంట్, ఈఆర్‌పీ, టెస్టింగ్, నెట్‌వర్కింగ్, డేటా సైన్స్ సహా ఐదు విభాగాల్లో స్థూల డిమాండు 79 శాతం పెరిగిందని ఆ విభాగం సీఈఓ కపిల్ జోషి తెలిపారు.

నివేదిక ముఖ్యాంశాలు..

- టెక్ ఉద్యోగాలకు జీసీసీలు ప్రధాన చోదక శక్తిగా ఉన్నాయి. ఏఐ/ఎంఎల్, అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్, డెవ్ ఆప్స్ విభాగాల్లో నిపుణుల డిమాండు అధికంగా ఉంది.
- టెక్ విభాగంలో 62 శాతం ఉద్యోగ ప్రకటనలతో బెంగళూరు తిరుగులేని నాయకత్వ స్థానంలో ఉంది. హైదరాబాద్ (43.5 శాతం), పుణె (10 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.
- జీసీసీల విస్తరణతో విభిన్న నగరాల్లో నిపుణులకు డిమాండు గణనీయంగా పెరుగుతోంది. ఇంజినీరింగ్, ఐటీ, ఫైనాన్స్, అనలిటిక్స్ విభాగాల్లో నిపుణులను జీసీసీలు అధికంగా నియమించుకుంటున్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో అల్లానా గ్రూప్ చికెన్ ప్రాసెసింగ్ ప్లాంట్లు

రూ.200 కోట్ల వరకు పెట్టుబడి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కోళ్ల పరిశ్రమకు చెందిన ప్రముఖ సంస్థ 'అల్లానా' గ్రూప్ తన వ్యాపార కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా దేశంలోని ఆరు ప్రాంతాల్లో చికెన్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రోజుకు ఒక్కో ప్లాంటులో 60,000 కోళ్లను ప్రాసెస్ చేసేలా ఈ ప్లాంట్లు ఏర్పాటు చేయనుంది. ఇందులో నాలుగు ప్లాంట్లు సొంతంగా, రెండు ప్లాంట్లు ఇతర పౌల్ట్రీ సంస్థలతో కలిసి సంయుక్తంగా ఏర్పాటు చేస్తామని హైదరాబాద్‌లో జరుగుతున్న పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పోకు హాజరైన అల్లానా గ్రూప్ ఎండీ మోయిజ్ చునావాలా చెప్పారు. సొంతంగా ఏర్పాటు చేసే నాలుగు ప్లాంట్లలో ఒకటి తెలంగాణలోని జహీరాబాద్ వద్ద, రెండోది ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ వద్ద ఏర్పాటు చేస్తామన్నారు. ఒక్కో ప్లాంటు ఏర్పాటుకు రూ.100 కోట్ల వరకు ఖర్చవుతుందన్నారు. క్వాలిటీ యానిమల్‌ఫీడ్స్, కస్తూరి పౌల్ట్రీ ఫామ్స్‌తో కలిసి రెండు జాయింట్ వెంచర్ కంపెనీలు ఏర్పాటు చేసేందుకు కూడా అల్లానా గ్రూప్ బుధవారం పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పోలో ఎంఓయూలు కుదుర్చుకుంది. ఈ ఎక్స్‌పో సందర్భంగా వివిధ పౌల్ట్రీ కంపెనీలతో కలిసి ఇండియన్ పౌల్ట్రీ అలయెన్స్‌ను ఏర్పాటు చేసింది.

దాణా ఉత్పత్తులపై జీఎస్‌టీ తగ్గించాలి

పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు బయాస్ విజ్ఞప్తి

హైదరాబాద్ సిటీ, (ఆంధ్రజ్యోతి): పౌల్ట్రీ రంగానికి దేశవ్యాప్తంగా ఆదరణ పెరుగుతోందని పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బయాస్ అన్నారు. ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్(ఐపీఈఎంఏ) ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో- 2024ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆహార భద్రత, గ్రామీణ ఉపాధి, పోషకాహారానికి మూలస్తంభమైన పౌల్ట్రీ రంగానికి అండగా నిలవాలని ప్రభుత్వాన్ని కోరారు. వ్యాక్సిన్ దిగుమతులకు సత్వర అనుమతులు జారీచేయాలని విజ్ఞప్తి చేశారు. దాణా తయారీలో ప్రధాన ముడి పదార్థాలైన మొక్కజొన్న, సోయాలపై జీఎస్‌టీ భారం తగ్గించాలని కోరారు. ఎగ్జిబిషన్‌కు పెద్దసంఖ్యలో కోళ్ల పరిశ్రమ వర్గాలు తరలివచ్చాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,510 ▲	71,050 ▲	97,800 ▼
ముంబై	76,180 ▲	69,780 ▲	88,430 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



28వ తేదీ			
హైదరాబాద్	590	విజయవాడ	600
వరంగల్	592	గోదావరి	595
చిత్తూరు	603	విశాఖపట్నం	595
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	109
వరంగల్	110	గుంటూరు	109
కరీంనగర్	110	ఒంగోలు	109
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	97
కర్నూలు	110	నెల్లూరు	97
విశాఖపట్నం	115	అనంతపురం	97
గోదావరి	109		

స్పోర్ట్స్

హాకీ కుర్రాళ్ల సూపర్ బోణీ

ఆసియా కప్‌లో 11-0తో థాయ్‌లాండ్‌పై భారత్ గెలుపు

మస్కట్: జూనియర్ ఆసియా కప్‌లో భారత హాకీ కుర్రాళ్లు అద్భుత శుభారంభాన్ని అందుకున్నారు. పూల్-ఎలో భాగంగా బుధవారం జరిగిన తమ తొలి పోరులో 11-0 గోల్స్ తేడాతో థాయ్‌లాండ్‌ను చిత్తుగా ఓడించారు. డిఫెండింగ్ చాంపియన్ భారత్ ఆరంభం నుంచే ఆధిపత్యం సాగిస్తూ పూర్తి ఏకపక్షంగా మ్యాచ్‌ను ముగించింది. అరైజీత్ సింగ్, గుర్జోత్, సౌరభ్‌లు తలో రెండు గోల్స్‌తో విజృంభించగా.. అర్ష్‌దీప్, దిల్‌రాజ్, ముకేశ్, శార్దానంద్, రోహిత్ తలో గోల్ కొట్టారు. భారత్ తన రెండో మ్యాచ్‌ను గురువారం జపాన్‌తో ఆడనుంది.

దక్షిణాఫ్రికా 80/4

డర్బన్: దక్షిణాఫ్రికా-శ్రీలంక తొలి టెస్ట్‌కు వరుణుడు తీవ్ర ఆటంకం కలిగించాడు. దీంతో బుధవారం మొదలైన మొదటి టెస్ట్‌లో 20.4 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 80/4 స్కోరు చేసింది. వర్షంతో మొదటి రోజు ఆట నిలిచే సమయానికి కెప్టెన్ బవుమా (28), కైల్ వెరియన్నె (9) క్రీజులో ఉన్నారు. మార్‌క్రమ్ (9), టోనీ జోర్జి (4), స్టబ్స్ (16), డేవిడ్ బెడింగమ్ (4) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. లహిరు కుమార రెండు వికెట్లు పడగొట్టాడు.



పాలబుగ్గల ప్రాయం.. నైపుణ్యాలు అమోఘం

చెస్ వండర్ దివిత్



ప్రపంచ చెస్ వినీలాకాశంలో మరో భారత తార ఉద్భవించింది. హైదరాబాద్‌కు చెందిన పాల బుగ్గల పిల్లోడు దివిత్ అండర్-8 వరల్డ్ క్యాడెట్ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్ అందుకొని భారత్ చెస్ చరిత్రలో మరో అధ్యాయాన్ని ప్రారంభించాడు. రెండేళ్ల కిందటే తన అద్భుత నైపుణ్యాలతో ప్రస్తుతం ప్రపంచ చెస్ టైటిల్ కోసం తలపడుతున్న గుకేష్‌ను సంభ్రమాశ్చర్యాలకు లోనుచేశాడు దివిత్. హైదరాబాద్‌లో జరిగిన ఆ ఎగ్జిబిషన్ చెస్ టోర్నీ సందర్భంగా ఎండ్ గేమ్‌లో దివిత్ వేసిన ఎత్తులతో గుకేష్ షాకయ్యాడు. ఆ టోర్నీలో గుకేష్‌తోపాటు తెలంగాణ స్టార్ అర్జున్‌తో దివిత్ తలపడడం విశేషం. 'ఈ బాలుడు అమోఘంగా ఆడుతున్నాడు. నిజం చెప్పాలంటే అతడి ఆట నన్ను షాక్‌కు గురి చేసింది' అని గుకేష్ అనడం దివిత్ ప్రతిభకు అద్దం పడుతుంది. సీన్ కట్ చేస్తే..ప్రస్తుతం డింగ్ లిరెన్‌తో వరల్డ్ చెస్ టైటిల్ కోసం గుకేష్ తలపడుతున్నాడు. అదే సమయంలో ఇటలీలో జరిగిన పోటీలలో దివిత్ అండర్-8 ప్రపంచ క్యాడెట్ చాంపియన్‌గా నిలిచి సంచలనం సృష్టించాడు. 1784 ఫిడే రేటింగ్ పాయింట్లు కలిగిన దివిత్ అండర్-8 ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో గెలిచాడు. ఇందులో రెండు గేముల్లో తనకంటే ఎంతో మెరుగైన ప్రత్యర్థులను అతడు మట్టి కరిపించాడు.

చిన్నతనంలోనే మెరుపులు..

దివిత్ తల్లిదండ్రులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. చాలా చిన్నతనంనుంచే తమ కుమారుడు పజిల్స్ పరిష్కరించడంపట్ల అమితాసక్తి కనబరుస్తుండడాన్ని వారు గమనించారు. దాంతో హైదరాబాద్‌లోని ఓ పజిల్ ఇన్‌స్టిట్యూట్‌లో దివిత్‌ను చేర్పించారు. అక్కడ నుంచి ఆ చిన్నారి అడుగులు క్రమంగా చెస్‌వైపు పడ్డాయి. ఆరేళ్లకే అండర్-8 జాతీయ చెస్ పోటీల్లో పాల్గొని సత్తా చాటాడు. అనంతరం పోలవరపు రామకృష్ణ శిక్షణలో దివిత్ పూర్తిస్థాయి చెస్ పయనం మొదలైంది. రామకృష్ణ విశాఖపట్నానికి చెందిన వ్యక్తి కావడంతో తొలుత దివిత్ చెస్ క్లాస్‌లన్నీ ఆన్‌లైన్‌లోనే సాగేవి. చెస్‌పై మరింత దృష్టిపెట్టే క్రమంలో దివిత్ చదువు కూడా ఆన్‌లైన్‌లో కొనసాగింది. దివిత్‌కు అద్భుత వ్యూహాత్మక సామర్థ్యాలున్నాయి. అతడి ఎత్తులు సంక్లిష్టంగా ఉంటాయి. గ్యారీ కాస్పరోవ్..దివిత్ ఆరాధ్య ఆటగాడు. దివిత్ ఎత్తులు కూడా కాస్పరోవ్ వలే చాలా దూకుడుగా ఉంటాయి. ఓడిపోయిన దశ నుంచి పుంజుకొని దివిత్ గెలిచిన గేమ్‌లు ఎన్నో. అయితే క్లిష్టమైన ఎత్తుగడలు ఒక్కోసారి దివిత్‌కు పరాజయాలూ తెచ్చిపెట్టకపోలేదు. చెస్ కెరీర్ ఆరంభంలో దివిత్ ఆశాజనక ఫలితాలు సాధించలేదు. క్లాసికల్ టోర్నమెంట్‌లో విజయాలు దక్కలేదు. అండర్-7 జాతీయ చాంపియన్‌షిప్‌లో ఏడో స్థానంతో నిరాశ పరిచాడు. గత ఏప్రిల్‌లో ఆర్మేనియాలో జరిగిన ర్యాపిడ్ ఏజ్ గ్రూప్ టోర్నీ టైటిల్ నెగ్గడం ద్వారా దివిత్ ప్రపంచ చెస్ దృష్టిని ఆకర్షించాడు. అదే టోర్నీ..బ్లిట్జ్ కేటగిరీలో కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. అండర్-8 వరల్డ్ కప్ క్లాసికల్ విభాగంలో ఐదో స్థానం సంపాదించాడు. ఈ ఫలితాలు అండర్-8 ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు దివిత్‌లో ఎంతో ఆత్మవిశ్వాసం ఇచ్చాయి. ఈ సంవత్సరం దివిత్ 8 నుంచి 10 రేటెడ్ టోర్నీలలో పాల్గొన్నాడు. ఇందులో మూడు ప్రపంచ టోర్నమెంట్‌లూ ఉన్నాయి. ప్రస్తుతం పిన్నవయస్సు గ్రాండ్ మాస్టర్ రికార్డు అమెరికాకు చెందిన అభిమన్యు మిశ్రా (12 ఏళ్ల 4 నెలల 25 రోజులు) పేరిట ఉంది. దివిత్ సంచలన విజయాలను పరిగణనలోకి తీసుకుంటే ఆ రికార్డును హైదరాబాద్ చిన్నోడు చేజిక్కించుకొనే అవకాశాలు లేకపోలేదు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఆదినుంచే అదరగొట్టి..

మూడో గేమ్‌లో గుకేష్ గెలుపు ● ప్రపంచ చెస్



సింగపూర్: ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ ఫైనల్లో భారత గ్రాండ్ మాస్టర్ గుకేష్ తొలి విజయం అందుకున్నాడు. బుధవారం జరిగిన మూడో రౌండ్‌లో డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్‌ను గుకేష్ చిత్తు చేశాడు. దాంతో 14 గేముల చాంపియన్‌షిప్‌లో లిరెన్, గుకేష్ చెరో 1.5 పాయింట్లతో సమంగా నిలిచారు. మొదటి గేమ్‌లో లిరెన్ గెలవగా, రెండో గేమ్ డ్రా అయిన సంగతి తెలిసిందే. గురువారం విశ్రాంతి దినం. శుక్రవారం నాలుగో రౌండ్ జరుగుతుంది. మూడో రౌండ్‌లో తెల్లపావులతో బరిలోకి దిగిన గుకేష్ ఆరంభంనుంచే అదరగొట్టాడు. టోర్నీ నిబంధనల ప్రకారం..తొలి 120 నిమిషాల్లో 40 ఎత్తులను ఆటగాళ్లు పూర్తి చేయాలి. 13వ ఎత్తుకు వచ్చేసరికి గుకేష్ తిరుగులేని స్థితిలో నిలిచాడు. అప్పటికి గుకేష్ కేవలం నాలుగు నిమిషాలే తీసుకోగా..లిరెన్ సమయంలో గంటా ఆరు నిమిషాలు అయిపోయింది. దాంతో 32 ఏళ్ల చైనా జీఎం ఒత్తిడిలో పడిపోయాడు. చివరి ఆరు ఎత్తులకు అతడికి కేవలం పది సెకన్లకంటే తక్కువ సమయమే మిగిలింది. దాంతో 37వ ఎత్తులో లిరెన్ ఓటమి అంగీకరించక తప్పలేదు.

జూ. మెస్సీ అరంగేట్రం



బ్యూనస్ఎయిర్స్: అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ లియోనెల్ మెస్సీ పెద్ద కుమారుడు థియాగో మెస్సీ అండర్-13 పోటీల్లో అరంగేట్రం చేశాడు. నెవెల్స్ కప్‌లో ఇంటర్ మయామి యూత్ జట్టు తరఫున 12 ఏళ్ల థియాగో బరిలోకి దిగాడు. అయితే, ఈ మ్యాచ్‌లో నెవెల్స్ ఓల్డ్ బాయ్స్ 1-0తో గెలిచింది. థియాగో సెకండాఫ్‌లో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చాడు. ఈ మ్యాచ్ వీక్షణకు లియోనెల్ రాకపోయినా.. మెస్సీ భార్య రొకొజో, ఇతర కుటుంబ సభ్యులు హాజరయ్యారు.


28 బంతుల్లో సెంచరీ

టీ20ల్లో ఉర్విల్ పటేల్ రికార్డు



ఇండోర్: ఐపీఎల్ వేలంలో ఏ జట్టుకూ పట్టని ఆటగాడిగా మిగిలిన గుజరాత్ వికెట్ కీపర్/బ్యాటర్ ఉర్విల్ పటేల్ (35 బంతుల్లో 7 ఫోర్లు, 12 సిక్స్‌లతో 113 నాటౌట్) టీ20ల్లో రెండో వేగవంతమైన శతకం నమోదు చేశాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బుధవారం త్రిపురతో జరిగిన మ్యాచ్‌లో పటేల్ కేవలం 28 బంతుల్లో సెంచరీ బాదేశాడు. ఈ క్రమంలో 2018లో ఇదే టోర్నీలో హిమాచల్‌తో మ్యాచ్‌లో ఢిల్లీ తరఫున రిషభ్ పంత్ 32 బంతుల్లో శతకం రికార్డును పటేల్ అధిగమించాడు. కాగా, ఓవరాల్‌గా పొట్టి క్రికెట్‌లో వేగవంతమైన సెంచరీ రికార్డు ఎస్తోనియా బ్యాటర్ సాహిల్ చౌహాన్ (27 బంతులు) పేరిట ఉంది. పటేల్ వీరవిహారంతో.. 155/8 స్కోరును గుజరాత్ 10.2 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది.

తీర్థుకు స్వర్ణం వర్షిత్‌కు రజతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): జాతీయ స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తెలుగు స్విమ్మర్లు సత్తా చాటారు. రాజ్‌కోట్‌లో బుధవారం జరిగిన అండర్-17 బాలుర 400 మీటర్ల మెడ్లేలో విజయవాడకు చెందిన తీర్థు సామదేవ్ స్వర్ణం, హైదరాబాద్ స్విమ్మర్ వర్షిత్ రజతం గెలిచారు.

హైదరాబాద్ మరో పరాజయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో హైదరాబాద్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓటమిపాలైంది. బుధవారం రాజ్‌కోట్‌లో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ 24 పరుగులతో హైదరాబాద్‌పై గెలిచింది. తొలుత రాజస్థాన్ 20 ఓవర్లలో 187/8 స్కోరు చేసింది. ఛేదనలో హైదరాబాద్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 167 రన్స్‌కే పరిమితమై ఓటమిపాలైంది. ఇక, ఉప్పల్ స్టేడియంలో జరిగిన పోరులో ఆంధ్ర జట్టు 8 వికెట్లతో గోవాను చిత్తుచేసి వరుసగా రెండో గెలుపు అందుకుంది.

బీజేపీలో చేరితే.. నిషేధం ఎత్తేస్తారు

బజ్‌రంగ్ పూనియా

న్యూఢిల్లీ: తనపై నాలుగేళ్ల నిషేధం విధించడంపై స్టార్ రెజ్లర్ బజ్‌రంగ్ పూనియా ఘాటుగా స్పందించాడు. తాను కనుక బీజేపీలో చేరితే నిషేధాన్ని ఎత్తేస్తారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించాడు. డోప్ పరీక్షకు మూత్రం నమూనా ఇవ్వకపోడంతో పూనియాపై నాలుగేళ్ల నిషేధాన్ని విధిస్తూ జాతీయ డోపింగ్ వ్యతిరేక సంస్థ (నాడా) మంగళవారం నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. దీనిపై బజ్‌రంగ్ స్పందిస్తూ.. 'నాడా నిర్ణయంతో షాక్‌కు గురి కాలేదు. ఇది ప్రతీకారం తప్ప మరోటికాదు. నేనిప్పుడు బీజేపీలో చేరితే నాపై నిషేధం ఎత్తివేస్తారు' అని చెప్పుకొచ్చాడు.

ఇండియా-ఎ జట్టు వైస్ కెప్టెన్‌గా త్రిష

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఇండియా అండర్-19 ఏ-జట్టు వైస్ కెప్టెన్‌గా తెలంగాణ అమ్మాయి త్రిషా రెడ్డిని నియమించారు. ఇండియా-ఎ, బి, దక్షిణాఫ్రికా అండర్-19 జట్ల మధ్య వచ్చేనెల 3 నుంచి 12వరకు పుణెలో జరగనున్న ముక్కోణపు సిరీస్‌లో ఆడే భారత జట్లను బీసీసీఐ బుధవారం ప్రకటించింది. ఇండియా-ఎలో తెలంగాణ అమ్మాయిలు త్రిష, కావ్యశ్రీ, విశాఖపట్నం క్రికెటర్ షబ్నం, ఇండియా-బిలో హైదరాబాద్ క్రికెటర్ కేసరి ధ్రుతికి స్థానం లభించింది.

ప్రీక్వార్టర్స్‌కు సింధు, లక్ష్య సేన్



లఖ్‌నవూ: సయ్యద్ మోదీ అంతర్జాతీయ టోర్నీలో పీవీ సింధు, లక్ష్యసేన్ ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లారు. బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో సహచరి అన్‌మోల్ కర్బ్‌పై సింధు 21-17, 21-15తో గెలిచింది. ఇతర మ్యాచ్‌ల్లో మాళవిక బన్సోడ్ 21-16, 21-7తో డబ్‌జెన్స్కా (పోలెండ్)పై, అనుపమ ఉపాధ్యాయ్ 19-21, 22-20, 21-15తో ఫాతిమాపై, ఐరా శర్మ 21-13, 21-19తో దీప్షిక సింగ్‌పై, ఉన్నతి హుడా 21-12, 21-16తో తమోన్‌వాన్ (థాయ్)పై గెలిచారు. అయితే, మూడో సీడ్ ఆకర్షి కశ్యప్ 8-21, 12-21తో ఉ లి యు (చైనా) చేతిలో ఓడింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ 21-12, 21-12తో ఐదిల్ (మలేసియా)పై, కిరణ్ జార్జ్ 21-12, 23-21తో ఆలాప్ మిశ్రాపై, ప్రియాంశు రజావత్ 21-13, 21-12తో కార్తికేయపై గెలిచారు. డబుల్స్‌లో తనీషా క్రాస్టో-అశ్విని పొన్నప్ప 21-12, 21-10తో ఇషు మాలిక్-తనుపై, ప్రియ-శ్రుతి జోడీ 21-14, 21-12తో అలీషా-వర్షిణిపై గెలిచి ముందంజ వేశారు. కాగా, ట్రీసా జాలీ-గాయత్రి జంటకు వాకోవర్ లభించింది. సాయి ప్రతీక్-పృథ్వీ, ఇషాన్-శంకర్ ప్రసాద్, హరిహరన్-రూబెన్ జోడీలు కూడా రెండో రౌండ్‌కు చేరుకొన్నాయి.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సర్కారీ బడుల్లో స్పోకెన్ ఇంగ్లిష్

ఖమ్మం జిల్లాలో తొలివిడతగా

16 పాఠశాలల్లో బోధన మొదలు

రెండో దశలో 18 పాఠశాలల్లో

పిల్లల్లో పెరుగుతున్న ప్రావీణ్యం 2



విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లి‌ష్‌లో శిక్షణ ఇస్తున్న దృశ్యం

గురువారం | 28-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 240 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్



పిల్లలు మరణిస్తే తప్ప..

స్పందించరా?

- ఒకే పాఠశాలలో వారంలో 3 సార్లు ఆహార కల్తీయా?
- మీరు మనుషులు కాదా? డీఈవో నిద్రపోతున్నారా?
- నాన్‌బెయిలబుల్ వారెంట్ ఇస్తే 5 నిమిషాల్లో ఇక్కడుంటారు
- మధ్యాహ్న భోజనం నిధుల అక్రమాల్లో మీ వాటా ఎంత?
- అధికారులు సిగ్గుపడాలి.. ప్రభుత్వ నిర్లక్ష్యమూ ఉంది
- మాగనూరు జడ్పీ పాఠశాల ఘటనపై హైకోర్టు ఆగ్రహం
- ఆహార నమూనాలను ల్యాబ్‌కు పంపాలని ఆదేశాలు
- బయట చిరుతిళ్ల వల్లే అలా జరిగింది: ఏజీ

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఆహార కల్తీ, మధ్యాహ్న భోజనం వికటించడం వల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్న ఘటనలపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ప్రధానంగా నారాయణపేట జిల్లా మాగనూరు జడ్పీ ఉన్నతపాఠశాలలో ఒకే వారంలో మూడుసార్లు ఫుడ్ పాయిజన్ కావడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. 'మీరు మనుషులు కాదా? మీకు పిల్లలు లేరా?' అంటూ అధికారుల తీరును తప్పుబట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో.. ప్రమాణాలకు, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మధ్యాహ్న భోజనం పెట్టడం లేదని, ప్రైవేటు పాఠశాలల్లో పీఎం పోషణ్ మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం లేదని పేర్కొంటూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. రాష్ట్రంలో ఇటీవల జరుగుతున్న ఆహార కల్తీ ఘటనలు, విద్యార్థుల మరణాల వంటి అంశాలను ధర్మాసనం

మిగతా 10వ పేజీలో...

'మధ్యాహ్న భోజనం' ధరల పెంపు

ప్రాథమిక పాఠశాలలో ఒక్కో విద్యార్థికి రూ.6.19

ప్రాథమికోన్నత పాఠశాలల్లో రూ.9.29

74 పైసల నుంచి రూ.1.12కు పెంచిన కేంద్రం

బీఆర్ఎస్ గురుకుల బాట.. 30 నుంచి డిసెంబరు 7దాకా

ఐదుగురితో అధ్యయన కమిటీ: కేటీఆర్

10

రైతు భరోసా



సంక్రాంతి నుంచి..

శాసనసభ సమావేశాల నాటికి ఉపసంఘం నివేదిక

సభలో చర్చించి విధివిధానాలు?

యాసంగి సీజన్ నుంచి ఎకరానికి రూ.7,500 చొప్పున

30న రైతు సదస్సు.. 4 లక్షల మంది రైతులకు రుణమాఫీ

2 లక్షల్లోపు ఉండి, వివిధ కారణాలతో మాఫీ కాని వారికే

వీరికి రూ.2,800 కోట్లు.. తర్వాత రూ.2లక్షలకు పైగా ఉన్న వారికి

యాసంగిలోనూ సన్నాలకు 500 బోనస్ పథకం వర్తింపు?

ఇక నుంచి ఏటా రెండు పంటలకూ ఇవ్వాలని ఆలోచన!



పాలమూరులో రైతు సదస్సుకు ఏర్పాట్లు

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పనుంది. రైతుభరోసా కోసం ఎదురుచూస్తున్న రైతులకు సంక్రాంతి కానుకగా పెట్టుబడి సాయాన్ని అందించనుంది. రైతుబంధు పేరుతో బీఆర్ఎస్ హయాంలో ఎకరానికి రూ. 5 వేలు ఇవ్వగా రైతుభరోసా పేరుతో కాంగ్రెస్ సర్కారు జనవరిలో రెండో పంటకు (యాసంగి) ఎకరానికి రూ. 7,500 చొప్పున పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు డిసెంబరు రెండో వారంలో నిర్వహించే శాసనసభ సమావేశాల్లో చర్చించి విధివిధానాలు ఖరారు చేయాలని నిర్ణయించింది. ఆలోపే రైతుభరోసాపై భట్టి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం నివేదిక సమర్పించనుంది. ఉపసంఘం నివేదికను రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కూడా చర్చించనున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా పాలమూరులో రైతుసదస్సు నిర్వహిస్తున్నారు. ఈనెల 30న నిర్వహించే ఈ సదస్సు సందర్భంగా 4లక్షల మంది రైతులకు రుణమాఫీ బకాయిలు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రూ.2లక్షల రుణమాఫీ

మిగతా 12వ పేజీలో...



30న 4లక్షల మంది రైతులకు రుణమాఫీ

12

- బ్యాంకు ఖాతాల్లోకి 'బోనస్' జమ కూడా
- వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలో పంటల బీమా
- కొహెడ వద్ద అతిపెద్ద మోడల్ మార్కెట్
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల ప్రకటన

రైతు సదస్సుకు సర్వం సిద్ధం

మంత్రి తుమ్మల చేతుల మీదుగా నేడు ప్రారంభం



ఢిల్లీలో ప్రధాని మోదీని కలిసిన తెలంగాణ బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు

తక్కువ కాలంలో..

ఎక్కువ వ్యతిరేకత

కేసీఆర్ మాదిరే రేవంత్ పాలన

సమస్యలపై ప్రశ్నిస్తే వ్యక్తిగత దాడులు

హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మూటగట్టుకుంది

ఆ పార్టీని ఎదుర్కోవడం పెద్ద కష్టమేమీ కాదు

బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు చీకటి రోజులు

బీజేపీయే ప్రత్యామ్నాయం.. అధికారంలోకి రావాలి

మహారాష్ట్రలో విజయాన్ని స్ఫూర్తిగా తీసుకోండి

అభివృద్ధి అజెండాతో ప్రజల వద్దకు వెళ్లండి

రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ/హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అతి తక్కువ కాలంలో ఎక్కువ ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని ప్రధాని మోదీ అన్నారు. కాంగ్రెస్ పాలన పట్ల రాష్ట్ర ప్రజలు విరక్తి చెందారని, అదే సమయంలో గత బీఆర్ఎస్ పాలనలోని చీకటి రోజులను వారు మరచిపోలేదని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో బీజేపీ మాత్రమే ప్రజలకు ప్రత్యామ్నాయంగా కనిపిస్తోందని, వారి నమ్మకానికి అనుగుణంగా పనిచేయాలని తెలంగాణకు చెందిన ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలకు సూచించారు. బుధవారం పార్లమెంటులో వారు తనను కలిసిన సందర్భంగా మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, వివిధ అంశాలపై

మిగతా 11వ పేజీలో...

ఇథనాల్ ఫ్యాక్టరీని తరలిస్తాం

లేదంటే దాన్ని పూర్తిగా రద్దు చేస్తాం

దిలావర్‌పూర్ ప్రజలకు సీతక్క హామీ

రైతులకు ఫోన్ చేసి మాట్లాడిన మంత్రి

ఫ్యాక్టరీ నిర్మాణానికి వ్యతిరేకంగా రెండోరోజూ కొనసాగిన ఆందోళనలు

నిర్మాణ పనుల నిలిపివేతపై కలెక్టర్ హామీ

ఇచ్చినా సంతృప్తి చెందని అన్నదాతలు

లిఖితపూర్వక హామీకి పట్టు

రైతులతో కలెక్టర్ భేటీ.. నిర్ణయం వెల్లడి

అంతకుముందే లోతుగా సర్కారు చర్చ

ఆపై పనులను ఆపాలని ఆదేశం

సంబరాలు చేసుకున్న దిలావర్‌పూర్, గుండంపల్లి రైతులు



నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిలతో ఆనందం పంచుకుంటున్న మహిళలు

నిర్మల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలోని దిలావర్‌పూర్-గుండంపల్లి గ్రామాల ప్రజలకు పెద్ద ఊరట లభించింది. ఆ గ్రామాల మధ్య నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీని పూర్తిగా రద్దు చేయడమో, తరలించడమో చేస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఈ మేరకు అక్కడి ప్రజలకు ఆమె ఫోన్ చేసి హామీ ఇచ్చారు. ఇథనాల్ ఫ్యాక్టరీని దిలావర్‌పూర్ నుంచి తరలించాలంటూ మంగళవారం రోడ్డెక్కి ఆందోళన చేసిన స్థానిక రైతులు బుధవారం తమ నిరసనను ఉధృతం చేశారు. రోడ్డుపై భారీ సంఖ్యలో చేరి.. రాస్తారోకో నిర్వహించారు. వంటావార్పు చేసి

మిగతా 9వ పేజీలో...



'అదానీ'పై దుమారం

జేపీసీతో విచారణకు ప్రతిపక్ష సభ్యుల డిమాండ్

పార్లమెంటు ఉభయసభల్లో ఆందోళనలు

ఎలాంటి కార్యకలాపాలు లేకుండానే వాయిదా

రేషన్ డీలర్లకు మార్జిన్ పెంచే యోచన లేదు

లోక్‌సభలో స్పష్టం చేసిన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

2

మోదీదే తుది నిర్ణయం

సీఎం ఎంపికపై స్పష్టత ఇచ్చిన ఏక్‌నాథ్ శిందే

కేంద్ర మంత్రి పదవిపై ఆసక్తి లేదని వెల్లడి

శిందే, అజిత్ పవార్‌లకు ఢిల్లీ నుంచి ఆహ్వానం

ఢిల్లీకి ఫడణవీస్.. మహా కొత్త సీఎం ప్రమాణం 2న?

రాజ్యాంగాన్ని మోసం చేయడమే

రిజర్వేషన్ కోసమే మతం మారడమంటే అంతే..

- అలాంటి ఆలోచనలు రిజర్వేషన్ల స్ఫూర్తినే దెబ్బతీస్తాయి
- హిందూ మతం నుంచి క్రైస్తవానికి మారినప్పుడు వారి కులం గుర్తింపు కూడా పోతుంది
- తిరిగి హిందూగా మారాలంటే తగిన ఆధారాలుండాలి
- తనకు ఎస్సీ సర్టిఫికెట్ ఇప్పించాలన్న తమిళనాడు యువతి సెల్వరాణి పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ, నవంబరు 27: కేవలం ఉద్యోగాల్లో రిజర్వేషన్ కోసమని మతం మారడం రాజ్యాంగాన్ని మోసం చేయడమేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తనకు ఎస్సీ సర్టిఫికెట్ ఇచ్చేలా అధికారులను ఆదేశించాలంటూ ఓ క్రైస్తవ యువతి వేసిన రిట్ పిటిషన్‌ను కొట్టివేసింది. బాప్టిజం తీసుకొని హిందూ మతం నుంచి క్రైస్తవానికి మారిన వారు తిరిగి హిందువులమంటూ చెప్పుకోలేరని, వారి కులం గుర్తింపు కూడా మతం మారినప్పుడే రద్దవుతుందని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ మహాదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ నెల 26న కీలక తీర్పునిచ్చింది. మతాన్ని ఆచరించడం అనేది వ్యక్తిగత

మిగతా 2వ పేజీలో...



మహిళ మరణించిన మైహోం భూజ అపార్ట్‌మెంట్

సరగసీ కోసం తెచ్చి లైంగిక వేధింపులు

ఆ కామాంధుడి నుంచి తప్పించుకునే యత్నంలో మహిళ దుర్మరణం 2

తొమ్మిదో అంతస్తు నుంచి కిందపడి మృతి

రాయదుర్గం పీఎస్ పరిధిలో విషాదం

దీపపు చిమ్నీ పేలి..

హైదరాబాద్‌లోని మణికొండలో ఓ అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

రూ.75 లక్షల ఆస్తి నష్టం 11

సాక్ష్యాలన్నీ ధ్వంసం

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో గ్రౌటింగ్‌తో టెక్నికల్ డేటా మాయం

బ్యారేజీల వైఫల్యానికి కారణాలు తెలిపే ఆధారాల్లేకుండా పోయాయి

32 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాణహితను పక్కనపెట్టి రూ.1.27 లక్షల కోట్లతో కాళేశ్వరం.. నీళ్లు పారింది ఐదేళ్లలో 162 టీఎంసీలే

కాళేశ్వరం కమిషన్‌తో కేంద్ర జలశక్తి సలహాదారు వెదిరె శ్రీరామ్



హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వైఫల్యానికి గల కారణాలను వెల్లడించే సాక్ష్యాధారాలను నీటి పారుదల శాఖ అధికారులు ధ్వంసం చేశారని కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరామ్ తెలిపారు. బ్యారేజీలపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్ఏ) నిపుణుల కమిటీ

మిగతా 11వ పేజీలో...

కమిషన్ ముందు కథలు చెప్పొద్దు!

మీరు ఇంజనీరేనా? ఎక్కడ చదివారు?

నీటి లభ్యత ఖరారు ఇక్కడి ఇంజనీర్ల పనే కదా.. సీడబ్ల్యూసీ మీదికి తోస్తారేం?

ఎవరిని కాపాడేందుకు యత్నిస్తున్నారు?

నిబద్ధతతో కడితే బ్యారేజీలో బ్లాకులెందుకు కొట్టుకుపోయాయి

ఇంజనీర్లకు కాళేశ్వరం కమిషన్ ప్రశ్నలు

3 రోజుల్లో 49 మందికి పైగా విచారణ

11

నిరసనకారుల నుంచే నష్టపరిహారం వసూలు

రాళ్లు రువ్విన వ్యక్తుల పోస్టర్లు..సంభాల్‌పై యూపీ నిర్ణయం

లఖ్‌నవూ, నవంబరు 27: ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సంభాల్ అల్లర్లలో ప్రమేయం ఉన్న వ్యక్తులపై కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. ఆ రోజు ప్రభుత్వ ఆస్తులకు వాటిల్లిన నష్టానికి నిరసనకారుల నుంచి పరిహారం వసూలు చేయాలని నిర్ణయించింది. రాళ్లు రువ్విన వారి పోస్టర్లను బహిరంగ ప్రదేశాల్లో అంటించనుంది. వారికి సంబంధించిన సమాచారం ఇస్తే పారితోషికం అందజేయనుంది. ఆదివారం సంభాల్‌లోని షాహీ జామా మసీదు సర్వే సందర్భంగా అల్లర్లు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. అల్లర్లలో నలుగురు మరణించగా, పోలీసు సిబ్బంది సహా అనేకమంది గాయపడ్డారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం 2020లో పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై నిరసనల్లో విధ్వంసానికి పాల్పడిన వ్యక్తుల ఫొటోలను కూడా ఇలాగే బహిరంగ ప్రదేశాల్లో అంటించింది. అయితే వాటిని కోర్టు ఆదేశాలతో తొలగించింది.

భారత్‌లో రష్యా పెట్టుబడులు.. త్వరలో ఒప్పందం

న్యూఢిల్లీ, నవంబరు 27: భారత్- రష్యా దేశాల మధ్య రైలు విడిభాగాల తయారీకి సంబంధించి త్వరలోనే కీలక ఒప్పందం కుదరనుంది. రష్యా తన దేశీయ అవసరాలు తీర్చుకోవడం కోసం భారత్‌లో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉందని మంగళవారం రైల్వే శాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. లోకోమోటివ్, రైలు విడిభాగాలు తయారు చేసే ప్రముఖ సంస్థ ట్రాన్స్‌మాష్‌హోల్డింగ్(టీఎంహెచ్) ఇందుకు ఆసక్తి కనబరుస్తున్నట్టు తెలిపారు. టీఎంహెచ్ సీఈవో కిరిల్ లిపా సైతం ఈ విషయాన్ని స్పష్టం చేశారు. "భారత్‌లో ప్రస్తుతం వడ్డీ రేట్లు ఇతర దేశాల కంటే భిన్నంగా ఉన్నాయి. కాబట్టే మేము అక్కడ పెట్టుబడులు పెట్టాలనుకుంటున్నాం. భారత్‌లో తయారు చేసిన వాటిని రష్యన్ మార్కెట్‌కు సరఫరా చేస్తాం. దీని ద్వారా భారత్‌లోని పలువురు సరఫరాదారులకు మాకు మధ్య ఉన్న సుదీర్ఘకాలంగా సంబంధాలు మరింత మెరుగుపడటంతో పాటు రష్యాకు సైతం దిగుమతులు పెరుగుతాయ"ని పేర్కొన్నారు.

బ్యాంకాక్ నుంచి బల్లులు..వైజాగ్‌లో ఇద్దరి అరెస్టు



విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బ్యాంకాక్ నుంచి విమానంలో అక్రమంగా తీసుకొచ్చిన విదేశీ బల్లులను విశాఖ విమానాశ్రయంలో కస్టమ్స్, రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఇద్దరిని అరెస్టు చేశారు. బ్యాంకాక్ విమాన ప్రయాణికుల లగేజీని పరిశీలిస్తున్నప్పుడు చిన్న పెట్టెల్లో (కేక్ బాక్సులు) ఏవో జంతువులు కదలాడుతున్నట్టు అధికారులు గుర్తించారు. దీంతో విశాఖపట్నంలో పాములు పట్టే (స్నేక్ క్యాచర్) రొక్కం కిరణ్ కుమార్‌ను పిలిపించి వాటిని బయటకు తీయించగా.. విదేశీ బల్లులు కనిపించాయి. ఈ తరహా బల్లులు ఎక్కువగా ఆస్ట్రేలియాలో ఉంటాయని, అడవుల్లో గడ్డి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఇవి కనిపిస్తాయని అధికారులు చెప్పారు.

కర్ణాటక ఆర్టీసీలో రూ.1,750కోట్ల బకాయిలు

» డిసెంబరు 9న నిరసన ప్రదర్శనకు ఆర్టీసీ ఉద్యోగుల పిలుపు

(బెంగళూరు-ఆంధ్రజ్యోతి):

కర్ణాటక ప్రభుత్వం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. రూ.1750 కోట్ల బకాయిల విడుదల కోసం కేఎస్ ఆర్టీసీ ఉద్యోగులు రోడ్డెక్కనున్నారు. శాసన సభ శీతాకాల సమావేశాలను బెళగావిలోని సువర్ణసౌధలో నిర్వహించనున్న నేపథ్యంలో డిసెంబరు 9న చలో బెళగావికి కేఎస్ ఆర్టీసీ ఉద్యోగులు పిలుపునిచ్చారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకుంటే డిసెంబరు 31 నుంచి సమ్మెలోకి వెళ్లాలని నిర్ణయించారు. మరోవైపు, ఉద్యోగుల పీఎఫ్ చందాలనూ కేఎస్ ఆర్టీసీ కొంతకాలంగా పీఎఫ్ ట్రస్టుకు చెల్లించడం లేదు. వడ్డీతో కలిపి ఆ బకాయిలు రూ.2,792.61 కోట్లకు చేరాయి. దీనిపై పీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ కార్యాలయం తీవ్ర అభ్యంతరం తెలిపింది. కఠిన చర్యలు చేపడతామనీ హెచ్చరించింది. 6 గ్యారంటీలపై ప్రభుత్వంలోని నేతలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్న వేళ ఇది ప్రాధాన్యం సంతరించుకొంది.

ఇజ్రాయెల్‌తో సంధికి మేం సిద్ధమే: హమాస్

టెల్ అవీవ్, నవంబరు 27: ఇజ్రాయెల్-హెజ్‌బొల్లా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన నేపథ్యంలో.. హమాస్ కూడా కాల్పుల విరమణకు సిద్ధమంటూ ప్రకటించింది. గాజా స్ట్రిప్‌లో కాల్పుల విరమణ ఒప్పందానికి సుముఖత వ్యక్తం చేసింది. 'కాల్పుల విరమణ, ఖైదీల మార్పిడి ఒప్పందానికి మేం సిద్ధంగా ఉన్నాం. ఈ విషయాన్ని ఈజిప్టు, ఖతార్, తుర్కియేలోని మధ్యవర్తులకు తెలియజేశాం' ఓ ప్రకటనలో వెల్లడించింది. ఇజ్రాయెల్ షరతులకు హెజ్‌బొల్లా ససేమిరా అన్నప్పటికీ ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు శాంతి ఒప్పందానికి అంగీకరించారని.. పశ్చిమాసియాలో బలప్రయోగం ద్వారా ఏదైనా సాధించవచ్చనే ఆయన భ్రమలు పటాపంచలయ్యాయని పేర్కొంది.

లాటరీలో బ్రిటన్ వ్యక్తికి రూ.1800 కోట్లు

లండన్, నవంబరు 27: బ్రిటన్‌కు చెందిన ఓ వ్యక్తి జాక్‌పాట్ కొట్టాడు. అతడు కొన్న లాటరీకి సుమారు రూ. 1800 కోట్ల(177 మిలియన్ పౌండ్లు) ప్రైజ్‌మనీ తగలడంతో అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తుతోంది. మంగళవారం బ్రిటన్‌లోని నేషనల్ లాటరీని నిర్వాహకులు డ్రా తీశారు. 07, 11, 25, 31, 40 నంబరు గల టికెట్‌కు లాటరీ దక్కినట్లు ప్రకటించారు. ఇది బ్రిటన్‌లో మూడో అతిపెద్ద లాటరీ ప్రైజ్‌మనీ అని అక్కడి మీడియా సంస్థలు పేర్కొన్నాయి. అయితే లాటరీ గెలుచుకున్న వ్యక్తి వివరాలను మాత్రం బయటపెట్టలేదు. కాగా, బ్రిటన్‌లో అతిపెద్ద నేషనల్ లాటరీ బహుమతిని 2022 మే 10న గ్లౌసెస్టర్‌కు చెందిన జో, జెస్ త్వైట్‌లు గెలుచుకున్నారు. దీని విలువ సుమారు 195 మిలియన్ పౌండ్లు.

'అదానీ'పై దుమారం!

జేపీసీకి విపక్ష సభ్యుల డిమాండ్.. పార్లమెంటు ఉభయసభల్లో ఆందోళనలు

ఎలాంటి కార్యకలాపాలు లేకుండానే వాయిదా



న్యూఢిల్లీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో 'అదానీ' దుమారం ఆగడం లేదు. శీతాకాల సమావేశాల్లో రెండో రోజైన బుధవారం కూడా ఉభయసభల్లో ఎలాంటి కార్యకలాపాలూ జరగలేదు. ప్రతిపక్ష పార్టీల సభ్యుల ఆందోళనలతో లోక్‌సభ, రాజ్యసభ ఉదయం ఒకసారి వాయిదా పడ్డాయి. మళ్లీ సమావేశమైన తర్వాత కూడా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేకపోవడంతో గురువారానికి వాయిదా వేశారు. లోక్‌సభ సమావేశమైన వెంటనే బుధవారం ఉదయం స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలను చేపట్టారు. అయితే అదానీ సంస్థపై వచ్చిన ఆరోపణల మీద చర్చించాలని; యూపీలోని సంభాల్‌లో జరిగిన హింసపై చర్చించాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. దీంతో సభను వాయిదా వేశారు. మధ్యాహ్నం 12 గంటలకు సభ మళ్లీ సమావేశమైనా పరిస్థితిలో మార్పు లేదు. దీంతో లోక్‌సభను గురువారానికి వాయిదా వేశారు. ఇక రాజ్యసభలోనూ గందరగోళం నెలకొంది. సభలో కార్యకలాపాలన్నింటినీ నిలిపివేసి అదానీ అంశంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు ఇచ్చిన 18 వాయిదా తీర్మానాలను చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ తిరస్కరించారు. సభ్యులు నిరసనకు దిగడంతో సభను వాయిదా వేశారు. వాయిదా తీర్మానాల్లో సగం కాంగ్రెస్ సభ్యులే ఇవ్వడం గమనార్హం. అవి కూడా అదానీ అంశంపైనే ఇచ్చారు. మిగిలిన సగంలో కొన్ని యూపీ, మణిపూర్ హింసపై చర్చ జరగాలని, మరికొన్ని ఇతర కారణాలతో వేర్వేరు పార్టీల సభ్యులు ఇచ్చారు. సభలో గందరగోళం నెలకొనడంతో గురువారానికి వాయిదా వేశారు. కాగా, ప్రభుత్వ మొండి వైఖరితోనే ఉభయసభలు వాయిదా పడ్డాయని కాంగ్రెస్ ఆరోపించింది. అదానీ సంస్థపై వచ్చిన ఆరోపణల మీద చర్చించడానికి మోదీ సర్కారు ఇష్టపడడం లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. మొదానీ స్కాంపై జేపీసీతో విచారణ జరిపించాల్సిందేనని, తాము ఈ డిమాండ్ చేస్తూనే ఉంటామని చెప్పారు.

అదానీని అరెస్టు చేయాల్సిందే: రాహుల్

అదానీని అరెస్టు చేయాలని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన పార్లమెంటు వెలుపల విలేకరులతో మాట్లాడారు. దేశంలో చిన్న చిన్న ఆరోపణలకే వందలాది మందిని అరెస్టు చేస్తున్నారని, అలాంటప్పుడు అదానీ ఎందుకు జైల్లో లేరని ప్రశ్నించారు. 'జైల్లో ఉండాల్సిన ఆయన్ను ప్రభుత్వం కాపాడుతోంది' అని రాహుల్ ఆరోపించారు. కాగా, అదానీపై వచ్చిన లంచం ఆరోపణల తీవ్రతను నీరుగార్చేందుకు 'మోదానీ ఎకోసిస్టమ్' ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాంరమేశ్ ఆరోపించారు. ఇటువంటి హాస్యాస్పద ప్రయత్నాలతో అమెరికా ఏజెన్సీలు చేస్తున్న ఆరోపణల తీవ్రతను తగ్గించలేరని స్పష్టం చేశారు.

ముడుపుల కేసులో అదానీలపై ఒక్క ఆధారమూ లేదు

న్యాయకోవిదులు ముకుల్ రోహత్గీ, మహేశ్ జెఠ్మలానీ ధ్వజం

న్యూఢిల్లీ, నవంబరు 27: గౌతమ్ అదానీ, సాగర్ అదానీపై అమెరికాలో పెట్టిన ముడుపుల కేసుల్లో ఒక్క ఆధారం కూడా లేదని ప్రముఖ న్యాయకోవిదులు ముకుల్ రోహత్గీ (మాజీ అటార్నీ జనరల్), మహేశ్ జెఠ్మలానీ(రాజ్యసభ సభ్యుడు) అన్నారు. అమెరికా న్యాయ శాఖ అభియోగాల్లో స్పష్టత, నిర్దిష్టత లోపించాయన్నారు. ప్రతిపక్షాలు దీనిపై లేనిపోని రాద్ధాంతం చేస్తున్నాయని ఆరోపించారు. వారిద్దరూ కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. 'అమెరికా కోర్టులో మొత్తం ఐదు అభియోగాలున్నాయి. మొదటి, ఐదో కేసులు వీటిలో ముఖ్యమైనవి. వీటిలో అదానీల పేర్లు లేనే లేవు. 2,3 కేసుల్లో అదానీ పేర్లు ఉన్నాయి. మౌలికంగా ఇవి సెక్యూరిటీలు, బాండ్లకు సంబంధించినవి. విద్యుత్ సరఫరా, కొనుగోళ్ల వ్యవహారంలో భారతీయ అధికారులకు అదానీలు ముడుపులిచ్చారన్నది ప్రధాన ఆరోపణ. అయితే ఎవరికి లంచాలిచ్చారు.. ఏ రూపంలో ముడుపులు ముట్టజెప్పారు. సదరు అధికారి ఏ శాఖకు చెందిన వారో అందులో ఒక్క పేరు గానీ, వివరం గానీ లేవు' అని రోహత్గీ వ్యాఖ్యానించారు. 'మహారాష్ట్ర ఎన్నికల్లో చావుదెబ్బ తిన్నాక.. ఆ పరాజయం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్, ఇండీ కూటమి అదానీ వ్యవహారాన్ని వాడుకుంటున్నాయి. దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా.. విదేశీ ప్రమేయం ఉన్న అదానీ, మణిపూర్ అంశాలపైనే అవి దృష్టిపెట్టాయి' అని మహేశ్ జెఠ్మలానీ విమర్శించారు.

రేషన్ డీలర్లకు మార్జిన్ పెంచే యోచన లేదు

లోక్‌సభలో స్పష్టం చేసిన కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి

న్యూఢిల్లీ, నవంబరు 27: ప్రజాపంపిణీ(పీడీఎస్) కార్యక్రమంలో రేషన్ డీలర్లకు మార్జిన్ పెంచే ఆలోచనేదీ కేంద్రం దృష్టిలో లేదని కేంద్ర ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి బుధవారం లోక్‌సభలో స్పష్టం చేశారు. అయితే కేంద్రం నిర్ణయించిన మార్జిన్ల కంటే పెంచి ఇచ్చేందుకు రాష్ట్రాలకు స్వేచ్ఛ ఉందని ఈ అంశంపై అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 2022 ఏప్రిల్‌లో సవరించిన ఆహార భద్రత నిబంధనల మేరకు డీలర్లకు క్వింటాల్‌కు ఇచ్చే మార్జిన్ రూ.90. జనరల్ కేటగిరీ రాష్ట్రాల్లో ఈ మొత్తానికి మరో రూ.21 కలిపి ఇస్తారు. అదే ప్రత్యేక కేటగిరీ రాష్ట్రాల్లో క్వింటాల్‌కు రూ.180తోపాటు అదనంగా మరో రూ.26 కలిపి ఇస్తారు. కాగా రేషన్ షాపులకు లైసెన్సులు ఇవ్వడం, వాటి పర్యవేక్షణ నిర్వహణ బాధ్యతలు పూర్తిగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలపైనే ఉన్నాయని కేంద్రమంత్రి గుర్తుచేశారు. డీలర్లకు ఇచ్చే వాస్తవ మార్జిన్, కమిషన్‌ని నిర్ణయించడంలో కేంద్రానికి ఎటువంటి పాత్రా లేదని స్పష్టం చేశారు. కాగా ప్రయాణికుల విమానాలకు ఈ ఏడాది మొత్తం 994 ఉత్తుత్తి బెదిరింపు కాల్స్ వచ్చాయని కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మహోల్ బుధవారం పార్లమెంటులో తెలిపారు. ఈ బెదిరింపు కాల్స్ తీవ్రతను అంచనా వేసి పటిష్ట చర్యలు తీసుకొనేందుకు పౌర విమానయాన భద్రత బ్యూరో(బీసీఏఎస్) పటిష్ట భద్రతా ప్రణాళికను రూపొందించిందని ఆయన వివరించారు. అందులో భాగంగా దేశంలో ప్రతి విమానాశ్రయానికి ఒక ప్రత్యేక బాంబు బెదిరింపు తీవ్రత అంచనా కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కాగా సామాజిక మాధ్యమాల్లో అసభ్య సమాచారాన్ని(కంటెంట్) నివారించేందుకు ఇప్పుడున్న చట్టాలను మరింత కఠినతరం చేయాల్సి ఉందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం లోక్‌సభలో చెప్పారు.

'ఇస్కాన్'పై బంగ్లాదేశ్‌లో నిషేధం?

ఢాకా/న్యూఢిల్లీ, నవంబరు 27: అంతర్జాతీయ శ్రీకృష్ణ సమాజం(ఇస్కాన్)పై నిషేధం విధించనున్నట్టు బంగ్లాదేశ్ సంచలన ప్రకటన చేసింది. ప్రస్తుతం నిషేధం విధించే ప్రక్రియ కొనసాగుతోందని బంగ్లాదేశ్ అటార్నీ జనరల్(ఏజీ) అసదుజ్జమాన్ వెల్లడించారు. ఇస్కాన్‌ను మతతత్వ సంస్థగా అభివర్ణించారు. ఇస్కాన్‌కు నాయకుడు, ఆధ్యాత్మిక వేత్త చిన్మయ్ కృష్ణదాస్‌ను దేశ ద్రోహం కేసు కింద బంగ్లాదేశ్ అరెస్టు చేసి, జైలులో పెట్టిన నేపథ్యంలో ఈ ప్రకటన తీవ్ర దుమారం రేపుతోంది. మరోవైపు కృష్ణదాస్ అరెస్టును ఖండిస్తూ బంగ్లాదేశ్ రాజధాని ఢాకా సహా పలు ప్రాంతాల్లో ఇస్కాన్ సభ్యులు, హిందూ వర్గాలు కూడా తీవ్ర నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామాలపై బుధవారం ఢాకా హైకోర్టులో సుప్రీంకోర్టు న్యాయవాది మొనిరుజ్జమాన్ పిటిషన్ దాఖలు చేశారు. ఇస్కాన్‌పై నిషేధం విధించేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. అదేవిధంగా రంగ్‌పూర్, చట్టోగ్రామ్‌లో పరిస్థితులను చక్కదిద్దేందుకు ఎమర్జెన్సీ విధించాలని కోరారు. హైకోర్టు స్పందిస్తూ.. ఇస్కాన్ కార్యకలాపాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని బంగ్లా ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఇస్కాన్‌పై నిషేధం విధించే ప్రక్రియ కొనసాగుతోందని, తాజా పరిణామాలపై రాజకీయ పార్టీల నాయకులతో ప్రభుత్వం చర్చిస్తోందని ఏజీ హైకోర్టుకు తెలిపారు. మరోవైపు, బంగ్లాదేశ్‌లో చిన్మయ్‌పై నమోదైన కేసు, అరెస్టు వ్యవహారంలో ఐక్యరాజ్యసమితి(ఐరాస) జోక్యం చేసుకోవాలని ఇస్కాన్ కోల్‌కతా కార్యాలయం కోరింది. మరోవైపు, చిన్మయ్ అరెస్టును తీవ్రంగా పరిగణిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. "బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలను గమనిస్తే పాకిస్థాన్‌ను తలపిస్తోంది" అని కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్ విమర్శించారు. ఈ విషయంలో ఐక్యరాజ్యసమితి కచ్చితంగా జోక్యం చేసుకోవాల్సి ఉందన్నారు.

మోదీదే తుది నిర్ణయం

» సీఎం ఎంపికపై స్పష్టత ఇచ్చిన శిందే

» ప్రధాని మోదీ, షాతో ఫోన్ సంభాషణ

» కేంద్ర మంత్రి పదవిపై ఆసక్తి లేదని వెల్లడి



ముంబై, న్యూఢిల్లీ, నవంబరు27: మహారాష్ట్ర కొత్త సీఎం ఎంపిక, ప్రభుత్వ ఏర్పాటుపై ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలదే తుది నిర్ణయమని ఆపద్ధర్మ ముఖ్యమంత్రి, శివసేన అధ్యక్షుడు ఏక్‌నాథ్ శిందే స్పష్టం చేశారు. మోదీ, షాతో తాను ఫోన్‌లో మాట్లాడానని, కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై తమ తరఫున ఎలాంటి అడ్డంకులు ఉండబోవని స్పష్టం చేసినట్లు ముంబైలో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తనకు కేంద్ర మంత్రి పదవిపై ఆసక్తి లేదని కూడా శిందే తేల్చి చెప్పారు. అయితే మహాయుతికి ప్రజలు ఘన విజయం అందించిన నేపథ్యంలో కొత్తగా ఏర్పడే ప్రభుత్వం వారి ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఉధృతంగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. శిందే ప్రకటనతో బీజేపీ తరఫున కొత్త ముఖ్యమంత్రిని ఎంపిక చేసేందుకు మార్గం సుగమమైంది. కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై చర్చలు జరిపేందుకు ఢిల్లీకి రావాలని శిందే, అజిత్ పవార్‌లకు బీజేపీ అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది. సీఎం, డిప్యూటీ సీఎం పదవులతో పాటు ఇతర మంత్రిత్వ శాఖల కేటాయింపులపై శిందే, పవార్‌లతో చర్చించే అవకాశం ఉంది. మరోవైపు, శివసేన ఎంపీలు పార్లమెంట్‌లో అమిత్ షాతో సమావేశమయ్యారు.


ఢిల్లీకి చేరుకున్న ఫడణవీస్

మహారాష్ట్ర బీజేపీ సీనియర్ నేత ఫడణవీస్ ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నారు. శిందే విలేకరుల సమావేశంలో చేసిన ప్రకటనతో అందరి అనుమానాలు తీరి ఉంటాయని ఫడణవీస్ చెప్పారు. మహాయుతి కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని, ఉమ్మడిగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని చెప్పారు. డిసెంబరు రెండున కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ కార్యక్రమం ఉండొచ్చని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.

మహాయుతి గెలుపు బంపర్ డ్రా

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి గెలుపును బంపర్ లక్కీ డ్రా గెలుచుకోవడంగా శివసేన(యూబీటీ) అభివర్ణించింది. ఈవీఎంల వినియోగంపై అనుమాన మేఘాలు కమ్ముకున్నాయని అన్నది. 'ఈవీఎంలతో ఏదైనా సాధ్యమే' అని శివసేన(యూబీటీ)పార్టీ పత్రిక సామ్నా బుధవారం ఎడిటోరియల్‌లో తెలిపింది. "95 నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల సంఖ్యకు, ఈవీఎంలో లెక్కించిన ఓట్ల సంఖ్యకు తేడా, ఈవీఎంలలో చార్జింగ్.. వంటివి ఈవీఎం స్కామ్‌పై అనుమానాలకు బలం చేకూర్చుతున్నాయి" అని పేర్కొంది.

లోకం తీరు



రాజ్యాంగాన్ని మోసం చేయడమే

(మొదటి పేజీ తరువాయి)


విశ్వాసాల ఆధారంగా ఉండాలే తప్ప రిజర్వేషన్ల కోసం కాదని, ఎస్సీ సర్టిఫికెట్‌ను ఇప్పించలేమని తేల్చి చెప్పింది. ఈ మేరకు గతంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. తమిళనాడుకు చెందిన సెల్వరాణి అనే యువతి.. తనకు ఎస్సీ సర్టిఫికెట్ ఇచ్చేలా అధికారులను ఆదేశించాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సెల్వరాణి తండ్రి హిందువు. తల్లి క్రిస్టియన్. సెల్వరాణి 1990 నవంబరులో జన్మించారు. 1991 జనవరిలో ఆమెకు బాప్తిజం చేశారు. అయితే, 2015లో పుదుచ్చేరి డివిజన్ క్లర్క్ పోస్టు కోసం తనకు ఎస్సీ సర్టిఫికెట్‌ను ఇప్పించాలని ఆమె మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆమె వినతిని తిరస్కరించగా సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. స్కూల్ రికార్డుల్లో తను ఎస్సీ అనే ఉందని, తన తండ్రి హిందువుల్లో వల్లువన్(ఎస్సీ) కులానికి చెందినవారని, తన సోదరుడు కూడా హిందువేనని వాదించారు. అయితే, పిటిషనర్ క్రైస్తవాన్ని పాటిస్తున్నారని, తరచూ చర్చికి వెళ్తున్నట్టు స్పష్టమైన ఆధారాలున్నాయని కోర్టు పేర్కొంది. క్రైస్తవాన్ని ఆచరిస్తూ ఆమె హిందువునని చెప్పుకొంటున్నారని, ఇలాంటి ద్వంద్వ వైఖరిని కోర్టు ఆమోదించబోదని తెలిపింది. రిజర్వేషన్ కోసమే ఆమె మతం మారాలనుకోవడం లాంటి ఆలోచనలు రిజర్వేషన్ విధానపు స్ఫూర్తినే దెబ్బతీస్తాయని వ్యాఖ్యానించింది. మతం మారిన వారు తిరిగి హిందూ మతంలోకి వెళ్లాలంటే తగిన ఆధారాలుండాలని, వారు హిందూ మత విశ్వాసాలను పాటిస్తూ ఉండాలని వివరించింది. ప్రస్తుత కేసులో ఇలాంటి ఆధారాలేవీ లేవని స్పష్టం చేసింది. పైగా, పిటిషనర్ తండ్రి, సోదరుడు కూడా బాప్తిజం తీసుకున్నట్లు ఆధారాలున్నాయని తెలిపింది. సెల్వరాణి అభ్యర్థనను తిరస్కరిస్తూ పిటిషన్‌ను కొట్టేసింది.

సర్కారీ బడుల్లో స్పోకెన్ ఇంగ్లిష్

» ఖమ్మం జిల్లాలో తొలివిడతగా 16 పాఠశాలల్లో ఆంగ్ల బోధన

» రెండో దశలో 18 పాఠశాలల్లో..

» పిల్లల్లో పెరుగుతున్న ప్రావీణ్యం



శిక్షణలో భాగంగా విద్యార్థుల ఆంగ్ల సంభాషణ


ఖమ్మం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులూ ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు వీలుగా.. 'స్పోకెన్ ఇంగ్లిష్' తరగతులు నిర్వహించాలని ఖమ్మం జిల్లా విద్యాశాఖాధికారులు నిర్ణయించారు. సర్కారీ బడుల్లో ఇంగ్లిష్ కేవలం ఒక సబ్జెక్టుగా మాత్రమే ఉండడంతో.. విద్యార్థులు కేవలం పరీక్షల్లో రాయడానికి అవసరమైనంత మాత్రమే నేర్చుకుంటున్నారు. దీనివల్ల భాషపై వారికి పట్టు లేకుండా పోతోంది. ఉన్నత చదువులకు వెళ్లినప్పుడు వారికి అది అడ్డంకిగా మారుతోంది. తమకు తెలిసిన అరకొర ఆంగ్లంలో మాట్లాడలేక.. భయంతో చదువులో వెనకబడిపోతున్నారు. అందుకే ఈ పరిస్థితిని మార్చేందుకు ఖమ్మం జిల్లా విద్యా శాఖాధికారులు నడుం బిగించారు. సిలబస్‌లోని సబ్జెక్టులతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్‌నూ ఒక సబ్జెక్టుగా పెట్టి బోధిస్తూ.. పిల్లలు ఆంగ్ల భాషలో ప్రావీణ్యం సంపాదించేలా ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలోని మొత్తం 34 ప్రభుత్వ పాఠశాలలకుగాను తొలివిడతగా 16 బడుల్లో ఆగస్టు 14 నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు ప్రారంభించారు. 6, 7, 8 తరగతుల విద్యార్థులకు నిత్యం సాయంత్రం పూట 45 నిమిషాలపాటు ఇంగ్లిష్ మాట్లాడడంలో తర్ఫీదు ఇస్తున్నారు. ఇందుకు.. గతంలో ప్రభుత్వం ఇచ్చిన డిజిటల్ టీవీలను వినియోగిస్తున్నారు ద్వారా విద్యార్థులకు ఆంగ్లం మాట్లాడడంలో తర్ఫీదు ఇస్తున్నారు. కాగా.. ఈ పాఠాలు చెప్పడం కోసం విద్యా శాఖ అధికారులు 'భారత్ దేఖో' అనే ఎన్‌జీవోతో ఒప్పందం చేసుకుని ఆ సంస్థ ప్రతినిధులు పవిత్ర, అస్రా ద్వారా ముందుగా ఇంగ్లిష్ టీచర్లకు.. పిల్లలతో ఇంగ్లిష్ ఎలా మాట్లాడించాలి? వారిలో ఆంగ్లం పట్ల ఉన్న భయాన్ని ఎలా పోగొట్టాలి? అనే అంశాలపై ఆన్‌లైన్‌లో శిక్షణ ఇప్పించారు. ఇంగ్లిష్ కథలు, సన్నివేశాలు, కార్టూన్ షోలు, కొన్ని వీడియోలను కూడా ఆ ఎన్‌జీవో పంపించింది. ఈ శిక్షణతో విద్యార్థులు ఆంగ్లంలో మాట్లాడగలుగుతున్నారు. గతంలో ఉపాధ్యాయులు ఏదైన ప్రశ్న ఇంగ్లిష్‌లో అడిగినా.. సమాధానం తెలుగులోనే చెప్పే పిల్లలు, ఇప్పుడు ఆంగ్లంలోనే బదులిస్తున్నారు. ఈ శిక్షణ విజయవంతమైన నేపథ్యంలో.. రెండో దశలో మిగిలిన 18 పాఠశాలల్లోనూ స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహించనున్నట్టు జిల్లా విద్యా శాఖ అధికారి (డీఈవో) సోమశేఖర శర్మ తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ చొరవతో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహించడం వల్ల.. విద్యార్థులు ఆంగ్లంలో చక్కగా మాట్లాడగలుగుతున్నారని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

మార్పు చూసి మాకే ఆశ్చర్యం

గతంలో తరగతికి సంబంధించిన ఇంగ్లిష్ సబ్జెక్టును మాత్రమే బోధించేవారం. ఆంగ్లంలో మాట్లాడగలిగే నైపుణ్యం పిల్లలకు అంతగా ఉండేది కాదు. కానీ, ఇప్పుడీ స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులతో విద్యార్థులు ఆంగ్లంలో మాట్లాడుకుంటున్నారు. ఇంగ్లిష్‌లో చర్చలు, ఇంటరాక్షన్ ప్రోగ్రాములు నిర్వహిస్తున్నాం. ఈ శిక్షణతో పిల్లల్లో వస్తున్న మార్పు చూసి మాకే ఆశ్చర్యం వేస్తోంది.

- గౌతమి, ఇంగ్లిష్ టీచర్, మామిళ్లగూడెం ప్రభుత్వ పాఠశాల


ఇంగ్లిష్ అంటే భయం పోయింది



నాకు నాన్న లేడు. అమ్మ ఇళ్లల్లో పనులు చేస్తూ నన్ను చదివిస్తోంది. ఇన్నాళ్లుగా నాకు ఇంగ్లిష్ అంటే భయంగా ఉండేది. స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులతో నేను ఆంగ్లంలో మాట్లాడడం బాగా నేర్చుకున్నా. ప్రైవేటు పాఠశాలల్లో చదివే కొందరు నా స్నేహితులు ఇంగ్లిష్ మాట్లాడుతుంటే వారు గొప్పగా చదువుతున్నారని భావించేవాడిని. ఇప్పుడు నేను కూడా మాట్లాడగలగడం ఆనందంగా ఉంది.

- ప్రశాంత్, 7వతరగతి విద్యార్థి

ఇప్పుడు అందరితో ఇంగ్లిష్‌లో మాట్లాడుతున్నా



నేను మామిళ్లగూడెం ప్రభుత్వ పాఠశాలలో 7వతరగతి చదువుతున్నా. ఇక్కడ స్పోకెన్ ఇంగ్లిష్ ప్రత్యేకంగా చెబుతున్నందున నేను కూడా ఆంగ్లంలో మాట్లాడగలుగుతున్నా. ఇంతకుముందు పుస్తకంలో చూసి చదవడం తప్ప సొంతంగా మాట్లాడలేకపోయేదాన్ని. ఇప్పుడు క్లాసులో తోటి విద్యార్థులతోనే కాదు.. వేదికపైన కూడా నిర్భయంగా ఇంగ్లిష్‌లో మాట్లాడగలుగుతున్నా.


- పూజిత, 7వ తరగతి విద్యార్థి

సరగసీ కోసం తెచ్చి లైంగిక వేధింపులు

కామాంధుడి నుంచి తప్పించుకునే యత్నంలో మహిళ మృతి

» తొమ్మిదో అంతస్తు నుంచి కింద పడి కన్నుమూత

» రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో విషాద ఘటన



రాయదుర్గం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గర్భాన్ని అద్దెకు ఇవ్వడం ద్వారా వచ్చిన డబ్బుతో పేదరికం పోతుందని ఆశించారా దంపతులు! ఎక్కడో ఒడిశా నుంచి పొట్ట చేతపట్టుకుని హైదరాబాద్‌కు వచ్చారు!! తీరా ఇక్కడకు వచ్చాక.. వారిని తీసుకువచ్చిన వ్యక్తి ఆమెపై లైంగిక వేధింపులకు దిగాడు. అతడి బారి నుంచి తప్పించుకుని పారిపోయే ప్రయత్నంలో తొమ్మిదో అంతస్తు నుంచి కింద పడి ప్రాణాలు కోల్పోయిందా మహిళ. నాలుగేళ్ల కుమారుణ్ని, భర్తను తీవ్ర విషాదంలో ముంచేసింది! రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిందీ విషాదం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయదుర్గంలోని మైహోం భూజలో నివాసం ఉండే రియల్ ఎస్టేట్ వ్యాపారి నిత్యం రాజేష్‌బాబు (54) దంపతులకు సంతానం లేదు. దీంతో వారు సరగసీ (అద్దె గర్భం) విధానం ద్వారా సంతానం పొందాలని భావించి.. సందీప్ అనే మధ్యవర్తి ద్వారా ఒడిశాకు చెందిన సంజయ్ సింగ్, అశ్విత (25) దంపతులను కలిశారు. వారితో రూ.10 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒప్పందం మేరకు.. వారిద్దరూ తమ నాలుగేళ్ల కుమారుడితో కలిసి అక్టోబరు 24న హైదరాబాద్‌కు వచ్చారు. అప్పట్నుంచీ అశ్వితను 9వ అంతస్తులోని తమ ఇంట్లోనే నిర్బంధించిన రాజేష్ బాబు.. ఆమె భర్త సంజయ్ సింగ్‌కు మాత్రం అదే అపార్ట్‌మెంట్‌లో ఏడో అంతస్తులో నివాసం కల్పించాడు. సరగసీ విధానం ద్వారా బిడ్డను కనేందుకు అవసరమైన అనుమతుల ప్రక్రియ ఒకవైపు కొనసాగుతుండగా.. గత పదిహేను రోజులుగా రాజేష్ బాబు అశ్వితపై లైంగిక వేధింపులకు పాల్పడుతూ వచ్చాడు. సరగసీ విధానంలో బిడ్డను కనిస్తాను తప్ప.. లైంగికంగా కలిసేందుకు ఒప్పుకోనేది లేదని రాజేష్ బాబుకు తేల్చిచెప్పిన అశ్విత, అతడి అకృత్యాల గురించి భర్తకు చెప్పింది. తిరిగి ఒడిశాకు వెళ్లిపోదామని రెండు, మూడుసార్లు చెప్పినా.. ఒప్పందం ప్రకారం బిడ్డను కనిస్తే, ఆర్థిక కష్టాలు తొలగిపోతాయని సంజయ్ సింగ్ తన భార్యకు నచ్చజెప్పాడు. కానీ.. రాజేష్‌బాబు లైంగిక వేధింపులు నానాటికీ తీవ్రతరం కావడంతో అక్కడి నుంచి ఎలాగైన తప్పించుకుని, భర్త, కుమారుడితో కలిసి స్వగ్రామం వెళ్దామనే నిర్ణయానికి వచ్చింది అశ్విత. రాజేష్ బాబు ఫ్లాట్ బాల్కనీ నుంచి చీరను కట్టి, దాని ద్వారా రెండు అంతస్తుల మేర కిందకు జారితే.. అక్కడ ఉండే ర్యాంపు ద్వారా భర్త ఉండే ఫ్లాట్‌లోకి చేరుకోవచ్చని గుర్తించింది. ఈమేరకు మంగళవారం రాత్రి రెండు గంటల సమయంలో (తెల్లవారితే బుధవారం).. రెండు చీరలను ఒకదానికొకటి కట్టి 9వ అంతస్తు బాల్కనీలోంచి పొడుగ్గా కిందకు వేలాడదీసింది. ఆ చీరలను పట్టుకుని నెమ్మదిగా కిందికి దిగే ప్రయత్నం చేస్తుండగా.. ఆమె చేతులు పట్టు జారి అంత ఎత్తు నుంచి కిందపడి తీవ్ర గాయాలతో అక్కడిక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు అశ్విత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆమె భర్త ఫిర్యాదు మేరకు రాజేష్‌బాబుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సరగసీ ముసుగులో పేద కుటుంబాలపై జరుగుతున్న అకృత్యాలను ఇప్పటికైనా గుర్తించి.. వాటిని నివారించేలా ప్రభుత్వం కఠిన చట్టాలు రూపొందించాలని పలువురు సూచిస్తున్నారు.

మానవత్వం మరిచి..

కన్న తల్లిని శ్మశాన వాటికలో వదిలి

- జగిత్యాలలో కొడుకుల దాష్టికం
- సఖి సెంటర్‌కు తరలించిన అధికారులు



జగిత్యాలలో శ్మశాన వాటిక నుంచి సఖీ కేంద్రానికి వృద్ధురాలిని తరలిస్తున్న అధికారులు

జగిత్యాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బిడ్డా చిన్నప్పటి నుంచి వి ఎమ్మల్ని కంటికి రెప్పలా కాపాడుకున్నాను... 'నన్ను శ్మశానంలో వదిలి వెళ్లకండి.. ' అని బతిమిలాడినా వినకుండా కన్న కొడుకులు ఓ తల్లిని నిర్దాక్షిణ్యంగా శ్మశానంలో వదిలి వెళ్లిపోయారు. ఆ వృద్ధురాలు తీవ్రమైన చలిలో శ్మశాన వాటికలోని షెడ్డులో వారం రోజులుగా కాలం వెళ్లదీస్తోంది. ఆ తల్లి దీనావస్థను గమనించిన స్థానికులు ప్రభుత్వ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరకుని ఆమెను సఖి కేంద్రానికి తరలించారు. జగిత్యాల చిలుకవాడ కాలనీకి చెందిన వృద్ధురాలు అల్లంకొండ రాజవ్వ (80)కు నలుగురు కుమారులు తిరుపతి, శ్రీనివాస్, గోపాల్, రవి ఉన్నారు. నలుగురు వేర్వేరుగా కాపురాలుంటున్నారు. వృద్ధురాలు ఒక్కో కొడుకు వద్ద కొన్ని రోజులు గడుపుతోంది. ఇటీవల ఓ ప్రమాదానికి గురై ఆమె కాలు విరిగింది. ఈ నేపథ్యంలో ఆకస్మికంగా వారం రోజుల క్రితం జగిత్యాల పట్టణ శివారులోని మోతె శ్మశాన వాటికలో ఓ కుమారుడు వదిలి వెళ్లినట్లు బాధితురాలు చెబుతోంది. రోజూ కొడుకులే హోటల్ నుంచి భోజనం తెచ్చి పెడుతున్నట్లు చెబుతోంది. శ్మశాన వాటికలో చలికి వణుకుతూ నరకయాతన అనుభవిస్తున్న వృద్ధురాలిని గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో జిల్లా సంక్షేమశాఖ అధికారులు వచ్చి ఆమెను అక్కడి నుంచి సఖి కేంద్రానికి తరలించి ఆశ్రయం కల్పించారు.

దంపతుల దారుణ హత్య

- ఇల్లు కిరాయి కోసం వచ్చి కిరాతకం
- నగలు, నగదు ముట్టుకోని వైనం

నేలకొండపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో వృద్ధ దంపతులు మంగళవారం అర్ధరాత్రి దారుణ హత్యకు గురయ్యారు. దుండగులు వారిద్దరి కంట్లో కారం కొట్టి చంపారు. యర్రా వెంకటరమణ (62), కృష్ణకుమారి (60) దంపతులకు కొత్త బస్టాండ్ సమీపంలోని సొంత ఇంట్లో ఉంటున్నారు. ఆ ఇంట్లో ఖాళీగా ఉన్న వాటా అద్దెకు కావాలని ముగ్గురు వ్యక్తులు పది రోజుల క్రితం వచ్చి వెళ్లారు. తర్వాత ఇల్లు తమకు నచ్చిందని కొంత నగదు అడ్వాన్స్‌గా ఇచ్చారు. సోమవారం రాత్రి సదరు వ్యక్తులు వెంకటరమణ ఇంట్లోనే భోజనం చేసి వెళ్లారు. మంగళవారం రాత్రి కూడా వచ్చిన ఆ వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో వెంకటరమణ దంపతులపై దాడి చేసి.. కళ్లల్లో కారం కొట్టి హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆనవాళ్లు దొరక్కుండా ఘటనా స్థలంతో పాటు ఇంటి చుట్టూ కారం చల్లి, ఇంటి బయట తాళం వేసి వెళ్లిపోయారు. జగ్గయ్యపేటలో ఉంటున్న వెంకటరమణ దంపతుల కుమార్తె అనురాధ బుధవారం ఉదయం తల్లిదండ్రులకు ఫోన్ చేయగా.. ఎంతకీ బదులు లేదు. దీంతో ఇంట్లో మరో వాటాలో అద్దెకు ఉండే వారికి ఫోన్ చేసింది. వారు గ్రామంలోనే ఉంటున్న వెంకటరమణ సోదరుడు రమేష్‌కు సమాచారం అందించారు. అతడు వచ్చి తాళం పగులగొట్టి చూడగా ఈ దారుణం బయటపడింది. దంపతుల హత్యపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హంతకులు నగలను కానీ నగదును కానీ ఎత్తుకెళ్లిన ఆనవాళ్లు లేవు. నగల మూట ఇంట్లోనే ఉంది. వాటిని పోలీసులు పరీక్షించగా రోల్డ్‌గోల్డ్ అని తేలాయి. నగల మూటను ముట్టుకోని హంతకులకు అవి రోల్డ్‌గోల్డ్ అని తెలియకపోవచ్చని పోలీసులు భావిస్తున్నారు. బాగా తెలిసిన వ్యక్తులే హత్యకు పాల్పడ్డారా? లేక సుపారీ గ్యాంగ్‌ను ఉపయోగించారా? అనే కోణంలో విచారణ చేస్తున్నారు.

సింగరేణిలో కదులుతున్న స్కాముల డొంక

విజిలెన్స్ విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి.. లోడర్ల ట్యాంపరింగ్‌లోనే 62 లక్షలు స్వాహా

- ఎలాంటి తనిఖీలూ లేకుండానే బిల్లుల చెల్లింపు
- బొగ్గు ఓవర్ లోడింగ్ సహా 5 అంశాల్లో అవినీతి
- రూ.11కోట్ల మేర అక్రమాలు జరిగినట్టు నిర్ధారణ!
- బాధ్యుల వాంగ్మూలాలు నమోదుచేసిన విజిలెన్స్
- సీల్డ్ కవర్‌లో కార్పొరేట్ కార్యాలయానికి నివేదిక

భూపాలపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మొన్న డీజిల్ కుంభకోణం.. నిన్న బొగ్గు దారి మళ్లింపు.. తాజాగా లోడర్ల మీటర్ల ట్యాంపరింగ్.. సింగరేణి భూపాలపల్లి ఏరియా పరిధిలో కుంభకోణాల డొంక కదిలింది! గడిచిన ఏడాది కాలంలో ఈ స్కాముల వల్ల సింగరేణికి దాదాపు రూ.11 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు విజిలెన్స్ విచారణలో ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది!! సింగరేణి భూపాలపల్లి ఏరియా పరిధిలో పలు అక్రమాలు జరుగుతున్నట్టు వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో.. సింగరేణి కార్పొరేట్ కార్యాలయం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. దీంతో రంగంలోకి దిగిన విజిలెన్స్ బృందం భూపాలపల్లి ఏరియాలో జరిగిన బొగ్గు లోడింగ్ స్కాం మొదలుకొని ఓవర్ లోడింగ్, ఓవర్ బర్డెనింగ్ (ఓసీపీలలో మట్టి తొలగింపు పనులు), వాహనాల టెండర్లు, నివాస క్వార్టర్ల కేటాయింపులు, ఉద్యోగుల నుంచి అక్రమ వసూళ్ల ఇలా ఒక్కో అవినీతి వ్యవహారంపై లోతుగా విచారించగా.. విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చినట్టు విశ్వసనీయంగా తెలిసింది. పదిరోజుల పాటు సాగిన విచారణ సందర్భంగా విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో బాధ్యుల నుంచి వాంగ్మూలాలను నమోదు చేసి సీల్డ్ కవర్‌లో కార్పొరేట్ కార్యాలయానికి నివేదించినట్టు సమాచారం. రామగుండం, మంచిర్యాల మందమర్రి, బెల్లంపల్లి ప్రాంతాల్లోనూ ఈ తరహా వ్యవహారాలు భారీగా సాగుతున్నట్టు సింగరేణి వర్గాలు అనుమానిస్తున్నాయి. ముఖ్యంగా ఉపరితల గనుల్లో బొగ్గును లోడింగ్ చేసే ప్రైవేట్ కాంట్రాక్టర్లు వాహనాలకు అదనంగా డిజిటల్ మీటర్లను బిగించి ఆ రీడింగ్‌లను రికార్డుల్లో నమోదు చేయించడం ద్వారా సింగరేణికి కోట్లల్లో నష్టం చేకూర్చినట్టు విచారణలో తేలింది. భూపాలపల్లిలో విజిలెన్స్ బృందం చేసిన విచారణలో.. వాస్తవిక రికార్డుకు, ట్యాంపరింగ్ ద్వారా నమోదు చేసిన మీటర్ రీడింగ్‌లకు మధ్య 3 వేల గంటల వ్యత్యాసం ఉన్నట్టు గుర్తించారు. దీని విలువ రూ.62 లక్షలు ఉంటుందని ప్రాథమికంగా నిర్ధారించారు. క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించి పని గంటలను నమోదు చేయాల్సిన సింగరేణి సిబ్బంది.. కాంట్రాక్టర్లు ఇచ్చే స్క్రీన్ షాట్ చిత్రాల ఆధారంగా మీటర్ల పనిగంటలను నమోదు చేసి కాంట్రాక్టర్‌కు దొడ్డిదారిన భారీగా లబ్ధి చేకూర్చినట్టు తేల్చారు. ఆ బిల్లులను ఉన్నతాధికారులు ఎలాంటి అభ్యంతరాలూ వ్యక్తంచేయకుండా మంజూరు చేయడం చర్చనీయాంశంగా మారింది.

ఏడాదిగా ఆరోపణలున్నా..

లోడింగ్ యంత్రాల మీటర్ల ట్యాంపరింగ్ ఆరోపణలు గత ఏడాది కాలంగా వినిపిస్తున్నా.. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ అధికారి వాటిని ఉద్దేశపూర్వకంగానే తొక్కి పెట్టారన్న ఆరోపణలున్నాయి. కొంతమంది ఉద్యోగులు కార్పొరేట్ కార్యాలయానికి ఫిర్యాదు చేయడం వల్లే ఈ వ్యవహారం బట్టబయలైంది. ట్యాంపరింగ్ ఆరోపణలపై విజిలెన్స్ బృందం విచారణ జరుపుతున్న క్రమంలో.. దానికి అనుబంధంగా మరికొన్ని రకాల పనుల్లోనూ అవినీతి బయటపడినట్టు చెబుతున్నారు. ముఖ్యంగా ఉపరితల గనుల్లో మట్టి తొలగింపు పనుల్లో భారీగా అక్రమాలు జరుగుతున్నాయని సింగరేణి వర్గాలు అంటున్నాయి. మట్టి తొలగింపునకు సంబంధించి తప్పుడు లెక్కలు చూపించి కాంట్రాక్టర్లకు సహకరించడం ద్వారా సంస్థకు చెందిన కొందరు అధికారులు ఆర్థికంగా భారీగా లబ్ధి పొందినట్లు ఆరోపణలున్నాయి. దీనిపై కూడా విజిలెన్స్ లోతుగా దర్యాప్తు జరిపినట్టు తెలుస్తోంది. అలాగే.. సింగరేణిలో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు లబ్ధిని చేకూర్చే ప్రైవేటు వాహనాల టెండరింగ్‌లోనూ ఓ అధికారి.. వారి నుంచి వాహనానికి రూ.30 వేల చొప్పున 24 వాహనాలకు దాదాపు రూ.7 లక్షలు లంచం తీసుకున్నట్టు గుర్తించారు. బొగ్గు ఓవర్ లోడింగ్‌కు సంబంధించి కూడా గడిచిన ఏడు నెలల కాలంలో దాదాపు రూ.4-5 కోట్ల మేర సంస్థ ఆదాయానికి గండి పడినట్టు విచారణలో వెల్లడైందని సమాచారం. ఈ వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా.. స్పందించేందుకు అధికారులు నిరాకరించారు.

ఈసారైనా అసలు దోషులకు శిక్ష పడేనా?

గతంలో కూడా ఇలాంటి ఆరోపణలు వచ్చినప్పుడు సింగరేణి సంస్థాగత విజిలెన్స్ విభాగం దర్యాప్తు జరిపి నివేదిక అందించినా.. కార్పొరేట్ విభాగానికి చెందిన కొంతమంది పెద్దలు తూతూ మంత్రంగా వ్యవహరించినట్లు సమాచారం. అప్పట్లో వారు అసలు దోషులను రక్షించి.. దిగువ స్థాయిలో ఉండే చిన్న ఉద్యోగులపై వేటు వేసి, వారిని బలిపశువులుగా మార్చారని సింగరేణి వర్గాల సమాచారం. కనీసం ఈసారైనా అసలు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.


సింథటిక్ డ్రగ్స్ కేసు దర్యాప్తు ముమ్మరం

- ఫోరెన్సిక్ ల్యాబ్‌కు నమూనాలు
- పరిశ్రమ ఎండీ సహా 14 మందిపై కేసు నమోదు
- 8 మంది అరెస్ట్, పరారీలో మరో ఆరుగురు నిందితులు

భువనగిరి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లాలో సంచలనం సృష్టించిన సింథటిక్ డ్రగ్స్ కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో మూతపడిన ఓ రసాయన పరిశ్రమలో సింథటిక్ డ్రగ్స్‌ను తయారుచేస్తున్న ముఠా గుట్టును తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీఏఎన్‌బీ), రాచకొండ పోలీసులు రట్టు చేసిన విషయం విదితమే. పరిశ్రమలో తయారు చేసిన డ్రగ్స్‌ను బీబీనగర్ టోల్‌గేట్ వద్ద సోమవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి 100 కిలోలు, పరిశ్రమలో 15 కిలోలు, మరో నిందితుడి వద్ద ఐదు కిలోలు మొత్తం రూ.24 కోట్ల విలువైన 120 కిలోల సింథటిక్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును టీజీఏఎన్‌బీ, రాచకొండ పోలీసులు సవాలుగా తీసుకున్నారు. పరిశ్రమ ఎండీ వాసుదేవాచారి సహా 14 మందిపై కేసు నమోదు చేశారు. ఇప్పటి వరకు ఎనిమిది మందిని అరెస్టు చేశారు. మిగతా ఆరుగురి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ అక్రమ దందా వెనుక ఉన్న రాకెట్‌ను కూడా ఛేదించే పనిలో ఉన్నారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ నమూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. ఆ నివేదిక రావడానికి సుమారు మూడు వారాలు పడుతుందని తెలుస్తోంది. అది వచ్చాక పోలీసులు మరింత దూకుడు పెంచనున్నారు. అలాగే సింథటిక్ డ్రగ్స్ తయారుచేసిన యాదగిరిగుట్ట మండలం రామాజీపేటలోని శ్రీ యాదాద్రి లైఫ్ సైన్సెస్ రసాయన పరిశ్రమలో 17 రకాల రసాయనాలు, ముడి సరుకులు, డ్రగ్స్ తయారీ ఉపకరణాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీ పేలి 8 వాహనాలు దగ్ధం

రామంతాపూర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రామంతాపూర్ వివేక్‌నగర్‌లో ఓ ఇంట్లో గ్రౌండ్ ఫ్లోర్లో ఓ ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీ పేలడంతో మంటలు చెలరేగి అక్కడ పార్క్ చేసిన ఎనిమిది ద్విచక్ర వాహనాలు దగ్ధం అయ్యాయి. బుధవారం తెల్లవారు జామున 3.30 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించి విఫలమయ్యి అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పి వేశారు. కానీ అప్పటికే ద్విచక్ర వాహనాల అగ్నికి ఆహుతయ్యాయి. ఉప్పల్ పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వాతావరణ అధర్మం

వాతావరణమార్పుమీద ప్రపంచదేశాలన్నీ ఏకతాటిమీదకు వచ్చి సంఘటితంగా యుద్ధం చేయగలవన్న ఆశ అంతకంతకూ నశించిపోతున్నది. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఏటా జరిగే సభ్యదేశాల మహాసదస్సు (కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్—కాప్)లో అప్పుడప్పుడు కొన్ని మెరుపులు తప్ప, ప్రభావవంతమైన చర్యలు కనిపించడం లేదు. అజర్‌బైజాన్ రాజధాని బాకులో మొన్న ముగిసిన సదస్సు కూడా ఎప్పటిలాగానే, కాస్తంత ఎక్కువసాగి, మరోరెండు రాత్రులు చర్చోపచర్చలు జరిగినా, ఫలితం మాత్రం ఘనంగా లేకపోయింది. ఈ 29వ సదస్సును ప్రత్యేకంగా 'ఫైనాన్స్ కాప్' అని అనుకోవడంలో ప్రధానోద్దేశం, వాతావరణంలో ప్రతికూల మార్పులమీద పోరాడేందుకు వీలుగా వర్ధమానదేశాలకు ధనికదేశాలు అందించే ఆర్థికసాయాన్ని అధికం చేయడం. వాతావరణమార్పులపై పోరాటాన్ని సుసాధ్యంచేయాలంటే, ఎదుగుతున్నదేశాలకు పెద్దదేశాలు అందించాల్సిన సాయం 1.3 ట్రిలియన్ డాలర్లు ఉండాలన్న నిర్దిష్టమైన అంచనాలకు పూర్తి భిన్నంగా, పదేళ్ళపాటు ఏటా మూడువందల బిలియన్ డాలర్లు ఇవ్వడానికి మాత్రమే ధనికదేశాలు సిద్ధపడటం, సదస్సులో తదనుగుణంగా తీర్మానం జరగడం విచిత్రం.

వాతావరణ నిధిని ఈ మేరకు సరిపెట్టేయడం భారత్ సహా మిగతా అభివృద్ధి చెందుతున్నదేశాలకు ఏ మాత్రం నచ్చలేదు. వాతావరణంలో ప్రతికూలమార్పుల వల్ల ప్రధానంగా నష్టపోతున్నది బడుగుదేశాలే కనుక, అధిక కాలుష్యంతో వాతావరణాన్ని నాశనం చేస్తున్నది అగ్రదేశాలే కనుక వాటినుంచి ఇవి ఎక్కువ సాయాన్ని ఆశించడంలో తప్పులేదు. వాతావరణ బీభత్సాలతో, విపత్తులతో అభివృద్ధిచెందుతున్న దేశాలకు ఒనగూరే నష్టంతో పోల్చితే అగ్రరాజ్యాలు ఏటా ఇచ్చే మూడువందల బిలియన్ డాలర్లు ఏ మూలకూ రాదు. మొదట 250 బిలియన్ డాలర్లకు ఒప్పుకొని, ఆ తరువాత వర్ధమాన దేశాల ఒత్తిళ్ళతో, సదస్సు విఫలమయ్యే ప్రమాదాలు కనిపించడంతో 300 బిలియన్ డాలర్లకు ఈ నిధిని పెంచడానికి అవి అంగీకరించాయి. అనేకగంటలపాటు చర్చలు నిలిచిపోయి, నిరసనలు, వాకౌట్లతో సదస్సులో గందరగోళం ఏర్పడిన తరుణంలో మరో యాభై బిలియన్ డాలర్లు అదనంగా చేర్చేందుకు అవి ఒప్పుకున్నాయి. ఇంతహడావుడివల్ల కాబోలు, ఈ చిన్న మొత్తమే అమెరికాకు మహాద్భుతంగా కనిపించింది.

ప్రపంచ ఉష్ణోగ్రతలను ఒకటిన్నర డిగ్రీల సెల్సియస్‌కు కుదించాలన్న లక్ష్యం పెట్టుకొని దాదాపు పదిహేనేళ్ళవుతోంది. పారిస్‌లో అనుకున్నదానిమీద పెద్దగా అడుగు ముందుకు పడకుండానే, మరోపక్క ఉద్గారాలు పెరిగిపోతున్నాయి, భూ ఉష్ణోగ్రత హెచ్చుతోంది. కొత్తగా చేసుకుంటున్న ఈ చేటును పరిమితం చేసుకుంటేనే, గతంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించడం సాధ్యపడుతుంది. ఉద్గారాలు తగ్గించుకోవాలంటే, ఆర్థికసాయంతో పాటు ఆధునిక సాంకేతికతలసాయం కూడా ఎదుగుతున్నదేశాలకు అందాలి. ఇవేమీ జరగకుండా, తమ ఉత్పత్తిని ఆవగింజంత తగ్గించకుండా, కాలుష్యాన్ని కుదించకుండా ధనికదేశాలు విచిత్రమైన విన్యాసాలు చేస్తున్నాయి.

గతంలో హామీ పడిన ఏటా 100 బిలియన్ డాలర్ల సాయం ఇప్పుడు మూడింతలు పెరిగినందుకు సంతృప్తిపడి సరిపెట్టుకోవడం వినా చేయగలిగిందేమీ లేదు. పదేళ్ళుగా ఆ పాత సాయం కూడా సరిగా సమకూరనిస్థితిలో, ఇప్పుడు కొత్తగా హామీపడినదానికి ఆ దేశాలు ఏమేరకు కట్టుబడివుంటాయో చూడాలి. మానవాళి అంతటికీ చెందిన ప్రకృతిని నాశనం చేసి, సిరిసంపదలతో, సకల సౌఖ్యాలతో తులతూగుతున్న ధనికదేశాలు కర్బన ఉద్గారాల పాపాన్ని మాత్రం దేశాలన్నింటికీ పంచాలనుకుంటాయి. ఉద్గారాల్లో డెబ్బయ్‌ఐదుశాతం వాటాతో ప్రకృతిని నాశనంచేస్తున్న సంపన్న దేశాలు పర్యవసానాలను మాత్రం పేదదేశాలమీద రుద్దుతున్నాయి. పర్యావరణ పరిరక్షణలో అవి కనీస బాధ్యత వహిస్తే కాప్ సదస్సులు ఇలా మొక్కుబడిగా తయారయ్యేవి కావు. అధిక పారిశ్రామికీకరణతో, హద్దులు లేని ఉత్పత్తితో లాభపడుతున్న సంపన్నదేశాల దగ్గరనుంచి ఇప్పుడు హామీపడిన ఆర్థికసాయాన్ని పొందడంతో పాటు, పర్యావరణ అనుకూల విధానాలకు మారేందుకు ఉపకరించే ఇతరత్రా పరిజ్ఞానాలను కూడా ఉచితంగానో, కారుచవుకగానో వర్ధమానదేశాలు పొందవలసి ఉంది. వచ్చే ఏడాది బ్రెజిల్‌లో జరగబోయే కాప్ 30 సదస్సులో ప్రపంచదేశాలన్నీ ఏకతాటిమీదకు వచ్చి వాతావరణ మార్పుపై మానవ పోరాటాన్ని విజయవంతం చేసే దిశగా నిర్దిష్ట కార్యాచరణకు పూనుకోవాలి.

తరం తరం ఒక కొత్త చరిత్ర

మనకు తెలిసినదే వాస్తవమని, ఆ తెలిసిన దానిలో మనకు నచ్చినదే జీవిత సత్యమని నమ్మే భావన ఒక సామాజిక అవగాహనగా దాదాపు మనందరిలోనూ స్థిరంగా కొనసాగుతూ ఉంటుంది. ఈ భావనలు పాక్షికమైనవి. వాస్తవానికి భిన్నమైనవి. ప్రతి అంశానికి విరుద్ధమైన పూర్తి వ్యతిరేకమైన అంశం మరొకటి వుండి తీరుతుంది. ఈ నియమం జీవరాశులకు మాత్రమే కాక, మనం సాధారణంగా నిర్జీవరాశులుగా భావించే రాళ్ళు, రప్పలు, ఖనిజాలు, యంత్రాలకు కూడ వర్తిస్తుంది. ప్రపంచంలో ప్రతీదీ నిరంతరం విరుద్ధ అంశాల పరస్పర సంఘర్షణ (dialectics)లోనే ముందుకు సాగుతుంటుంది.

చరిత్ర గమనాన్ని అవగాహన చేసుకునేందుకు మనకు అనేక పనిముట్లు అందుబాటులో వున్నాయి. అసలు పనిముట్ల ఆధారంగానే మానవ చరిత్రను వివరించే విధానం ఒకటుంది. పాత రాతియుగం, మధ్యరాతి యుగం, కొత్త రాతియుగం, కంచు యుగం, ఇనుము యుగం, పురాతన యుగం, మధ్య యుగం మొదలుకుని ఇప్పటి డిజిటల్, నానో టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వరకు పనిముట్ల వినియోగం ఆధారంగా మానవ సంబంధాల్లో వస్తున్న మార్పుల్ని వివరించవచ్చు. రాజులు, చక్రవర్తులు... వాళ్ళ కులమతాలు, అనుసరించిన పరిపాలనా విధానాల ద్వారా కూడ చరిత్రను వివరించే పద్ధతులు కొన్ని ఉన్నాయి.

చరిత్ర అంటే గతం అనుకుంటాం; నిజానికి అది వర్తమానం కూడ కాదు; భవిష్యత్తు!. భవిష్యత్తును నిర్మించుకునే లక్ష్యంతోనే మనిషి గతం నుండి కొన్ని అనుభవాలను, పరికరాలను ఎంచుకుంటాడు. 'రేపు—నిన్న—రేపు' అనేది చరిత్ర రచన క్రమానికి సమీకరణం. ప్రతిలోనూ మంచీ వుంటుంది, చెడూ వుంటుంది. భావి రాజకీయ ఆర్థిక ప్రయోజనాల కోసం గత చరిత్రను వక్రీకరించే పద్ధతులు ఇప్పుడు చురుగ్గా పనిచేస్తున్నాయి. మధ్యయుగాల్లో ముస్లిం పరిపాలకులు హిందువులను హింసించారని ఒక అభియోగాన్ని విస్తృతంగా ప్రచారంలో పెట్టి, ఇప్పుడు ముస్లింలను రాజకీయార్థిక సాంస్కృతిక రంగాల్లో హింసించి ప్రతీకారం తీసుకుంటామని శపథాలు చేస్తే ఓటర్లలో ఓ మూడవ భాగమైనా ఉత్తేజితులై బలపరుస్తారు. అలా అధికారం సులువుగా దక్కుతుందనేది ఆధునిక రాజకీయార్థిక చరిత్ర రచన ఫార్ములా. మూడవ భాగం అనేది అల్పసంఖ్య. అయితేనేం? మల్టీపార్టీ పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో మూడవ భాగం ఓట్లు మాత్రమే వచ్చినా సరే తిరుగులేని విజయం అని చెప్పుకునే అవకాశం వుంది.

'చరిత్ర తనంతతానుగా పునరావృతం అవుతుంది; మొదటిసారి విషాదంగానూ, రెండోసారి ప్రహసనంగానూ' (History repeats itself, first as a tragedy, second as a farce.) అన్న కార్ల్ మార్క్స్ వ్యాఖ్య చాలామందికి తెలుసు. ఆయన చరిత్ర గురించి ఇంకా చాలా చాలా అన్నాడు. పునరావృతం అవ్వడం అంటే జరిగిన సంఘటనలే సరిగ్గా అలాగే మళ్ళీమళ్ళీ జరుగుతాయని కాదు; వాటి స్థాయీ పెరుగుతుందన్నాడు. సంఘటనలు గతానికి విరుద్ధంగా పునరావృతం అవుతాయనే అర్థమూ అందులో వుంది.

వలస పాలన కాలం ఎలావున్నా ఆధునిక చారిత్రిక ఘటనలకు అనివార్యంగా రాజ్యాంగంతోనూ, కొత్త



చరిత్ర అంటే గతం అనుకుంటాం; నిజానికి అది వర్తమానం కూడ కాదు; భవిష్యత్తు!. భవిష్యత్తును నిర్మించుకునే లక్ష్యంతోనే మనిషి గతం నుండి కొన్ని అనుభవాలను, పరికరాలను ఎంచుకుంటాడు. ఇరవయ్యవ శతాబ్దాన్ని నడిపించిన వాదనలు ఇరవై ఒకటవ శతాబ్దంలో పనికిరావు. ఈ ధర్మసూక్ష్మం తెలియడమే చారిత్రక దృష్టి. అది ఇప్పుడు మనకు చాలా అవసరం.

చట్టాలతోనూ ఒక సంబంధం వుంటుంది. రాజ్యాంగం మీద ఒక్కో చారిత్రక సందర్భంలో ఒక్కో అభిప్రాయం వెలువడుతూ వుంటుంది. ఇవి పరస్పరం వ్యతిరేకంగానూ వుంటాయి. రాజ్యాంగసభను బ్రిటీష్ పాలకులే ఏర్పాటు చేశారు కనుక అది వలస రాజ్యాంగం అనేవారున్నారు. భారత రాజ్యాంగం గొప్ప ప్రజాస్వామికమైనది అనేవారున్నారు. కొందరు ఒక అడుగు ముందుకేసి అది సామ్యవాదాన్ని ఆకాంక్షిస్తుంది అంటుంటారు. దాన్ని పెట్టుబడిదారుల రాజ్యాంగం అనేవారూ వున్నారు. రాజ్యాంగ రచనే ఒక కుట్ర అన్నవారూ వున్నారు. ఎమర్జెన్సీని మించిన క్రూరమైన చట్టాలతో పీడిత ప్రజల్ని నిరంతరం పరమ కిరాతకంగా చంపేయడానికి రాజ్యాంగం దోహదపడుతుందనేవారూ వున్నారు. రాజ్యాంగం గాంధీజీ—అంబేద్కర్‌ల మార్గంలో అహింసను ప్రోత్సహిస్తుంది అనేవారున్నారు. 'దేవతలు నివసించడానికి ఒక ఆలయాన్ని నిర్మిస్తే దెయ్యాలు దాన్ని స్వాధీనం చేసుకున్నాయి. ఇప్పుడు ఆ ఆలయాన్ని నాశనం చేయడం తప్ప మనం ఏమి చేయగలం?' అని ఓ సందర్భంలో అంబేద్కర్ వాపోయారు. రాజ్యాంగానికి ఎంత చెదపట్టినాసరే ఇప్పటికీ అదే మనకు గతి అనేవారూ వున్నారు. సామాజికార్థిక రంగాల్లో సమానత్వాన్ని సాధించకపోతే ప్రజలు సాయుధులై తిరగబడతారని అంబేద్కర్ ఎలాగూ హెచ్చరించాడు. రాజ్యాంగం అంటే రాజ్యపు అంగం అనేది నిఘంటువు అర్థం. రాజ్యం అంగి; రాజ్యాంగం దాని అంగం.

ప్రజల ఆందోళనలు, ఉద్యమాలు, పోరాటాల ఆధారంగా ఇటు సమాజంలో అటు ప్రభుత్వ విధానాల్లో వచ్చిన మార్పుల్ని వివరించడం చరిత్ర రచనలో ఇంకో పద్ధతి. అయితే ఇందులో కూడ ఒక తిరకాసు వుంది. ప్రజాందోళనలు సాధించిన విజయాలు కూడ ఒక దశ తరువాత తిరుగుముఖం పడతాయి.

ఫ్రాన్స్, ఇంగ్లండ్‌లలో రాచరిక — భూస్వామ్య వ్యవస్థ మీద పెట్టుబడిదారులు ప్రాణాలొడ్డి పోరాడారు. మన దేశంలో రాచరిక — భూస్వామ్య వ్యవస్థ మీద కొన్నిచోట్ల కమ్యూనిస్టులు ప్రాణాలొడ్డి పోరాడారు. మన భూస్వాములు యూరోపియన్ భూస్వాములకన్నా బాగా తెలివైనవారు. పెట్టుబడిదారులతో తలపడితే తమ పతనం తప్పదని తెలుసుకుని వాళ్ళే పెట్టుబడిదారులైపోయారు. ఈ పరిణామాన్ని రాజ్యాంగ సభలోనే చూడవచ్చు. సభ్యుల్లో అత్యధికులు రాచరిక — భూస్వామ్య వ్యవస్థ ప్రతినిధులు. అయినప్పటికీ వారు అత్యంత ఆధునిక రాజ్యాంగానికి ఆమోదం తెలిపారు.

1970లలో రాజభరణాలు రద్దు, భూపరిమితి చట్టం, బ్యాంకుల జాతీయకరణ, అటవీ భూములపై ఆదివాసులకు ప్రత్యేక హక్కులు వగైరా ప్రజాస్వామిక చట్టాలు వచ్చాయి. ఇవన్నీ నక్సలైట్ సాయుధ పోరాట విస్తరణకు భయపడి రూపొందించిన చట్టాలే. ఆ మేరకు అవి ప్రజా విజయాలే. అయితే, రాజ్యం తన స్వభావాన్ని భూస్వామ్యం నుండి పెట్టుబడిదారీ దిశగా మార్చుకోవాలనుకోవడం కూడ దీనికి మరో కారణం.

తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్టు భూస్వాములు ముదిరి పెట్టుబడిదారులయ్యారు. పెట్టుబడిదారులు ముదిరి కార్పొరేట్లు అయ్యారు. వాళ్ళు ముదిరి మెగా కార్పొరేట్లయ్యారు. వాళ్ళు తిమింగలాలను మించిపోయారు. బ్లూ వేల్, లివియాథాన్ (Leviathan) వంటివన్నమాట. తెలుగులో తిమింగలగిలం అంటారు. వాళ్ళకిప్పుడు అలనాటి జమిందారులు, జాగీర్దారులు ఆ మాటకొస్తే చక్రవర్తులకు వుండినంత భూమి కావాలి. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి మూడు వేల ఎకరాల భూమి కావాలి. స్టీల్ ప్లాంటుకు ముప్పయి వేల ఎకరాలు కావాలి. ఇంకో ప్రాజెక్టుకు మొత్తం నికోబార్ ద్వీపం కావాలి. ఇంకొకరికి మొత్తం మిజోరాం, మణిపూర్ రాష్ట్రాలు కావాలి. వాళ్ళ కోసం అటవీ భూముల పరిరక్షణ చట్టాల్ని పార్లమెంటు సవరిస్తుంది. అలా 1970వ దశాబ్దంలో వచ్చిన ప్రజాస్వామికం అనుకునే చట్టాలన్నీ ఒకదానివెంట మరొకటి రద్దయిపోతాయి. లేదా శవపేటికలో వుండిపోతాయి. 'Undoing the doing' అన్నమాట.

ఇవన్నీ దేశాభివృద్ధి పేరిటే జరుగుతాయి. దేశాభివృద్ధి మంత్రం ముందు మరేదీ నిలవదు. ఇంతకీ దేశాభివృద్ధి అంటే ఏమిటీ? ఎవరి నిర్వచనం వారిది. దీపావళికి ముందు బంగారం ధర పెరుగుతుంటుంది. ఆ ఊపులో అవసరానికి మించి పెరిగిపోతుంది. దీపావళి తరువాత ధర తగ్గుముఖం పడుతుంది. ఆ నైరాశ్యంలో అవసరానికి మించి తగ్గిపోతుంది. మళ్ళీ సంక్రాంతికి ధర పెరుగుతుంది. ఈసారి కూడా అవసరానికి మించి పెరుగుతుంది. మళ్ళీ అవసరానికి మించి తగ్గుతుంది. స్టాక్ మార్కెట్‌లో షేర్లు కూడ అంతే. పెరిగేటప్పుడూ అతిశయమే తగ్గేటప్పుడూ అతిశయమే. రాజకీయాలూ అంతే. అతిశయాలతో నిండిపోతాయి. అప్పుడు 'Undoing the doing' అనివార్యమైపోతుంది.

కొన్నాళ్ళు వామపక్షమే మేలనిపిస్తుంది. అది అతిశయించినపుడు కుడిపక్షం మేలనిపిస్తుంది. అదీ అతిశయిస్తుంది. అప్పుడు మళ్ళీ వామపక్షమే మేలనిపిస్తుంది. ఈ వృత్తం పూర్తి అయ్యేసరికి పాత వామపక్షమూ వుండదు; పాత కుడిపక్షమూ వుండదు. వాటి మధ్య పాత పోరాట రూపమూ వుండదు. అన్నీ మారిపోతాయి. అన్నింటి స్థాయి పెరిగిపోతుంది. నిలువుగా పైకి ఎగబ్రాకే స్ప్రింగు చుట్టలా సెర్పిలాకృతిలో సమాజం ముందుకు సాగిపోతుంటుంది.

ప్రజాస్వామ్య వైఫల్యాల నుండే ఫాసిజం పుడుతుంది. ఫాసిజం అతిశయాల నుండే సమానత్వం పుడుతుంది. ఇవ్వాల్టి ఫాసిజం గత శతాబ్దపు ఫాసిజం కాదు. నిన్న దాటిన మైలురాయి మళ్ళీ ఎదురైనట్టు అనిపిస్తుంది. ఆ మైలురాయి నిన్నటిదికాదు. నిన్నలా దాన్ని దాటడమూ కుదరదు. దానికొక కొత్త పద్ధతి కావాలి. దానికి అవసరమైన కొన్ని సూచనలు మాత్రమే మనకు చరిత్ర నుండి దొరకవచ్చు. వర్తమానానికి కావలసింది సరికొత్త సృజనాత్మకత. అదే చరిత్రను నడుపుతుంది.

ప్లస్సుకు మైనస్సు వ్యతిరేకం అయినట్టు, పగటికి రాత్రి వ్యతిరేకం అయినట్టు కొందరు మెజారిటీ మతతత్వానికి విరుగుడు మైనారిటీ మతతత్వం అంటుంటారు. సమాజం మరీ ఎలిమెంటరీ స్కూలు లెఖ్ఖలంత ఈజీ కాదని వీళ్ళకు కొంచెం గట్టిగానే చెప్పాలి.

శాంతిదూత బిరుదాంకితులు కావచ్చు, బౌద్ధం శరణం గచ్ఛామి అనొచ్చు మయన్మార్ శ్రీలంక పాలకుల్ని నియంతలు అనకుండా వుండగలమా? ఇరవయ్యవ శతాబ్దపు ఫాసిస్టులు, నాజీయిస్టులు పాటించిన డ్రెస్ కోడ్‌ను ఇరవై ఒకటో శతాబ్దపు ఫాసిస్టులు పాటించరు. ఇండియా జర్మనీని దాటడానికి ఇంకా ఒక్క అడుగే ఉందట. ఎందులో? ఇంకా ఎంతకాలం జార్జి డిమిత్రోవ్, రజిని పామే దత్ నిర్వచనాల్లో మునిగితేలుతుందాం? కొంచెం కొత్త నీళ్ళ కోసం వెతుకుదాం.

ఓ భగత్‌సింగ్, ఓ అల్లూరి, ఓ చారు మజుందార్ మళ్ళీ పుట్టాలి అని కొందరు కవితలు రాస్తుంటారు. భావుకత వరకు అది సరేగానీ, ఇరవయ్యవ శతాబ్దంలో వాడిన ఆయుధాలు ఇరవై ఒకటవ శతాబ్దంలో పనికిరావు. ఆ ధర్మసూక్ష్మం తెలియడమే చారిత్రక దృష్టి. అది ఇప్పుడు చాలా అవసరం. చరిత్ర అంటే గతంకాదు భవిష్యత్తు. ప్రతి తరం ఒక కొత్త చరిత్ర రాయాల్సిందే.

● డానీ

పెను సవాళ్ళకు దారితీయనున్న
వర్గీకరణ ప్రయత్నాలు

'కోటా తీర్పుపై శాసనిక చర్యలేవీ?' శీర్షికన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కృపాకర్ మాదిగ రాసిన వ్యాసంలో (24—10—2024) ఆయన మాలలపై అక్కసుతో అబద్ధ ప్రచారాల పరంపరను మరోసారి కొనసాగించారు. గత ఆగస్టు ఒకటో తేదీన దేశ అత్యున్నత న్యాయస్థానం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సంబంధించి ఇచ్చిన తీర్పు కక్షిదారులకన్నా దాని ప్రభావిత వర్గాలను తీవ్రమైన ఆందోళనకు గురిచేసింది. ప్రధానంగా ఉత్తర భారత దళితులు ఈ తీర్పును అంగీకరించేది లేదని ఆందోళనలు చేస్తున్నారు. తీర్పుకు వ్యతిరేకంగా జరిగిన భారత్ బంద్‌లో ఉత్తర భారతదేశంలో, ముఖ్యంగా మాదిగ సామీప్య కులం లాంటి చమార్ కులస్తులు అధికంగా ఉన్న ప్రాంతాలలో, విజయవంతం కావడమే అందుకు నిదర్శనం. తీర్పుపై వేసిన అనేక రివ్యూ పిటీషన్లను సుప్రీంకోర్టు తిరస్కరించింది. నిజానికి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలో ఇచ్చిన ఏ తీర్పుపై కూడ రివ్యూ పిటీషన్లను ఆయన అనుమతించలేదు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రిజర్వేషన్ల భవితవ్యంపై నిపుణులను ఆందోళనకు గురిచేస్తున్నది.

నిజానికి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2014లో రెండుగా విడిపోయిన తర్వాత వర్గీకరణ డిమాండ్‌కు మునుపటి ప్రాధాన్యత లేకుండే. కాని 2023 నవంబర్ 11న సికింద్రాబాద్ సభలో ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన హామీ మేరకు కేంద్రంలో రాజీవ్ గౌబా నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు, ఆ తర్వాత అన్నీ చకచకా జరిగిపోయినవి. ఇరవై సంవత్సరాల అనంతరం అనూహ్యంగా 2024 ఫిబ్రవరి 6న సుప్రీంకోర్ట్ రివ్యూ పిటిషన్‌ను ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేసింది. వర్గీకరణ వాదులకు రెండురోజులు, వ్యతిరేకులకు ఒకరోజు మాత్రమే వాదనలను అనుమతించడంతోనే రాబోయే తీర్పును చాలామంది ముందుగానే ఊహించినారు. ఇది ఖచ్చితంగా రాజకీయ ప్రేరేపిత తీర్పు.



సుప్రీంకోర్టు తీర్పును న్యాయకోవిదులతో పరిశీలన చేయించకుండానే, 'ఎంపరికల్ డేటా' సేకరణ జరగకుండానే, కేవలం రెండు రాష్ట్రాల్లో మాత్రమే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో తన విధానమేమిటో ప్రకటించకుండానే తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణ అమలు చేసే ప్రక్రియకు పూనుకొని ముందుకు వెళ్తున్నది. ఇరు వర్గాలను ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో కాంగ్రెస్ చివరకు రెంటికీ చెడ్డ రేవడై మిగిలినా ఆశ్చర్యం లేదు.

565 పేజీల తీర్పును క్షుణ్ణంగా పరిశీలిస్తే, అనేక సంక్లిష్ట అంశాల ప్రస్తావన కూడా తీర్పులో ఉంది. ఎస్సీ ఎస్టీ ఉపకులాలు సజాతీయులు కారంటూ, ఎస్టీ వర్గీకరణను కూడా ఉటంకిస్తూ క్రీమీలేయర్ ప్రస్తావన తెచ్చింది. 'ఎంపరికల్ డాటా' ఆధారంగా అనేది అనేక సంక్లిష్టతలతో కూడుకొన్నది. దీని ప్రకారం ముందుగా జనాభా లెక్కలు తీయాలి. ఇది కేంద్ర ప్రభుత్వం మాత్రమే చేయాలి. 2011 జనాభా లెక్కల అనంతరం రాష్ట్రం విడిపోయింది కాబట్టి ప్రజల వలసలు జరిగిన నేపథ్యంలో పాత లెక్కలు రెండు రాష్ట్రాలకూ ఎంతమాత్రం ప్రామాణికం కాజాలవు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయిన 2014 నుంచి ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన సుమారు పదహారు రకాల స్కీముల ఆర్థిక ప్రయోజనాలు పొందిన లబ్ధిదారుల కులం లెక్కల సేకరణ, ప్రకటన జరగాలి. సుప్రీం తీర్పులో జనాభా, నిష్పత్తి పంపిణీ ప్రస్తావన లేదు. అయినా జనాభా శాతం కన్నా ఎక్కువ పొందినవారిని వెనుక వరుసలోను, తక్కువ ప్రయోజనం పొందిన వారిని ముందు వరుసలోను ఉంచడమే సహజ న్యాయం. డేటాలో తేడాలు ఏమైనా ఉంటే కోర్టుకు వెళ్ళవచ్చు అని తీర్పులోనే సూచించింది. ఇదంతా 'ఇష్టాలు లేదా రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా' జరగాలని కూడా పేర్కొంది.

అసలు అన్నింటికీ మించి ఉమ్మడి రాష్ట్రాల్లో అమలవుతున్న ఉద్యోగాల స్థానికత విషయంలో రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం ఆర్టికల్ 371డి పరిష్కరించడం న్యాయశాఖకు ఒకపెద్ద సవాలే. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో అమలవుతున్న జిల్లా జోనల్ మల్టీ జోనల్ స్థాయి కేటగిరీ పోస్టుల్లో వర్గీకరణ ఎలా చేస్తారనేది మిలియన్ డాలర్ ప్రశ్న. 2011 జనాభా లెక్కల ఆధారంగా ముందుకు వెళ్తే గతంలో మాలలకు 6శాతం, మాదిగలకు 7శాతం కేటాయించిన వాటాలను అలాగే కొనసాగించాలి. ఏ గ్రూపుకు 1శాతం, డి గ్రూపుకు 1శాతం, రెండు గ్రూపులకు కేటాయించిన వాటాలను కలిపి ఏ గ్రూపుగా 2శాతం, ఉషామెహ్రా కమిషన్ రిపోర్ట్ పేజీ 54 ప్రకారం తెలంగాణలో మాదిగలకన్నా వెనుకబడిన మాలలను బీ గ్రూపుగా 6శాతం, దగా పడ్డామంటూనే అన్ని రంగాల్లోనూ అగ్రభాగాన ఉన్న మాదిగలను సీ గ్రూపుగా 7శాతం నిర్ణయించి కేటాయించడమే శాస్త్రీయ వర్గీకరణ అవుతుంది. పంజాబ్ రాష్ట్రంలో అమలవుతున్న 25శాతం ఎస్సీ రిజర్వేషన్లను ఏ — బీ అనే రెండు గ్రూపులుగా మాత్రమే వర్గీకరించిన అంశాన్ని ఇక్కడ పరిగణనలోకి తీసుకోవాలి.

1965లో బిఎన్ లోకూర్ కమిటీ రిపోర్టులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాల కులాన్ని ఎస్సీ జాబితా నుంచి తొలగించమని సిఫారసు చేసిందంటూ కృపాకర్ రాసిన రాతలు అబద్ధం. అలాంటి డిమాండ్ అర్థరహితమైనదని 116 పేజీల బిఎన్ లోకూర్ కమిటీ రిపోర్టు పేజీ నెంబర్ 56లో తిరస్కరించింది. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఇటువంటి అబద్ధపు రాతలు రాస్తూ, మాదిగ శ్రేణులను రెచ్చగొడుతూ, సమాజాన్ని తప్పుతోవ పట్టించే ప్రయత్నం చేయడం దుర్మార్గం.

సుప్రీంకోర్టు తీర్పును న్యాయకోవిదులతో పరిశీలన చేయించకుండానే, 'ఎంపరికల్ డేటా' సేకరణ జరగకుండానే, కేవలం రెండు రాష్ట్రాల్లో మాత్రమే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో తన విధానమేమిటో ప్రకటించకుండానే తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణ అమలు చేసే ప్రక్రియకు పూనుకొని ముందుకు వెళ్తున్నది. మంత్రివర్గ ఉపసంఘంలో ఇప్పటివరకు అగ్రభాగ ఫలాలు అనుభవించిన కులాల ప్రతినిధులను సభ్యులుగా ఉంచడం ఎవరి మెప్పుకోసమో కాలమే సమాధానం చెప్తుంది. ఏనుగును ఏడుగురు గుడ్డివారు ఏడురకాలుగా వర్ణించినట్లు వర్గీకరణ తీర్పును పలువురు పలురకాలుగా వక్రీకరిస్తున్నారు. చికిత్స చేసేముందు రోగనిర్ధారణ చేసి చికిత్సకు పూనుకోవాలి. కానీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా చికిత్సకు ఏర్పాట్లు చేసి రోగనిర్ధారణ ప్రయత్నాలు చేస్తున్నది. ఇరు వర్గాలను ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో కాంగ్రెస్ చివరకు రెంటికీ చెడ్డ రేవడై మిగిలినా ఆశ్చర్యం లేదు.

○ మామిడి నారాయణ
రీసెర్చ్ స్కాలర్, యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ, జైపూర్

మహిళపై ప్రతిచోటా పడగ విప్పుతున్న హింస

'ప్రతి పది నిమిషాలకు ఒక మహిళ మరణించే పరిస్థితి ఉండటం క్షమార్హం కాదు. మహిళలపై హింసకు వ్యతిరేకంగా ఏకం కండి' అనే నినాదంతో ఈ ఏడాది ఐక్యరాజ్యసమితి 'మహిళలపై హింస నిర్మూలన' లక్ష్యంగా పదహారు రోజుల కార్యాచరణకు పిలుపునిచ్చింది (నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు).

మహిళలపై అనేక రూపాలలో జరిగే హింసలో అంతగా చర్చకు రానిది— మాతృత్వ హింస. భారతదేశంలో అనవసరమైన సిజేరియన్ ఆపరేషన్లు ఆందోళనకర స్థాయికి పెరిగాయి. దీనివల్ల గౌరవప్రదమైన మాతృత్వ హక్కు ప్రమాదంలో పడుతున్నది. మద్రాసు ఐఐటీ జరిపిన ఒక పరిశోధన ప్రకారం 2016—2021 మధ్య కాలంలో ప్రైవేట్ ఆస్పత్రులలో సిజేరియన్ ప్రసవాలు 6.5శాతం పెరిగాయి (40.9శాతం నుంచి 47.4 శాతానికి). జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే 2019—21 ప్రకారం అసోం, ఒడిశా, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని ప్రైవేట్ ఆసుపత్రులలో ఇవి 70శాతాన్ని మించిపోయాయి.

సిజేరియన్ ప్రాణ రక్షక చికిత్స కానీ అనవసరపు సిజేరియన్ వల్ల తల్లీబిడ్డలకు పలు సమస్యలు ఎదురవుతాయి: రక్తం కోల్పోవడం, ఇన్‌ఫెక్షన్, కోలుకోవడానికి ఎక్కువ రోజులు పట్టడం, బిడ్డలకు పాలివ్వడంలో ఆలస్యం, తరువాతి గర్భధారణలో సమస్యలు... వంటివి. ప్రతి వైద్యశాలలో గత సంవత్సరం సిజేరియన్ ప్రసవాల శాతాన్ని నోటీసు బోర్డుపై ప్రదర్శించాలన్న నిబంధన విధిస్తే ఈ అంశంపై గర్భవతి విజ్ఞతతో కూడిన నిర్ణయం తీసుకొనే అవకాశం కలుగుతుంది.

మహిళలు హింసను ఎదుర్కొంటున్న మరో చోటు— సోషల్ మీడియా. కృత్రిమ మేధస్సు (ఏఐ)ను కూడా మహిళలను వేధించేందుకు దుర్వినియోగం చేస్తున్నారు. ఇందుకు 'డీప్‌ఫేక్ ట్రెండ్ ఒక ఉదాహరణ. నగ్న చిత్రాలతో వేధింపులు (ఇమేజ్ బేస్డ్ అబ్యూజ్) ఎక్కువ కావటం వల్ల మహిళలు, ముఖ్యంగా బాలికలు, ఆత్మహత్య చేసుకుంటున్న ఉదంతాలు పెరుగుతున్నాయి. భారతదేశంలోని 'నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్' ఆర్థిక నేరాలతో పాటు నగ్న చిత్ర వేధింపులపై కూడా మరింత దృష్టి పెట్టాలి.

సోషల్ మీడియాను ఒక సాధనంగా వాడుకుంటూ మహిళలను రాజకీయాల నుంచి దూరం చేయాలనే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. అజ్ఞాతంగా కామెంట్ చేయగలిగే అవకాశం ఉండటంతో, ట్రోలర్లు— ధైర్యంగా ఎలాపడితే అలా రాస్తున్నారు. మహిళల గురించి రాసేప్పుడు ఈ ధైర్యం ఇంకా ఎక్కువ ప్రదర్శిస్తున్నారు. తరతరాలుగా ముదిరిపోయిన పురుషాధిక్యతా ధోరణే ఇందుకు కారణం. ఈ ధోరణికి అడ్డుకట్ట వేయకపోతే మహిళలు ప్రజాక్షేత్రంలోకి, పరిపాలనా రంగంలోకి రావడానికి వెనుకాడతారు.

పశ్చిమ బెంగాల్ వైద్యురాలి హత్యాచార ఘటన విషయంలోనే గాక, ఇలాంటి అనేక సందర్భాలలో హంతకులు పోర్నోగ్రఫీ వ్యసనపరులని వార్తలొచ్చాయి. కొంతకాలమైనా పోర్నోగ్రఫీపై నిషేధం విధించి ప్రభావాన్ని గమనించాలి. చైనా, యూఏఈ వంటి దేశాలు పోర్నోగ్రఫీపై పకడ్బందీగా నిషేధాన్ని అమలు చేస్తున్నాయి. ఈ రెండు దేశాలూ బాలలకు, మహిళలకు భద్రమైన దేశాలని పేరున్నది. జీవితంలోని అన్ని అంశాలలో మహిళలకు భద్రతను, గౌరవాన్ని హామీ ఇవ్వడం ద్వారా మాత్రమే భారతదేశం మరింత న్యాయమైన, వికసిత భవిష్యత్తు వైపు పురోగమిస్తుంది.

– శ్రీనివాస్ మాధవ్
సమాచార హక్కు పరిశోధకులు

పోలీస్ రాజ్యం ఎవరిదో ప్రజలింకా మర్చిపోలేదు!

అప్పుడప్పుడు దెయ్యాలు వేదాలు వల్లిస్తుంటాయి. నరరూప రాక్షసులు మానవత్వంపై ప్రవచనాలు వినిపిస్తుంటారు. అబద్ధాలకోరులు నిజాలను భుజాలపై నిలబెడుతున్నామంటూ గప్పాలు కొడుతుంటారు. నియంతలు ప్రజాస్వామ్యానికి కాపాలా కుక్కలమంటూ భుజాలు చరుచుకుంటారు. అవినీతిపరులు నీతినిజాయితీలకు నిలువుటద్దాలమంటూ స్వోత్కర్షలకు పాల్పడుతుంటారు. పదేళ్ల పాటు కిరీటం లేని చక్రవర్తిలా, యువరాజులా గుర్తింపు పొందిన కేటీఆర్ వీటన్నింటికీ అసలు సిసలు ప్రతిరూపం.

తమ పాలన స్వర్ణయుగమనీ తమ పాలనా కాలంలో అవలంబించిన విధానాలతోనే తెలంగాణ పారిశ్రామిక అనుకూల రాష్ట్రంగా మారిందని అధికారంలో ఉన్నప్పుడూ, అధికారం కోల్పోయిన తర్వాతా కేటీఆర్ పలు వేదికలపై చెప్పుకొచ్చారు. అదే కేటీఆర్ ఇప్పుడు కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఫార్మా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తుంటే అడ్డుకునే కుట్రలకు తెరలేపారు.

పరిశ్రమలకు భూ సేకరణ ఎక్కడైనా కొంత ఇబ్బందులతో కూడుకున్నదే. ఏళ్లుగా భూమిని నమ్ముకున్న రైతులు వాటిని వదులుకునేందుకు ఇష్టపడరు. ఆ అనుబంధాన్ని పూడ్చలేకపోయినా భూమికి సరైన నష్ట పరిహారం ఇచ్చి మరోచోట భూమి కొనుగోలు చేసే అవకాశాన్ని కల్పించేందుకు ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తుంటాయి. ఈ క్రమంలోనే లగచర్లలోనూ పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి భూ సేకరణకు ప్రభుత్వం ప్రయత్నించింది. రైతుల్లో కొంత ఆందోళన ఉన్నా పరిశ్రమ ఏర్పాటు ఆవశ్యకత, కలిగే లబ్ధి, భూములు కోల్పోయే వారికి ఇచ్చే పరిహారం తదితర అంశాలపై చర్చించేందుకు వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అక్కడకు వెళ్లారు. ముందుగా పన్నిన కుట్ర ప్రకారం ఆయనను గ్రామం లోనికి పిలిపించిన బీఆర్ఎస్ గూండాలు కలెక్టర్, ఇతర అధికారులపై దాడులకు పాల్పడడంతో పాటు వారి వాహనాలను ధ్వంసం చేశారు. ఆ గ్రామంలో సెంటు భూమి లేని ఓ గుండా నేతృత్వంలోని అల్లరిమూక అధికారులపై దాడులకు తెగబడింది. దీనిని ఖండించాల్సిన కేటీఆర్ భూ నిర్వాసితులపై కేసులు పెడుతున్నారంటూ, ఆడవారిని లైంగిక వేధింపులకు గురి చేశారంటూ, దళితులూ గిరిజనులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారంటూ తప్పుడు ఆరోపణలతో గల్లీ నుంచి ఢిల్లీ వరకు గుండెలు బాదుకుంటూ తిరుగుతున్నారు. తమ పార్టీ నేతలు కుట్రపూరితంగా చేసిన వ్యవహారాన్ని కప్పిపుచ్చుకోవడానికి కొత్త కొత్త వాదనలు తెరపైకి తెస్తున్నారు. దాడులకు తెగబడిన బీఆర్ఎస్ అరాచక ముఠా నాయకుడు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డితో పదులసార్లు ఫోన్‌లో మాట్లాడినట్లు ఆధారాలు ఉన్నప్పటికీ లేవని బుకాయిస్తున్నారు.

రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందని ఒక హాస్యాస్పదమైన ప్రకటనను కేటీఆర్ చేశారు. పోలీసు రాజ్యం గురించి బీఆరఎస్ పాలకులకు, కేటీఆర్‌కు తెలిసినంతగా మరెవరికీ తెలియదు. పోలీస్ రాజ్యానికి తార్కాణంగా నిలిచిన ఉదంతాలు గత పదేళ్ళ పాలనలో లెక్కలేనన్ని

రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందని ఒక హాస్యాస్పదమైన ప్రకటనను కేటీఆర్ చేశారు. పోలీస్ రాజ్యానికి తార్కాణంగా నిలిచిన ఉదంతాలు గత పదేళ్ళ పాలనలో లెక్కలేనన్ని జరిగాయి. అధికారం పోయిన ఏడాదిలోనే అవన్నీ కేటీఆర్ మర్చిపోయారా? లేక ప్రజలకు ఆ మాత్రం జ్ఞాపకశక్తి ఉండదనే చిన్నచూపుతో 'పోలీసు రాజ్యం' అన్న పదం వాడారా?



జరిగాయి. కేటీఆర్ నియోజకవర్గం సిరిసిల్లలో రోజుల తరబడి సాగుతున్న ఇసుక దోపిడీని పండగ రోజైనా ఆపమని అడిగిన నేరెళ్ల దళితులను రాత్రిళ్లు ఇళ్ల నుంచి ఎత్తుకువెళ్లి రోజుల తరబడి థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. మా సమస్యలు చెప్పుకుంటాం ధర్నా చౌక్‌కు వెళ్లనివ్వాలని కోరిన వర్గాలను ఇళ్లలో నుంచి బయటకు రానివ్వకుండా నిర్బంధించారు. ప్రతిపక్ష నేతలు, వివిధ రంగాల ప్రముఖుల ఫోన్లను ట్యాప్ చేసి బ్లాక్ మెయిల్ చేసి రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు పొందారు. ఖమ్మం మార్కెట్‌లో వ్యాపారులు, దళారులు కుమ్మక్కై మిర్చి పంటను తక్కువ ధరకు దోచుకోవడంపై ఆందోళన చేసిన గిరిజన రైతులకు ఉగ్రవాదుల మాదిరి సంకెళ్లు వేసి నడిపించారు. దళిత మహిళ మరియమ్మను లాకప్‌లో చంపారు. ప్రతిపక్ష నేతలు రేవంత్‌రెడ్డి, జగ్గారెడ్డిల ఇళ్లలోకి అర్ధరాత్రులు చొరబడి తలుపులు బద్దలు కొట్టి అరెస్టులు చేశారు. తెలంగాణ ఉద్యమకారుడు ప్రొఫెసర్ కోదండరాం ఇంటి తలుపులను గొడ్డళ్లతో నరికి ఆయనను అరెస్టు చేశారు. నోరెత్తిన నాయకులు, ప్రజా సంఘాల బాధ్యులపై కేసులపై కేసులు మోపి జైళ్లకు పంపారు. ప్రశ్నించిన మీడియాను వంద అడుగుల లోతున పాతరేస్తామని రంకెలు వేశారు. అధికారం పోయిన ఏడాదిలోనే ఇన్ని తప్పులను కేటీఆర్ మర్చిపోయారా? లేక ప్రజలకు ఆ మాత్రం జ్ఞాపకశక్తి ఉండదనే చిన్నచూపుతో 'పోలీసు రాజ్యం' అన్న పదం వాడారా? ఆయనకే తెలియాలి.

మానవ హక్కులు, జాతీయ ఎస్సీ కమిషన్, జాతీయ ఎస్టీ కమిషన్, జాతీయ బీసీ కమిషన్, రాజ్యాంగ విలువలూ అంటూ తనకు బొత్తిగా తెలియని, తానెప్పుడూ విలువ ఇవ్వని అంశాలపై కేటీఆర్ సుదీర్ఘ ప్రసంగాలు చేస్తున్నారు. మల్లన్నసాగర్ నిర్వాసితుడు ఆరె కనకరాజు మృతదేహాన్ని గ్రామానికి తరలించకుండా హైదరాబాద్‌లో గుట్టుచప్పుడు కాకుండా అంత్యక్రియలు జరిపించినప్పుడు కేటీఆర్‌కు మానవ హక్కులు గుర్తుకు రాలేదా? నేరెళ్ల బాధితులను రోజుల తరబడి హింసించినప్పుడు, కేసుల నుంచి తన వారిని తప్పించేందుకు వారిని బ్లాక్‌మెయిల్ చేసినప్పుడు జాతీయ ఎస్సీ కమిషన్ గుర్తుకురాలేదా? పోడు భూములు సాగు చేస్తున్నారంటూ ఖమ్మం జిల్లా ఎల్లన్న నగర్‌లో 18 మంది గిరిజన మహిళలు, అందులో ఏడాది లోపు పిల్లలున్న ముగ్గురు తల్లులను అరెస్టు చేయించి జైళ్ల పాలు చేసినప్పుడు మానవత్వం, మానవ హక్కులు, జాతీయ ఎస్టీ కమిషన్, పోలీసు రాజ్యం... ఇవేమీ కేటీఆర్‌కు గుర్తులేవా?


ఢిల్లీకి మూటలు మోస్తున్నారని పదే పదే కేటీఆర్ విమర్శలు చేయడం పరమ ఎబ్బెట్టుగా ఉంది. తెలంగాణలో దోచుకున్న వందల కోట్ల రూపాయలతో దేశవిదేశాల్లో కేటీఆర్ కుటుంబం వ్యాపారం చేస్తోందనే ఆరోపణలున్నాయి. ఢిల్లీలో మద్యం వ్యాపారంలో దిగి వంద కోట్ల రూపాయలు చేతులు మారడంలో కింగ్‌పిన్ కల్వకుంట్ల కవిత అని సీబీఐ, ఈడీ తమ ఛార్జిషీట్లలో పేర్కొన్న విషయం కేటీఆర్‌కు తెలియదా?


ముఖ్యమంత్రికి ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉండబట్టే కేటీఆర్ కుటుంబం మూసివేసిన ధర్నా చౌక్‌ను తిరిగి తెరిపించారు. ఆ ధర్నా చౌక్‌లో కూర్చొనే కేటీఆర్, ఆయన బావ హరీశ్‌రావు తిట్ల పురాణం వినిపిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పోలీసు రాజ్యంపై నమ్మకం లేనందునే కేటీఆర్ సోషల్ మీడియా కాలకేయ సైన్యం నిత్యం ఆయనపై, ఆయన కుటుంబ సభ్యులపై అసభ్య పదజాలంతో విషం చిమ్మగలుగుతోంది. ముఖ్యమంత్రికి ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉండబట్టే ఇంకా బీఆరఎస్ మాజీ మంత్రులు, కార్యకర్తలు ఇష్టారీతిగా విమర్శలు చేయగలుగుతున్నారు. కానీ ఆయన మంచితనాన్ని చేతగానితనంగా, సహనాన్ని అసమర్థతగా భావిస్తే అంతకన్నా మూర్ఖత్వం మరొకటి ఉండదు.

ప్రతిపక్ష నేతగా ఎన్నికైన కేటీఆర్ తండ్రి కేసీఆర్‌కు ప్రజాస్వామ్యంపై గోరంత విశ్వాసం లేదు. కేటీఆర్, ఆయన కుటుంబ సభ్యులు ప్రజాస్వామ్యం, మానవ హక్కులు, పోలీసు రాజ్యం అనే పదాలు ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిది. కేటీఆర్ కుటుంబ అహంకారాన్ని, నాటి పోలీసు రాజ్యాన్ని చూసినందునే ప్రజలు శాసనసభలో వారిని ఓడించి పదవులు ఊడగొట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో గుండు సున్నాకు పరిమితం చేశారు. కేటీఆర్, ఆయన కుటుంబ సభ్యులు ఇకనైనా ప్రజాస్వామిక స్ఫూర్తిని అలవర్చుకోకుంటే బీఆరఎస్ పార్టీ మనుగడే ప్రమాదంలో పడుతుంది.



■ చామల కిరణ్ కుమార్‌రెడ్డి





కమీషన్ల పేరిట దోపిడీ

మెప్మాలో రిసోర్స్ పర్సన్ల ఇష్టారాజ్యం

- మహిళా సంఘాల నుంచి బలవంతపు వసూళ్లు
- పొందిన రుణాల్లో నుంచి 10 శాతం ముట్టజెప్పాల్సిందే
- ఇవ్వకపోతే ఆ సంఘాలు బ్లాక్ లిస్ట్‌లోకే..
- పేదల డబ్బులు వాటాలుగా పంచుకుంటున్న అధికారులు
- చాలాకాలంగా సాగుతున్న అక్రమ దందా
- పట్టించుకోని బల్దియా ఉన్నతాధికారులు

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 27: వరంగల్ నగరంలో నివసించే మహిళలను లక్షాధికారులుగా చేసేందుకు గత ప్రభుత్వాలు చేపట్టిన మెప్మా అభాసుపాలవుతుంది. కొందరు ఆర్పీలు, అధికారులు అవినీతికి పాల్పడుతూ నిరుపేద మహిళల నుంచి డబ్బులు దండుకుని సంస్థకు మచ్చ తెస్తున్నారు. డబ్బులు ఇవ్వని మహిళా సంఘాలను బ్లాక్ లిస్ట్‌లో పెడుతున్నారు. పట్టణ పేదరిక నిర్మూలనలో వరంగల్ నగరం ముందంజలో ఉందని ఇక్కడి రికార్డులు చెబుతుండగా.. కొందరు ఆర్పీలు ఆర్థిక దోపిడీకి గురిచేస్తూ అదే స్థాయిలో ముందంజలో ఉందనే విమర్శలు వస్తున్నాయి.

పర్సంటేజీల పేరుతో..

బల్దియా కార్యాలయ ఆవరణలో ఉన్న పట్టణ పేదరిక నిర్మూళన సంస్థ (మెప్మా) కార్యాలయానికి అనుసంధానంగా 20 ఏళ్లుగా మహిళా సంఘాలు పని చేస్తున్నాయి. ప్రభుత్వం నుంచి వచ్చే కొద్దిపాటి రుణాలతో పిల్లల చదువులు, లోతట్టు ప్రాంతాల్లో ఇండ్లు నిర్మించుకుని కాలం వెల్లదీస్తూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. అయితే రుణాలు పొందిన మహిళల నుంచి కొందరు ఆర్పీలు (రిసోర్స్ పర్సన్స్) ముక్కుపిండి మరీ అక్రమంగా పర్సంటేజీల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారు. మహిళల పేరుతో డబ్బులు బ్యాంకులలో జమ అయిప్పటికీ.. పొందిన రుణంలో తప్పకుండా 10శాతం డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. లోన్ ఇచ్చిన బ్యాంకు అధికారులు, మెప్మా అధికారులకు ముడుపులు ఇవ్వాలనే సాకుతో కొందరు ఆర్పీలు మహిళా సంఘాల సభ్యులను గద్దల్లా పీక్కుతింటున్నారు.

బ్లాక్ మెయిల్

వరంగల్ ట్రైనిటీస్‌లో ఉన్న కొందరు ఆర్పీలు ఆయా డివిజన్‌ల కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, మంత్రులను తరుచుగా కలుస్తూ రాజకీయ అండదండలు ఉన్నట్టు ఫోజులిస్తూ సామాన్య మహిళలను నమ్మిస్తున్నారు. మహిళలను ఆర్థిక దోపిడీకి గురిచేస్తున్నారు. కొన్ని రోజుల కిందట మట్టెవాడ ప్రాంతంలో ఒకే ఇంట్లో కుటుంబ సభ్యుల పేరుతో లక్షల్లో రుణం పొందిన ఓ మహిళా ఆర్పీని మహిళలు నిలదీశారు. దీంతో సదరు ఆర్పీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బెదిరించి అక్కడి మహిళలను భయభ్రాంతులకు గురిచేసింది. ఏనుమాములలో సంఘానికి సంబంధించిన రూ.5లక్షలు ఓ ఆర్పీ సొంతానికి వాడుకుని ఇంటికి వచ్చిన వారిపై దాడికి దిగింది. ఇంకా వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాలతో పాటు విలీన గ్రామాలలో కొంతమంది ఆర్పీలు బ్యాంకు రుణాలు, శ్రీనిధి, పావలా వడ్డీ రుణాలు ఇప్పిస్తూ చేతివాటం చూపిస్తున్నట్టు తెలిసింది.

కోట్లకు పడగలెత్తి..

మహిళా సంఘాల సభ్యులు నెలవారిగా చెల్లించే పొదుపు డబ్బులను ఎరగా చూపిస్తూ కొందరు ఆర్పీలు బ్యాంకు లింకేజీ రుణాలు, వడ్డీ లేని రుణాలు, శ్రీనిధి రుణాలు తెచ్చి మహిళా సంఘాలకు అందిస్తూ ముందుగా వారిని నమ్మిస్తున్నారు. సభ్యులకు బ్యాంకులో డబ్బులు జమ అయిన తర్వాత సార్లకు లంచం ఇవ్వాలని 10 శాతం కమీషన్ పేరుతో ఫోన్‌లు చేస్తూ ముప్పు తిప్పలు పెడుతున్నారు. రుణాలు పొందిన మహిళల నుంచి తీసుకున్న డబ్బులను ఆర్పీలు, అధికారులు వాటాలుగా పంచుకుంటారనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో ఉన్న కొందరు ఆర్పీలు మహిళా సంఘాలను అడ్డుపెట్టుకుని కోట్లు గడించినట్లు ప్రచారం జరుగుతోంది వరంగల్, హనుమకొండలో సుమారు 300 మంది ఆర్పీలు మహిళా సంఘాల మహిళల డబ్బులు వాడుకుని అక్రమ వడ్డీ వ్యాపారం చేయడంతో పాటు విల్లాస్ కొనుగోలు చేసినట్టు తెలిసింది. ఇంకా కొందరు మహిళల నుంచి సంపాదించిన డబ్బును రియల్ ఎస్టేట్ వ్యాపారం, షేర్ మార్కెట్‌కు వాడుకుంటూ మహిళలను ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు సమాచారం.

కార్యాలయంలోనే ఆగని దోపిడీ..

మహిళా సంఘాల సభ్యులు సీవోలతో కలిసి వివిధ రకాల రుణాల కోసం బల్దియా కార్యాలయ ఆవరణలోని మెప్మా కార్యాలయానికి చేరుకుంటారు. రుణాల ఆన్‌లైన్, ఎంసీపీ (మైక్రో క్రెడిట్ ప్లాన్) కోసం కంప్యూటర్‌లో వివరాలను పొందుపర్చాలి. కానీ అక్కడ పని చేసే కొందరు సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు డబ్బులు ఇవ్వనితే ఫైల్ కదలనివ్వకుండా మొండికేస్తాడని వెల్లడించారు. ఒక్కో ఫైల్‌కు రూ.500 వసూలు చేస్తున్నట్టు మహిళలు ఆరోపించారు. అంతే కాకుండా ఓ కంప్యూటర్ ఆపరేటర్ భార్య ఓ ప్రొడక్ట్ కంపెనీలో సేల్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తుండడంతో తమ వస్తువులు కొన్న మహిళా సంఘాల వారి ఫైళ్లను ముందు ఆమోదిస్తూ ఆన్‌లైన్ చేస్తున్నట్టు వెల్లడించారు. దీంతో చాలామంది మహిళా సంఘాలకు అందవలసిన రుణాలు సకాలంలో బ్యాంకులలో జమ కావడం లేదని మహిళలు మండిపడుతున్నారు. జిల్లా కలెక్టర్, కమిషనర్ మెప్మాలో జరుగుతున్న అవినీతిపై దృష్టిసారించి నిరుపేద మహిళలకు న్యాయం చేయాలని మహిళలు కోరుతున్నారు.

16,015 గ్రూపులు

వరంగల్ నగరంలో ప్రస్తుతం 16,015 మహిళా గ్రూపులు ఉన్నాయి. ఒక్కో గ్రూపులో 18 నుంచి 58 ఏళ్లలోపు 10 మంది మహిళలు సభ్యులుగా ఉంటారు. ప్రస్తుతం 1,67,528 మంది మహిళలు వివిధ పేర్లతో కూడిన మహిళా సంఘాలలో పని చేస్తున్నారు. 15 నుంచి 20 మహిళా సంఘాలను మానిటరింగ్ చేసేందుకు మెప్మా నుంచి ఒక ఆర్పీ (రిసోర్స్ పర్సన్)ను నియమించారు. 20 సంఘాలను ఒక్కటిగా చేసి సమాఖ్యగా గుర్తిస్తారు. సమాఖ్య నుంచి చదువుకున్న ఐదుగురు సభ్యులను ఓబీ (ఆఫీస్ బేరర్స్)గా నియమిస్తారు. ఈ విధంగా నగరంలో 530 మంది ఆర్పీలు మహిళా గ్రూపుల మీద పని చేస్తున్నారు. ఆర్పీలను అనుసంధానం చేసుకుని నడిపించేందుకు 17 మంది సీవో (కమ్యూనిటీ ఆర్గనైజర్లు) పనిచేస్తారు. అయితే ఇటీవల ఆరుగురు సీవోలు అవినీతికి పాల్పడినట్టు రుజువు కావడంతో వారిని విధుల నుంచి తొలగించారు. ప్రస్తుతం 11 మంది మాత్రమే సీవోలుగా పని చేస్తున్నారు.

సర్వే సమాచారం పక్కాగా నమోదు చేయాలి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- సర్వే డేటా ఎంట్రీ నమోదు కేంద్రం పరిశీలన



సర్వే డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నగరంలో సేకరించిన సమగ్ర సర్వే సమాచారం పక్కాగా కంప్యూటర్లలో నమోదు చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మెప్మా సమావేశ మందిరంలో సమగ్ర సర్వే డేటా ఎంట్రీ నమోదు చేస్తున్న తీరును కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సమగ్రవంతంగా పని చేయాలని అక్కడి సిబ్బందికి కమిషనర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సమాచారం నమోదు చేసు సమయంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తపడాలన్నారు. డాటా ఎంట్రీ తీరును అదనపు కమిషనర్, పన్నుల అధికారి, సూపర్‌వైజర్లు నిత్యం పర్యవేక్షించాలన్నారు. ఒక్కో దరఖాస్తు డేటా నమోదు చేయడానికి 10 నిమిషాల సమయం పడుతుందని, నెట్‌వర్క్ సమస్యల రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తొలి రెండు రోజులు డేటా ఎంట్రీలో సమస్యలు రాకుండా చూడాలన్నారు. బల్దియా కార్యాలయంతో పాటు నగరంలో పలు ప్రైవేటు కళాశాలలో కూడా సర్వే దరఖాస్తుల ఎంట్రీ జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, పన్నుల విభాగం అధికారి బిర్రు శ్రీనివాస్, ఆర్వో షహజాది బేగం, టీఎంసీ రమేష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

PUBLIC NOTICE

This is to inform and to bring your kind attention to all the public and to whom soever it may concern and to authenticate that my client Buthapati Albert Juliet w/o vinay kumar R/o h no.1-3-154 kazipet warangal, actual name is Buthapati Albert Juliet but unfortunately her name was wrongly spelled and recorded in her Aadhar card and my client daughter passport as Buthapati. Juliet and Bhuthapati. Juliet, but my client actual name is Buthapati Albert Juliet. Hence my client authorize and request through this public notice that all times hereafter to designate and address her as Buthapati Albert Juliet instead of Buthapati Juliet and Bhuthapati Juliet. Hence this public Notice

Sd/- KIRAN KUMAR JANGILI ADVOCATE, LL.M
Office : H.No : 11-23-57, Tilak Road.
L.B. Nagar, Warangal
E-mail: kiran_6108@yahoo.co.in

మాదకద్రవ్యాల నిరోధానికి కృషి

- వరంగల్ కలెక్టర్ సత్యశారద
- అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిరోధానికి కృషి చేస్తూ యువత, విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలకు యువత బానిసకాకుండా అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా కళాశాలలు, పాఠశాల విద్యార్థులు, యువత మత్తుకు బానిసలవుతున్నారని, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. డీసీపీ రవీందర్ మాట్లాడుతూ.. జిల్లాలో మాదకద్రవ్యాల నిరోధానికి పోలీసుశాఖ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెప్పారు. గంజాయి సాగు, వినియోగం, రవాణాకు సంబంధించి క్షేత్రస్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, సంక్షేమ అధికారి రాజమణి, డీఎస్పీ సైదులు, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ అరవింద్ కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, ఎఫ్ఆర్‌వో సందీప్, డీఈవో జ్ఞానేశ్వర్, అసిస్టెంట్ ఎక్సైజ్ అధికారి మురళీధరన్ పాల్గొన్నారు.

వసతి గృహాల్లో శుభ్రత పాటించాలి..

సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో శుభ్రత పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. ఈ విషయమై బుధవారం కలెక్టరేట్‌లో 46 మంది జిల్లాస్థాయి అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ విద్యాసంస్థలు, పాఠశాలల్లో పొరపాట్లు జరిగితే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు తరచుగా వసతి గృహాలను, ప్రభుత్వ విద్యాసంస్థలను సందర్శించాలని సూచించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ, బీసీ సంక్షేమ అధికారి పుష్పలత, పశుసంవర్ధక శాఖ అధికారి బాలకృష్ణ, వ్యవసాయశాఖ అధికారి అనురాధ, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విజయోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవాలను ఈ నెల 28, డిసెంబరు 2వ తేదీల్లో ఘనంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సత్యశారద తెలిపారు. వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలోని ఎన్ఆర్ఐ మిలీనియం హాలులో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు అంతడుపుల నాగరాజు బృందం కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబరు 2వ తేదీన జయ జయహే ప్రజాపాలన పేరుతో ఆలేఖ్య కళా బృందంచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు, సాధించిన విజయాలను వివిధ కళారూపాల్లో ప్రదర్శిస్తారని వివరించారు. నగర ప్రజలు అధిక సంఖ్యలో కార్యక్రమానికి హాజరు కావాలని కలెక్టర్ కోరారు.



తెలంగాణ యోధుల వేషధారణల్లో కళాకారులు



మాట్లాడుతున్న ఆర్డీవో రమేష్ రాథోడ్

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- హనుమకొండ ఆర్డీవో రమేష్ రాథోడ్
- వైభవంగా ప్రజాపాలన విజయోత్సవాలు
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

హనుమకొండ కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ప్రతీ కుటుంబం అభివృద్ధి చెందాలని హనుమకొండ రెవెన్యూ డివిజనల్ అధికారి రమేష్ రాథోడ్ అన్నారు. బుధవారం రాత్రి హనుమకొండ పబ్లిక్‌గార్డెన్స్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ వేడుకలను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. తెలంగాణ ప్రజల సంక్షేమం కోసంప్రభుత్వం ఆరు గ్యారంటీలను తీసుకొచ్చిందన్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణం, రూ.500లకు వంటగ్యాస్ పథకం, 200 యూనిట్లలోపు ఉచిత కరెంటు అందజేస్తుందన్నారు. డీపీఆర్‌వో గంగవరపు వెంకటభానుప్రసాద్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కళాకారులు మరింత కృషిచేయాలన్నారు. కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రముఖ కళాకారుడు అంతడుపుల నాగరాజు బృందం సాంస్కృతిక సారథి కళాకారులతో కలసి పాడిన పాటలు, నృత్యాలు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ పక్షాన చక్రాల రఘు బృందం ప్రదర్శించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వైజ్ఞానిక ప్రదర్శనకు విశేష స్పందన

ఆకట్టుకున్న 148 ప్రాజెక్టులు, 352 ఎగ్జిబిట్స్

నర్సంపేట టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా స్థాయి ఇన్‌స్పైర్, విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన నర్సంపేట మండలం మహేశ్వరం శివారులోని శివాని పబ్లిక్ స్కూల్‌లో బుధవారం రెండో రోజు విజయవంతంగా కొనసాగింది. కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ, ఎన్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్ పోటీల్లో 148 ప్రాజెక్టులు, సుస్థిర భవిష్యత్తు కోసం శాస్త్ర సాంకేతిక ప్రధాన అంశంగా ఆహారం, ఆరోగ్యం, రవాణా, సమాచార ప్రసారం, సహజ వ్యవసాయం, విపత్తు నిర్వహణ, గణితము, గణన ఆలోచన, వ్యర్థాలు, వనరుల నిర్వహణ అంశాలపై విద్యార్థులు 352 ఎగ్జిబిట్స్‌లు ప్రదర్శించారని డీఈవో మామిడి జ్ఞానేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి కట్ల శ్రీనివాస్‌లు తెలిపారు. వీటిలో 6 నుంచి 8వ తరగతి విద్యార్థులు జూనియర్ విభాగంలో, 9 నుంచి 12వ తరగతి విద్యార్థులు సీనియర్ విభాగంలో తమ ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారన్నారు. సైన్స్ ఫెయిర్‌కు జిల్లాలోని వివిధ మండలాల్లోని 92 పాఠశాలల నుంచి 3 వేల మందికి పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఎంఈవో కొర్ర సారయ్య, సైన్స్ ఫెయిర్ నిర్వహణ కమిటీ సభ్యులు పట్టాభి, శివాని పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ వేములపల్లి సుబ్బారావు, రాహుల్, సుధాకర్‌రావు, బాలాజీరావు పాల్గొన్నారు.



ఎగ్జిబిట్స్‌ను సందర్శిస్తున్న వివిధ పాఠశాలల విద్యార్థులు



ఎంపికైన క్రీడాకారులతో డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకయ్య తదితరులు

కేయూ సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ జూడో పురుషుల జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): నవంబరు 28 నుంచి 30 వరకు భోపాల్‌లోని ఎల్ఎన్‌సీటీ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ జూడో పురుషుల జట్టును 2024-25 ఏడాదికి గాను బుధవారం ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారులలో ఎ.ఎల్. లక్ష్మణ్, (కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ), బి.జయదీప్, (సీకేఎం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, వరంగల్), ఎం.ముఖేశ్, పి.నాగేంద్ర, (యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, సుబేదారి), ఎం.దర్శిత్‌నాయక్(ఎల్‌బీ కళాశాల, వరంగల్), బి.రాహుల్, (కేయూ స్కూల్ ఆఫ్ లర్నింగ్, కేయూ), జే.మహేశ్(వాగ్దేవి డిగ్రీ కళాశాల, కిషన్‌పుర)లున్నట్లు పేర్కొన్నారు. ఈ జట్టుకు కోచ్, మేనేజర్‌గా వాగ్దేవి డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బి.రాము వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు అభినందించారు.

మల్లికాంబ మనోవికాస కేంద్రానికి
స్కూల్ బస్సుల బహూకరణ

బాలసముద్రం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అమెరికన్ మ్యూజిక్‌స్కూల్ డైరెక్టర్ పందిరి వీణాదేవి హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రానికి రూ. 60లక్షల విలువల రెండు స్కూల్ బస్సులతో పాటు భారీ వాషింగ్ మిషన్‌ను బహూకరించారు. బుధవారం వీణాదేవి మల్లికాంబ మనోవికాస కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2012లో వర్జీనియాలో 'నోట్స్‌న్ బీట్స్' పేరుతో మ్యూజిక్ స్కూల్ స్థాపించామన్నారు. రోజు రోజుకూ స్కూల్‌కు ఆదరణ పెరగడంతో 500మంది విద్యార్థులకు భారతదేశ క్లాసికల్, లైట్ మ్యూజిక్‌లో శిక్షణ ఇస్తున్నామన్నారు. 2019లో థస్టేజ్ అనే నాన్ ప్రాఫిట్ సంస్థను స్థాపించి స్కూల్‌కు వచ్చే తల్లిదండ్రులు సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మ్యూజిక్ ప్రోగ్రామ్స్‌తో వచ్చిన నిధులతో అమెరికన్ ఓల్డ్ ఏజ్ హోమ్స్, వెటరన్, ఆటిజం పిల్లలకు ఆరోగ్య, ఆర్థిక సహాయం చేస్తామన్నారు. ఇండియాలో సైతం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలనే సంకల్పంతో మల్లికాంబ మనోవికాస కేంద్రాన్ని దత్తత తీసుకున్నామన్నారు. ఇండియా పర్యటనలో భాగంగా మల్లికాంబ మనోవికాస కేంద్రంలోని పిల్లలను కలవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మలికాంబ మనోవికాస కేంద్రం నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రభుత్వాలు ప్రజల విశ్వాసాన్ని కాపాడుకోవాలి

- ఎన్నికల హామీల అమలు చేయాలి
- దేశానికి సుస్థిర ప్రభుత్వాల పాలన శ్రేయస్కరం
- హైదరాబాద్ ప్రముఖ రాజనీతివేత్త ప్రొఫెసర్ శ్రీనివాసులు
- కేయూ రాజనీతిశాస్త్ర విభాగంలో సింపోజియం



కేయూలో మాట్లాడుతున్న రాజనీతివేత్త ప్రొఫెసర్ శ్రీనివాసులు

కేయూ క్యాంపస్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రజల విశ్వాసాన్ని కాపాడుకుంటూ ప్రభుత్వం హామీలను అమలు చేయాలని ప్రముఖ రాజనీతి శాస్త్రవేత్త, ఓయూ సోషల్‌సైన్స్ విభాగాల డీన్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసులు ఉద్బోధించారు. బుధవారం కేయూ రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ అధ్యక్షతన 'తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షలు, వాగ్దానాలు, రాజకీయ పనితీరు' అనే అంశంపై జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కేయూ సెనెట్ హాల్‌లో జరిగిన సదస్సుకు శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చితేనే ప్రభుత్వాలకు మనుగడ ఉంటుందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అమలు చేస్తేనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. దేశంలో, రాష్ట్రంలో సుస్థిర పాలన అవసరమని చెప్పారు. ప్రజలను జీవితాంతం ఆర్థికంగా , ఆత్మగౌరవంతో ఉండేలా పథకాలు ఉండాలని అన్నారు. మతం, కులం ఓట్లు, సీట్లు రాజకీయ అధికార ప్రయోజనాలే ధ్యేయంగా ప్రభుత్వాలు పథకాలు రూపొందించితే సమాజాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టినట్లే అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తెలంగాణ ప్రజల ప్రజాస్వామిక, ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చలేదన్నారు. ప్రలోభపూరిత వాగ్దానాలు, మాటలతోనే పాలన సాగిందన్నారు. అందుకే ప్రజలు బీఆర్ఎస్‌ను ఎన్నికల్లో ఓడించారని అభిప్రాయపడ్డారు. 2014-2023లో తెలంగాణలో విద్యారంగం తీవ్రంగా సంక్షోభంలో పడిందన్నారు. గతంలో వర్సిటీల అభివృద్ధికి పరిశోధనలకు నిధులు ఇవ్వలేదన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయలేదన్నారు. వర్సిటీ మనుగడ ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారిందన్నారు.

ఓయూ రిటైర్డు ప్రొఫెసర్, ప్రముఖ చరిత్ర విశ్లేషకుడు అడపా సత్యనారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ చారిత్రాత్మక, సామాజిక, ప్రజాస్వామిక, సాంస్కృతిక ఉద్యమాల పురిటిగడ్డ అని అన్నారు. ఇక్కడి ప్రజలు ధిక్కారస్వరానికి, చైతన్యానికి ప్రతీకలని అభివర్ణించారు. విద్యార్థులు సామాజిక, ఆర్థిక, రాజకీయరంగాల్లో వస్తున్న మార్పులను శాస్త్రీయ దృక్పథంతో అవగాహన చేసుకోవాలని చెప్పారు. యువత ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని పేర్కొన్నారు. కుల, మతాల ఆధారంగా రాజకీయ పార్టీలు అధికారం చేపట్టడం దురదృష్టకరమని చెప్పారు. సదస్సుకు అధ్యక్షత వహించిన డాక్టర్ సంకినేని వెంకట్ మాట్లాడుతూ.. ప్రజా ఉద్యమాలు, ప్రజల భవిష్యత్‌ను ఎప్పటికప్పుడు రాజకీయాలు ప్రభావితం చేస్తాయని అన్నారు. రాజనీతిశాస్త్ర విభాగం ప్రజలకు రాజకీయ దిక్సూచిగా నిలుస్తోందని వివరించారు.

ఈ సదస్సులో కేయూ సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, యూజీసీ కేయూ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, ఎస్డీఎల్ సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, డాక్టర్ ఎ.హరిప్రసాద్ మాట్లాడారు. కేయూ రాజనీతిశాస్త్ర విభాగం అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. సదస్సులో 'జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం' అనే పాట వినిపించిన సందర్భంలో సభికులందరూ నిల్చొని గళం కలిపారు. సదస్సులో బీవోఎస్ చైర్మన్ డాక్టర్ గడ్డం కృష్ణయ్య, డాక్టర్ వి.సత్యనారాయణ, డాక్టర్ వి.నాగరాజు, డాక్టర్ లలిత కుమారి, డాక్టర్ విజయ్, డాక్టర్ లక్ష్మీనారాయణ,డాక్టర్ టి.సంజీవ్, స్కాలర్స్ బి.నరసింహరావు, గుండెటి సుమన్, మహ్మద్ పాషా, మోహన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు అంజలీదేవి

కేయూక్యాంపస్, నవంబరు 27,(ఆంధ్రజ్యోతి): కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల స్టూడెంట్ తోట అంజలీదేవి మహారాష్ట్రలో జరిగిన వెస్ట్‌జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ పరేడ్ క్యాంపుకు ఎంపికై శిక్షణను దిగ్విజయంగా పూర్తిచేశారు. ఈ సందర్భంగా బుధవారం కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. బిక్షాలు, ఎం.వేణుగోపాల్‌రెడ్డిల చేతుల మీదుగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంజలిదేవికి ఎన్ఎస్ఎస్ ప్రీరిపబ్లిక్ పరేడ్ సర్టిఫికెట్‌ను అందచేసి అభినందించారు. నవంబరు 12 నుంచి 21 వరకు యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, ఎన్ఎస్ఎస్ పూణే ప్రాంతీయ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో మహారాష్ట్రలో వెస్ట్‌జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌క్యాంపు-2024 నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు టి. స్వప్న, తూర్పాటి వెంకటేశ్, అధ్యాపకులు వైష్ణవి, సాయి తరుణ్, సురేందర్‌నాయక్, వీరునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాదావత్ రాజు అరెస్టు అక్రమం

హనుమకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బదావత్ రాజును పోలీసులు అదుపులోకి తీసుకోవడం అక్రమమని మానవ హక్కుల వేదిక ఒక ప్రకటనలో ఖండించింది. రాజును ఈనెల 25వ తేదీ అర్ధరాత్రి కేయూసీ పోలీసుస్టేషన్‌కు పిలిపించి నిర్బంధించడంపై మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అత్రం భుజంగరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతయ్య, ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు ఎస్.జీవన్‌కుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. బంజారా హక్కుల పోరాట సమితి నిరసన కార్యక్రమం ప్రకటిస్తే రాజు అదే సామాజికవర్గానికి చెందినవాడు అయినందున ఆయనను ముందస్తుగా అదుపులోకి తీసుకోవడం అన్యాయమని అభిప్రాయపడ్డారు.

వరంగల్ మార్కెట్ ధరలు
(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2460	2080
పల్లికాయ (సూక)	4000	4000
పల్లికాయ (పచ్చిది)	-	-
కందులు	6912	8000
పెసళ్లు	5382	5250
పత్తి	6840	5800
కొత్తపతి	-	-
పసుపు (కాడి)	-	-
తేజ మిర్చి కొత్తది	14000	12000
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	16000	14000
వండర్‌హాట్ ఏసీ	12800	11000
యూఎస్341ఏసీ	13500	11000
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం

పారా తైక్వాండోలో మెరిసిన ఓరుగల్లు కుర్రోడు

పూమ్‌సే చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన గౌతమ్‌యాదవ్

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 27:(ఆంధ్రజ్యోతి): ఈ నెల 24నుంచి 27వరకు బహ్రెయిన్ దేశంలో నిర్వహించిన అంతర్జాతీయస్థాయి పారా తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో వరంగల్ జిల్లా పైడిపల్లికి చెందిన ఎల్లావుల గౌతమ్‌యాదవ్ పాల్గొని స్వర్ణ పతకం సాధించాడు. ఈ నెల 9, 10వ తేదీల్లో పంజాబ్ రాష్ట్రంలోని లవ్లీ యూనివర్సిటీలో నిర్వహించిన 3వ జాతీయస్థాయి పారా తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని సత్తాచాటడంతో అంతర్జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. పూమ్‌సే 51 కిలోల విభాగంలో గౌతమ్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి స్వర్ణ పతకం సాధించి జిల్లా కీర్తి ప్రతిష్ఠలను విశ్వవ్యాప్తం చేశాడు. స్వతహాగా తైక్వాండో శిక్షకుడిగా గౌతమ్ ఎంతోమంది క్రీడాకారులకు తైక్వాండో క్రీడలో శిక్షణ అందించారు. 2020లో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గౌతమ్ మృత్యువు ఒడి నుంచి బయట పడినప్పటికి కొన్ని నెలల పాటు వీల్ చైర్‌కే అంకితమయ్యాడు. మొక్కవోని దీక్ష, ఆత్మవిశ్వాసంతో తనకు ఇష్టమైన క్రీడను ఒదులుకోకుండా పారా తైక్వాండో పోటీల్లో రాష్ట్ర, జాతీయ, అంతార్జాతీయ వేదికలపై పాల్గొని పలు పతకాలు సాధిస్తున్నాడు. నడవలేని స్థితిలో ఉన్నప్పటికీ తైక్వాండో క్రీడ పట్ల ఉన్న ఆసక్తితో అంతర్జాతీయ స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని స్వర్ణ పతకం సాధించాడు. ఈ మేరకు గౌతమ్‌ను ఇండియా పారా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు నామ్‌దేవ్, ఉపాధ్యక్షుడు వీన్‌కుమారి, తెలంగాణ పారా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రవి, ప్రధాన కార్యదర్శి ఎల్లావుల గణేష్‌యాదవ్, జిల్లా అసోసియేషన్ బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



అంతర్జాతీయ స్థాయి పారా తైక్వాండో పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన గౌతమ్

బాక్సింగ్ పోటీలకు జడ్పీఎస్ఎస్ విద్యార్థి

హసన్‌పర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ లాలాగూడలో ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలలో హసన్‌పర్తి జడ్పీఎస్ఎస్ విద్యార్థి చెంగెల్లి లక్ష్మణాచారి అత్యంత ప్రతిభకనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుమాదేవి తెలిపారు. బుధవారం పాఠశాల ఆవరణలో జరిగిన సమావేశంలో క్రీడాకారుడు లక్ష్మణాచారిని సన్మానించి అభినందించారు. డిసెంబర్ 9 నుంచి 14 వరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి అండర్-17 బాక్సింగ్ పోటీలలో పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.



విద్యార్థిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ సుమాదేవి

పత్తి రైతులు ఆందోళన చెందొద్దు

వరంగల్ వ్యవసాయం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మొత్తం పత్తిని సీసీఐ కొనుగోలు చేస్తుందని వరంగల్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ అర్జున్ దవే ప్రకటించారు. పత్తి కొనుగోళ్ల కోసం వరంగల్ బ్రాంచ్ పరిధిలో 16 జిల్లాల్లో 54 సీసీఐ కేంద్రాలను ప్రారంభించామని, సమీప కేంద్రాన్ని తెలుసుకోవడానికి, వివరాలు, మద్దతు ధరలు, ఫిర్యాదుల పరిష్కారం కోసం రైతులు 'కాట్-అలై' మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. లేదా సీసీఐ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చన్నారు. ఇంకా రైతులకు ఏమైనా ఇబ్బందులుంటే వరంగల్ లక్ష్మీపురంలోని చిట్టిమల్ల కాంప్లెక్స్‌లో ఉన్న తమ శాఖ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, లేదంటే 7718955728కు వాట్సాప్ చేయవచ్చని సూచించారు.

కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఆశలపై నీళ్లు

లీగల్‌గా ముందుకు వెళతామంటూ నాన్చివేత ● ఈసీ స్టాండింగ్ కమిటీ, ఫైనాన్స్ కమిటీలకు ఆమోదం
సైన్స్ ల్యాబ్‌ల నిర్మాణం, మెటీరియల్ కొనుగోలుకు ఓకే.. ● కేయూ పాలకమండలి సమావేశంలో కీలక నిర్ణయాలు

కేయూ క్యాంపస్, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో 2010 అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలపై సాగుతున్న వివాదాల రచ్చ మళ్లీ మొదటికి వచ్చింది. 2010 అసిస్టెంట్ ప్రొఫెసర్ రిక్రూట్‌మెంట్‌పై కోర్టుల అనుకూల, వ్యతిరేక తీర్పుల నేపథ్యంలో లీగల్‌గా ముందుకు వెళదామంటూ కేయూ అత్యున్నత పాలకమండలి సాగదీత, నాన్చివేత ధోరణికి తెరతీసినట్లు సమాచారం. దీంతో 2010 అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఆశలపై మళ్లీ నీళ్లు చల్లినట్లయింది. బుధవారం కేయూ పాలక మండలి సమావేశం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగింది. కేయూ వీసీ, ఈసీ చైర్మన్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షత సమావేశం జరిగింది. రాష్ట్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారి చంద్రకళ, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, డాక్టర్ బొద్దిరెడ్డి రమారెడ్డి, డాక్టర్ బి.సుకుమారి, డాక్టర్ కరుకాల అనితారెడ్డి, డాక్టర్ చిర్ర రాజు, ఎం.బాలు చౌహన్, పుల్లూరు సుధాకర్, కేయూ రిజిస్ట్రార్, ఈసీ సెక్రటరీ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిలు హాజరయ్యారు.

అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు.. పాలక మండలిలో వర్సిటీలో నూతనంగా వర్సిటీ పరిధిలో సైన్స్‌ల్యాబ్‌ల నిర్మాణంతో పాటు కెమికల్స్, ఇతర సదుపాయాల కోసం బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతూ అనుమతి ఇచ్చారు. అలాగే పాలకమండలి నూతన స్టాండింగ్ కమిటీ, ఫైనాన్స్ కమిటీల ఏర్పాటుకు ఆమోద ముద్ర వేశారు. వర్సిటీలో అర్థాంతరంగా ఆగిన బిల్డింగ్ నిర్మాణాలపై వచ్చే పాలక మండలి సమావేశంలో కూలంకశంగా చర్చించాలని నిర్ణయించారు. అయితే వాటికి సంబంధించిన బడ్జెట్ అంచనాల రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచిస్తూ నిర్ణయించారు. వర్సిటీ పరిధిలో నూతనంగా గెస్ట్ ఫ్యాకల్టీని నియామించుకునేందుకు అనుమతించారు. ఇటీవల వర్సిటీలో డిమోషన్‌కు గురైన అసిస్టెంట్ ప్రొఫెసర్ విషయంలో న్యాయపరమైన సలహాతు వర్సిటీ స్థాయిలోనే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. మరో ఇద్దరు ప్రొఫెసర్ల పదోన్నతి విషయంలో అప్పటికప్పుడు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సమాచారం. వర్సిటీ భూకబ్జాల దందా, సీఆర్‌పీఎఫ్ ఆధీనంలో ఉన్న వర్సిటీ భూమి, వర్సిటీ చుట్టూ ప్రహరీ నిర్మాణంతో పాటు ఇటీవల సస్పెండైన ఏఆర్‌తో పాటు మరో నలుగురు ఉద్యోగులపై కమిటీలో చర్చ వచ్చినట్లు తెలిసింది. అయితే ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండానే తాత్కాలికంగా వాటన్నింటినీ పక్కన పెట్టి తర్వాత చర్చించి నిర్ణయం తీసుకుందామంటూ ఆయా అంశాలను వాయిదా వేసినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, వర్సిటీలో కొందరు ఉద్యోగులు ఇటీవల కోర్టుల్లో వర్సిటీకి వ్యతిరేకంగా కేసులు వేయడం వాటిపై వర్సిటీ అధికారులు నిర్దిష్టమైన కౌంటర్ దాఖలు చేయడం లేదనే విషయాన్ని పాలకమండలి సభ్యులుగా తాము గుర్తించినట్లు వర్సిటీ అధికారుల దృష్టికి తెచ్చారు. వర్సిటీ లీగల్ సెల్ విభాగాన్ని సమర్థవంతంగా రూపొందించాలని సూచించారు.

విజయోత్సవ ఉపాధి పనుల జాతర

- ప్రారంభించిన ప్రజాప్రతినిధులు
- ఐదు నెలల పాటు కొనసాగింపు
- రూ.18కోట్లతో 1,442 పనులు
- మొత్తం రూ30కోట్ల ఉపాధి
- ఇప్పటికే రూ.11కోట్ల పనులు పూర్తి

హనుమకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తికావస్తున్న సందర్భంగా జిల్లాలో ఉపాధి పనుల జాతర మొదలైంది. మంగళవారం అన్ని మండలాల్లో ఉపాధి పనులకు ఎమ్మెల్యేలు, అధికారులు శ్రీకారం చుట్టారు. శంకుస్థాపనలు చేసి ప్రారంభించారు. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో సూదన్‌పల్లి, మడిపెల్లి, ఐనవోలు, కక్కిరాలపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఉపాధి పనులకు భూమి పూజ చేశారు. పరకాల నియోజకవర్గ పరిధిలో దామెర, నడికూడ, ఆత్మకూరు తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి శంకుస్థాపనలు చేశారు. కాగా, ధర్మసాగర్, ఎల్కతుర్తిలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ మేన శ్రీను, వేలేరు, భీమదేవరపల్లిల్లో అడిషనల్ డీఆర్‌డీఏ రవి ప్రారంభించారు.

రూ.18కోట్లతో..

12 మండలాల్లో రూ.18కోట్ల అంచనా వ్యయంతో మొత్తం 1,420 పనులను చేపట్టారు. వీటిలో ఎంసీసీ పనులు 1,372 కాగా, డీసీసీ పనులు 48. ఎంసీసీ, డీసీసీ కలుపుకొని మొత్తం పనులు ఆత్మకూరు మండలంలో 117, భీమదేవరపల్లి మండలంలో 123, దామెరలో 115, ధర్మసాగర్ 120, ఎల్కతుర్తిలో 120, హసన్‌పర్తిలో 116, ఐనవోలులో 118, కమలాపూర్‌లో 124, నడికూడలో 116, పరకాలలో 111, శాయంపేటలో 125, వేలేరులో 115 పనులను అమలు చేస్తారు.

రూ.30కోట్ల మెటీరియల్

2025-25 సంవత్సరానికి జిల్లాలలో ఉపాధి హామీ పథకం కింద 21 లక్షల పని దినాలను చేశారు. ఇందుకుగాను జిల్లాకు రూ.30కోట్ల మెటీరియల్ వచ్చింది. ఇందులో రూ.12కోట్ల పనులను ఇది వరకే చేపట్టారు. మిగిలిన రూ.18కోట్ల మెటీరియల్‌లో రూ.19.60 కోట్లకు సంబంధించిన పనులు పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖకు కేటాయించగా మిగిలిన 8.40కోట్ల పనులు డీఆర్‌డీఏ పరిధిలో ఉంటాయి. ఇప్పటివరకు పూర్తి చేసిన పనులకు సంబంధించి రూ.4కోట్ల బిల్లుల చెల్లింపు జరిగింది. ఇంకా రూ.7కోట్లను చెల్లించాల్సి ఉంది.

పనుల జాతర

పనుల జాతర పేరిట ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ రహదారుల, భవనాల నిర్మాణ పనులు చేపడతారు. ప్రతీ మండలంలో స్థానిక ఎమ్మెల్యే భాగస్వామ్యంతో 2025 మార్చిలోపు పనులు పూర్తి చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. గ్రామసభలో పనులను ఎంపిక చేశారు. వీటిలో మహిళాశక్తి ఉపాధి భరోసా కింద కోళ్ల ఫారాలు, పశువుల షెడ్లు, అజోల్లా పెంపకం, వర్మీ కంపోస్టు తయారీ పనులు చేపడతారు. వ్యవసాయ పొలాలకు రహదారుల సౌకర్యాలు కల్పిస్తారు. వన మహోత్సవం కార్యక్రమం కింద నర్సరీల ఏర్పాటుతో పాటు బిందు సేద్యం సదుపాయాలు కల్పిస్తారు. జలనిధి కింద చెక్ డ్యామ్‌లు, ఇంకుడు గుంతలు, వ్యవసాయ బావులు, వర్షం నీటిని ఒడిసి పట్టే ఇతర నిర్మాణ పనులు చేస్తారు. గ్రామీణ మౌలిక వసతుల కల్పనలో భాగంగా పంచాయతీ భవనాలు, పాఠశాలల్లో మరుగుదొడ్లు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం చేపడతారు. గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు కనీసం వంద రోజుల పని దినాల ఉపాధి కల్పించడంతో పాటు ప్రజలకు ఉపయోగపడనున్న పనులను చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఆ దిశగా ఎమ్మెల్యేలతో పనులు ప్రారంభించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. గత ప్రభుత్వంలో ఉపాధి పనుల పర్యవేక్షణ అధికారులు మాత్రమే చూసేవారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి పనులు పూర్తయ్యేలా చూసేబాధ్యతను ప్రభుత్వం ఎమ్మెల్యేపైనే మోపింది.



దామెరలో ఉపాధి పనులకు శంకుస్థాపన చేస్తున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



సూదన్‌పల్లిలో ఉపాధి పనులకు శంకుస్థాపన చేస్తున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

సామిల్ కార్మికుల వేతనాలు పెంచాలి



బీఆర్ఎస్‌కేవీ నుంచి ఏఐసీటీయూలో చేరుతున్న కార్మికులు

శంభునిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సామిల్, టింబర్ డిపోల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు పెంచాలని ఏఐసీటీయూ వరంగల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కందిక చెన్నకేశవులు, గన్నారపు రమేష్ డిమాండ్ చేశారు. రంగశాయిపేట, రామగోపాలపురం పరిధిలోని సామిల్స్, టింబర్ డిపో వర్కర్స్, కట్టర్స్, హెల్పర్స్, హమాలీలు బుధ వారం బీఆర్ఎస్‌కేవీ నుంచి ఏఐటీయూసీలో చేరారు. ఈ సందర్భంగా రంగశాయిపేట జంక్షన్‌లో జరిగిన సమావేశంలో అధ్యక్ష కార్యదర్శులతో పాటు ఏఐసీటీయూ వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు లక్ష్మణ్, సహాయ కార్యదర్శి తాళ్ళపల్లి జాన్‌పాల్ వారికి కండువా కప్పి ఏఐసీటీయూలోకి ఆహ్వానించారు. కార్మికులకు కనీస వేతనం రూ.25వేల నుంచి 28వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అసంఘటిత కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీటీయూ నాయకులు ఎమ్డీ ఇస్మాయిల్, దోమ మల్లేశం, హైమద్, రాజలింగం, సారంగం, సమ్మయ్య, ఖాదర్, ఖరీమ్, హఫీజ్, సలీం హుస్సేన్, శ్రీను, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

రెడ్డికాలనీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 70 ఏళ్ల చరిత్ర కలిగిన పెద్దమ్మగడ్డ సమాధుల భూమిని అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల అండదండలతో రియల్టర్లు కబ్జా చేయడం సిగ్గుచేటని 4వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కంజర్ల మనోజ్ కుమార్ విమర్శించారు. కబ్జాదారులు, పోలీసుల సహకారంతో సమాధులను పట్టపగలే బుల్డోజర్‌తో కూల్చివేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే, సీపీ, ఇతర అధికారులు పెద్దమ్మగడ్డ దళితుల శ్మశాన వాటికను కాపాడాలని కంజర్ల మనోజ్ కుమార్ ప్రకటనలో డిమాండ్ చేశారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



మాట్లాడుతున్న డాక్టర్ బత్తిని చంద్రమౌళిగౌడ్

వడ్డెపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తిని చంద్రమౌళిగౌడ్ తెలిపారు. ఈ మేళాలో మొత్తం 14 కంపెనీలు పాల్గొన్నాయని అన్నారు. రిజిస్టర్ చేసుకున్న 845లో 655 మంది హాజరు కాగా అందులో 115 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హసన్‌పర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంటూర్ పల్లిలో గురువారం ఉదయం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎన్‌పీడీసీఎల్ ఏడీ అశోక్ తెలిపారు. నేషనల్ హైవే పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మహాసభలను విజయవంతం చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్య



సంఘీభావం తెలుపుతున్న సీపీఎం జిల్లా, నగర నాయకులు

ఖిలావరంగల్, నవంబర్ 27(ఆంధ్రజ్యోతి): ప్రజాపోరాటాల ద్వారానే సమసమాజాన్ని సాధిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్య అన్నారు. బుధవారం ఏసీరెడ్డినగర్‌లోని రఘునాథ్‌భవన్‌లో నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ప్రైవేటుపరం చేస్తోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. అనంతరం ఖిలావరంగల్ మండల నూతన కార్యదర్శిగా నలిగంటిరత్న మాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా 24 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ నెల 29, 30 తేదీలలో నర్సంపేటలో నిర్వహించే మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ మహాసభలో సీపీఎం నాయకులు నాగపురి వెంకటేశ్వర్లు, పాముల ఉదయశ్రీ, నలిగంటి అనిల్, తగరపు వేణు, దుర్గయ్య, పిట్ట మహేందర్, ఎల్లయ్య, ఆవుల ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

● సీపీఎం కార్యదర్శుల ఎన్నిక

శంభునిపేట: భారత కమ్యూనిస్టు పార్టీ మార్కిస్టు రంగశాయిపేట ఏరియా కమిటీ కార్యదర్శులను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 42వ డివిజన్ లెనిన్ నగర్‌లో 41,42,3,44 డివిజన్‌లకు సంబంధించి పార్టీ శాఖల మహాసభలను నిర్వహించారు. సీపీఎం నాయకురాలు మన్నూరు జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ మహాసభల్లో 13 శాఖలకు కార్యదర్శులను ఎన్నుకున్నారు. వారిలో మన్నూరు జ్యోతి, తాటికాయల రత్నం, ఎం.ప్రత్యూష, జి.ఓదేలు, సింగారపు దాసు, లావణ్య, ఉసిల్ల దీప, మాదవి, రమేష్ షైరున్నీసా, ముంతాజ్, ఉసిల్ల శ్రీనివాస్ ఉన్నారు.

భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు



అమ్మవారికి, చీర, సారె అందిస్తున్న రైల్వే నాయకులు

కాజీపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాజీపేటలో రైల్వే పరిశ్రమలు, డివిజన్ హోదా మంజూరును కాంక్షిస్తూ వరంగల్ భద్రకాళి అమ్మవారి దేవాలయంలో బుధవారం టీ రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి చీర, సారె సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా వాసుల 40ఏళ్ల కాంక్ష రైల్వే వ్యాగన్ తయారీ, కోచ్‌ఫ్యాక్టరీ, డివిజన్ హోదా కాజీపేటకు మంజూరు కావడం సంతోషించాల్సిన విషయం అన్నారు. ఈ పరిశ్రమల సాధనకోసం అమ్మవారి ఆశీర్వాదంతో రైల్వే జేఏసీ నిరంతరం ఉద్యమాలు చేసినట్లు చెప్పారు. ఈ ప్రత్యేక పూజలో జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్‌రావు, చైర్మన్ కొండ్ర నర్సింగరావు, కో - కన్వీనర్లు జి. భాస్కర్, అనుమాల శ్రీనివాస్, డి.రవీందర్, ఎం.మహేశ్, పి.రమేశ్, బిజ్జ శివ ప్రసాద్, వైస్ చైర్మన్లు గుర్రపు సుధాకర్, బి.మాధవరావు, సంపత్, వి.రవీందర్, నాగపురి రాజయ్య, పోలు శ్రీనివాస్ పాల్గొన్నారు.

● అమ్మవారిని దర్శించుకున్న కమిషనర్

వరంగల్ కల్చరల్: వరంగల్ భద్రకాళి దేవస్థానాన్ని రాష్ట్ర అడిషనల్ సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ ఎం.ఎస్.కే.వీ.వీ సత్యనారాయణ బుధవారం సందర్శించారు. కుటుంబసభ్యులతో కలిసి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభం, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రీజినల్ పీఎఫ్ కమిషనర్ బిందుభూషణ్, తానయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సూర్యప్రకాష్, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ నిర్మాణానికి సర్వోదయ కృషి

● యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి పల్లెపాడు దామోదర్



సమావేశంలో మాట్లాడుతున్న పల్లెపాడు దామోదర్

కాళోజీ జంక్షన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : హింసా రహిత సమాజ నిర్మాణం కోసం సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కృషి చేస్తున్నట్లు ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. మహిళలపై హింస వ్యతిరేక దినంగా ఈనెల 25 నుంచి డిసెంబరు 10వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం హనుమకొండలోని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో నిర్వహించిన మహిళా కమిటీల సభ్యులకు నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంగెం, ఆత్మకూరు, గీసుగొండ, పరకాల, కమలాపూర్ మండలాలకు చెందిన మహిళా సహాయత కమిటీ సభ్యులకు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో పల్లెపాడు దామోదర్ మాట్లాడుతూ.. హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో ఏర్పాటుచేసిన సఖీ కేంద్రాల్లో హింస బారిన పడిన బాధిత మహిళలకు కౌన్సెలింగ్ ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం సఖీ కేంద్రాన్ని ఆశ్రయిస్తే వారి సమస్యను గోప్యంగా ఉంచుతామని, ఒక్క రూపాయి కూడా ఖర్చు కాదని తెలిపారు. ఎలాంటి పైరవీలకు ఆస్కారం ఉండదని బాధిత మహిళ ఇష్ట ప్రకారమే సమస్యను పరిష్కరిస్తామ న్నారు. గ్రామ సహాయక కమిటీ సభ్యులు వారి వారి గ్రామాల్లో హింసకు గురవుతు న్న మహిళలను సఖీ కేంద్రానికి తీసుకొస్తే వారి కాపురాలు నిలబడుతాయని అన్నారు. ఎక్కడ ఆడపిల్లకు అన్యాయం జరిగినా మహిళా కమిటీ సభ్యులు చొరవ తీసుకోవాలని దామోదర్ కోరారు.

రోడ్డు ఇలా.. ప్రయాణమెలా?

ఆరు నెలలుగా ఇబ్బంది పడుతున్న తూర్పుకోట ప్రజలు
పట్టించుకోని పాలకులు, అధికారులు



భారీ వాహనాల రాకపోకలతో దుమ్ము లేస్తున్న దృశ్యం

ఖిలావరంగల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నుంచి తూర్పు కోటకు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. ఆరు నెలల క్రితం ఈ రోడ్డు గుంతలు పడి ఉండడంతో కంకర పోసి చదునుచేశారు. అయితే గత నెలలో కురిసిన వర్షానికి సన్నకంకర కొట్టుకుపోయింది. దీంతో దొడ్డు కంకరతేలి వాహనదారులు తీవ్రఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డుపై భారీ వాహనాలు వెళుతుండడంతో దుమ్ము లేస్తోంది. ఫలితంగా ప్రజలు గొంతు, ముక్కు, ఊపిరితిత్తుల వ్యాధుల బారినపడుతున్నారు. ఇప్పటికైనా మంత్రి కొండా సురేఖ, నగరపాలక సంస్థ కమిషనర్ స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలని 37వ, డివిజన్ ప్రజలు కోరుతున్నారు.



కంకర తేలిన తూర్పుకోట రోడ్డు

వైభవంగా మహాచండీ హోమం



హోమంలో పాల్గొన్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

శంభునిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 41వ డివిజన్ విశ్వనాథకాలనీకి చెందిన ప్రముఖ పూజారి జాగర్లపూడి కోటయ్యశర్మ ఆధ్వర్యంలో బుధవారం మహాచండీ హోమం వైభవంగా నిర్వహించారు. వరంగల్ చౌరస్తాలోని వరమ్మ దేవాలయంలో లోక కల్యాణం కోసం హోమం నిర్వహించామని కోటయ్య శర్మ అన్నారు. వరంగల్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కర్నె రవీందర్, వాసుదేవ్‌లతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

వాగ్దేవి విద్యా సంస్థల డైరెక్టర్ చందుపట్ల వాణిదేవి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

శంభునిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ విద్యార్థులకు భవిష్యత్‌లో ఉజ్వల భవిష్యత్ ఉందని వాగ్దేవి విద్యా సంస్థల డైరెక్టర్ చందుపట్ల వాణిదేవి అన్నారు. నగరంలోని బొల్లికుంట వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో బుధవారం బీ-ఫార్మసీ, డీ-ఫార్మసీ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.కమల్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ ఎన్ఎస్‌వీఎన్ శర్మ, వాణిదేవి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ రాధాకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఫార్మసీ విద్యార్థులు ఔషధ విషయ జ్ఞానాన్ని పెంపొందించుకొని సంపూర్ణ ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉద్బోధించారు. పోటీ ప్రపంచంలో విషయజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, సాంకేతికతను మెరుగుపరుచుకోవాలన్నారు. ఒత్తిడిని జయించి జీవితంలో ఉన్నత స్థానంలో నిలబడాలన్నారు.

అనంతరం కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ రవి చందర్ విద్యార్థులు అటెండెన్స్, పరీక్షల విధానాన్ని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఫార్మసీ రంగంలో వచ్చే ఉపాధి అవకాశాలు, వాటిని సాధించటానికి నేర్చుకోవాల్సిన స్కిల్స్ గురించి కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ చీఫ్ శివకుమార్ తెలి పారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కేయూలో పూలే వర్ధంతి


కేయూ క్యాంపస్, నవంబరు 27,(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాంఘిక సంస్కర్త, రచయిత మహాత్మా జ్యోతిరావు పూలే 134వ వర్ధంతిని కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రంలోని మహాత్మాపూలే దంపతుల విగ్రహాల వద్ద నిర్వహిస్తామని కేయూ బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమంలో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు. అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీనివాసులు కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ

శంభునిపేట: మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించాలని పూలే సామాజిక న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేడల ప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం శంభునిపేట జంక్షన్‌లో ఆయన పూలే వర్ధంతికి సంబంధించిన వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. బడుగు, బలహీన వర్గాల్లో చైతన్యం నింపిన మహాత్ముడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో కత్తెరపల్లి దామోదర్, గద్దల కుమారస్వామి, తరగల ప్రసాద్, షైదం సంజీవ, నీలం సంజీవ, ఎమ్డీ సలీం, ఎమ్డీ సల్లావుద్దీన్, కుతూబుద్దీన్, గౌస్, వలీ, సందీప్, కృష్ణంరాజు పాల్గొన్నారు.

మజ్దూర్ యూనియన్‌ను గెలిపించాలి

● డివిజనల్ జనరల్ సెక్రటరీ శంకర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌రావు

కాజీపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులంతా మజ్దూర్ యూనియన్‌ను బలపరిచి, భారీ మెజారిటీతో గెలిపించాలని యూనియన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ శంకర్‌రావు అన్నారు. కాజీపేట ఈఎల్ఎస్ వద్ద బుధవారం బ్రాంచ్ నాయకులు నాయిని సదా నందం ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో డాక్టర్ శంకర్ రావు హాజరై మాట్లాడారు. డిసెంబరు 4, 5, 6, తేదీల్లో నిర్వహించే ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో జెండా గుర్తుకు ఓటేయాలని చెప్పారు. కార్మికుల పక్షాన నిత్యం పోరాడేది మజ్దూర్ యూనియన్ మాత్రమే అన్నారు. ఈ ఎన్నికల్లో రైల్వే కార్మికులంతా ఏకమై మజ్దూర్ యూనియన్‌కు భారీ మెజార్టీ ఇవ్వాలన్నారు. అనం తరం ఎంప్లాయీస్ సంఘ్ నుంచి పలువురు మజ్దూర్ యూనియన్‌లో చేరారు. ఈ ప్రచారంలో జోనల్ ప్రెసిడెంట్ కాల్వ శ్రీనివాస్, డివిజనల్ అధ్యక్షుడు ఖాజా బాబా, డివిజనల్ సెక్రటరీ పిల్లలమర్రి రవీందర్, డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస్ యాదవ్, నాయకులు దేవులపల్లి రాఘవేందర్, డివిజనల్ ట్రెజరర్ నర్సింహారెడ్డితో పాటు రైల్వే కార్మికులు పాల్గొన్నారు.



జయగిరి రైల్వే గేటు వద్ద విరిగిన స్తంభం

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

● పట్టించుకోని అధికారులు

హసన్‌పర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి - జయగిరి రైల్వే గేటు మూలమలుపు వద్ద రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. నిత్యం జయగిరి నుంచి హసన్‌పర్తికి రాకపోకలు సాగించే వాహనదారులకు ప్రాణాపాయం కలుగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడే స్పందించడం కాదు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పలు సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి విరిగిన విద్యుత్ స్తంభం స్థానంలో కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


దీక్షా దివస్‌ను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు రజనీకుమార్

హసన్‌పర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నవంబరు 29న నిర్వహించనున్న కేసీఆర్ దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ పిలుపునిచ్చారు. గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రంలో డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ఆమరణ దీక్షా ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందన్నారు. నవంబరు 29న కేసీఆర్ చేపట్టిన దీక్షా దివాస్ భవిష్యత్తు తరాలకు తెలియాల్సిన అవసరం ఉందని తెలిపారు. జిల్లా కేంద్రంలో మొదట దీక్షా దివాస్ కార్యక్రమం ఉంటుందని ప్రతి ఒక్కరు కేసీఆర్ దీక్షా దివాస్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మడికొండ గురుకులంలో సంప్రదాయక దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు

మడికొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో బుధవారం సంప్రదాయక దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ డి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హర్యామన్ రైట్స్ అధికారి సత్య హాజరయ్యారు. ఈ వేడుకల్లో ఉగాది, బతుకమ్మ, దీపావళి, సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్, తీజ్, గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులకు పండుగల నేపథ్యం గురించి వివరించారు.

గురుకులంలో జడ్పీ సీఈవో తనిఖీ



అల్పాహారాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో విద్యాలత

హసన్‌పర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎల్లాపూర్ శివారులోగల మహాత్మాజ్యోతిరావుపూలే బాలికల విద్యాలయం తిమ్మాపూర్ శాఖను జడ్పీ సీఈవో విద్యాలత బుధవారం తనిఖీ చేశారు. ఆహార పదార్థాలను, వంట పాత్రలను పరిశీలించి తగు సూచనలు చేశారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసి సంతృప్తి చెందారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ శోభారాణి, డిప్యూటీ వార్డెన్ మాధవి, బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు.

పోతన పద్యాలను అందరూ చదవాలి

ప్రముఖ అధ్యాత్మికవేత్త సూర్యనారాయణమూర్తి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సూర్యనారాయణమూర్తి

మట్టెవాడ నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోతన సాహిత్యం అద్భుతమైందని, ఆయన రాసిన పద్యాలను ప్రతీ ఒక్కరు చదవాలని ప్రముఖ అధ్యాత్మిక వేత్త మావుడూరు సూర్యనారాయణమూర్తి అన్నారు. బుధవారం సాయంత్రం వరంగల్ ఏవీవీ కళాశాలలో పోతన జయంతి నిర్వహించారు. ఏవీవీ సంఘం సభ్యులు ప్రొఫెసర్ ఎస్ఎస్‌వీఎన్ శర్మ అధ్యక్షత జ్యోతిప్రజ్వలన చేసి పోతన పద్యాలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ.. పోతన పద్య సంపుటిని ప్రతి ఒక్కరూ చదవాలని అన్నారు. అనంతరం భాగవత పద్యపఠన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భుజేందర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కోడిమ్యాల శ్రీనివాసరావు, అధ్యాపకులు సంజీవ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు, రేపు కేయూలో జాతీయ సదస్సు



ఆహ్వానపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ తౌటం శ్రీనివాస్, ఇస్తారీ తదితరులు

కేయూ క్యాంపస్, నవంబరు 27,(ఆంధ్రజ్యోతి): కేయూ సోషియాలజీ, సోషల్‌వర్క్స్ విభాగం నేతృత్వంలో ఈనెల 28, 29 తేదీల్లో 'గ్లోబలైజేషన్ డెవలప్‌మెంట్ అండ్ సోషల్ ట్రాన్స్‌ఫార్మేషన్ : మ్యాపింగ్ ది ట్రాజెక్టోరీస్ ఆఫ్ సోషల్ ఇన్‌స్టిట్యూషన్ అండ్ ప్రాసెస్ ఇన్ కంటెంపరీ ఇండియా' అనే అంశంపై జాతీయ సదస్సు జరుగుతుందని సోషియాలజీ విభాగాధిపతి సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ తౌటం శ్రీనివాస్ తెలిపారు. బుధవారం క్యాంపస్‌లోని సోషియాలజీ విభాగంలో సదస్సు ఆహ్వాన పత్రాన్ని అకూట్ జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారితో కలిసి ఆవిష్కరిం చారు. ఈసందర్భంగా ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. 28న ఉదయం 10 గంటలకు వర్సిటీ సెనెట్ హాల్‌లో జరిగే ప్రారంభ సదస్సుకు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యేనాయిని రాజేందర్‌రెడ్డి, ఓయూ రిటైర్డు ప్రొఫెసర్ కె.శ్రీనివాస్, కేయూ ప్రొఫెసర్ ఎన్.రాములు, కె. వెంకట్‌నారాయణ, సి. గణేశ్, ఎస్‌కేడీ వర్సిటీ అనంతపూర్ నుంచి ప్రొఫెసర్ సీహెచ్. ఉమా మోహన్, ఎస్వీ వర్సిటీ తిరుపతి నుంచి ప్రొఫెసర్ ఎం.హన్మంతరావు, టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, కేయూ సోషల్‌సైన్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, యూజీసీ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ తదితరులు పాల్గొంటారని కన్వీనర్ తౌటం శ్రీనివాస్ తెలిపారు. సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోషియాలజీ విభాగం అధ్యాపకులు డాక్టర్ సుభాష్, డాక్టర్ సాహితీ, డాక్టర్ కందకట్ల శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం

వరంగల్ మెడికల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెద్దమ్మగడ్డ పట్టణ ఆరోగ్యం కేంద్రం పరిధిలోని పాలెం ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మదన్ మోహన్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆరోగ్యకరమైన అలవాట్లు, న్యూట్రిషన్‌కు సంబంధించిన విషయాలపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పాఠశాలలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి మందులు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో పెద్దమ్మగడ్డ వైద్యాధికారి డాక్టర్ రోహిత్ కుమార్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ టి.సుజాత, ప్రధాన ఉపాధ్యాయులు వేదాంత చారి, హెల్త్ అసిస్టెంట్ ఇంద్రారెడ్డి, మోసిన్, కిరణ్మయి, ఏఎన్ఎం సరిత, ఆశా ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు ఆరోగ్యంపై అవగాహన

హసన్‌పర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాలికలు వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ అంతుల్‌హఫ్సా కోరారు. మండలంలోని ఎర్రగట్టుగుట్ట వద్ద ఉన్న తెలంగాణ బాలికల గురుకుల కళాశాలలో బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ ఇందుమతి అధ్యక్షతన హనుమకొండ మెడికోవర్ ఆస్పత్రి డాక్టర్ అంతుల్‌హఫ్సా ఆధ్వర్యంలో బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కౌమార దశలో ఉన్న బాలికలకు వచ్చే వ్యాధులు, వాటి నివారణ, స్త్రీల వ్యక్తిగత పరిశుభ్రతపై వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు అందించారు.

ఈ కార్యక్రమంలో మెడికోవర్ ఆస్పత్రి సీనియర్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, కళాశాల అధ్యాపక సిబ్బంది ప్రసూన, వినోద, సరళారెడ్డి, మమత, రమణ, ప్రకాష్‌తో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

టూరిస్టుల రాక పెరుగుతోంది

ఫేస్ టు ఫేస్

శివాజీ, ఉమ్మడి జిల్లా పర్యాటక శాఖ అధికారి



ప్రశ్న: పర్యాటకానికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఎలా ఉంది ?

జ: బాగానే ఉంది. అవసరమైన చోట పర్యాటకుల సౌకర్యార్థం వసతి సౌకర్యాలను, ఇతర మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోంది.

ప్రశ్న: పర్యాటకుల సంఖ్య గతం కన్నా పెరిగిందా?

జ: రామప్పకు యునెస్కో గుర్తింపు వచ్చిన తర్వాత ఉమ్మడి జిల్లాకు పర్యాటక రాక గతంలో కన్నా బాగా పెరిగింది. రామప్పతో పాటు ఇతర దర్శనీయ స్థలాలను చూసేందుకు ఎక్కువ మంది వస్తున్నారు.

ప్రశ్న: పర్యాటక స్థలాల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ? నిధులు ఏమైనా వచ్చాయా ?

జ: రామప్పలో అభివృద్ధి పనులు జరుగు తున్నాయి. లక్నావరంలో మరిన్ని సౌకర్యాల కల్పించాం. కురవి, అయినవోలు, ధర్మసాగర్, వడ్డెపెల్లి, కాళేశ్వరం, ఘనపురం, తదితర ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధికి, ఎకో టూరిజానికి ప్రతిపాదనలు పంపాము. ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి.

ప్రశ్న: తెలంగాణ దర్శినికి స్పందన ఎలా ఉంది ?

జ: విద్యార్థుల నుంచి మంచి స్పందన ఉంది. ఈ పథకం కింద ఆయా పాఠశాల విద్యార్థులను పర్యాటక ప్రాంతాలకు తీసుకువెళ్లేందుకు కార్య ప్రణాళికను రూపొందించాం.

ప్రశ్న: ఉమ్మడి జిల్లా విదేశీల పర్యాటకుల రాక ఎలా ఉంది ?


జ: గతంలో కన్నా ఈ సారి బాగా పెరిగింది. ఈ సంవత్సరం ఇప్పటికే వివిధ దేశాల నుంచి 400 మందికిపైగా వచ్చారు.

ప్రకృతి అందాల పుట్టిల్లు

కొడవటూరు

» ఆధ్యాత్మికంతో పాటు ఆహ్లాదాన్ని పంచుతున్న సిద్ధులగుట్ట
» పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలంటున్న భక్తులు





ధ్యానం కోసం నిర్మించిన పిరమిడ్

బచ్చన్నపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పురాతన దేవాలయాలంటేనే ఎన్నో ప్రత్యేకతలకు నిలయాలు. అలాంటి పురాతన దేవాలయాల్లో ప్రకృతి అందాలకు పుట్టినిల్లుగా పేరుగాంచిన శైవక్షేత్రం కొడవటూరు స్వయంభూ సిద్ధేశ్వరాలయం ఒకటి. సుమారు 147 ఎకరాల విస్తీర్ణంలో ఉండే ఈ సిద్ధులగుట్ట చుట్టూ పచ్చని చెట్లు, ఔషధ మొక్కల పరిమళాలు వెద జల్లుతాయి. ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదాన్ని పంచే ఈ క్షేత్రంలో అనేక దేవతామూర్తుల ఆలయాలతో పాటు, మనస్సుకు ప్రశాంతత చేకూర్చే పిరమిడ్ ధ్యాన కేం ద్రం ఉంది. నిత్యం ఇక్కడకు వచ్చే భక్తులకు ఈ ప్రాంత పరి సరాలు ఆహ్లాదాన్ని పంచు తున్నాయి. ఇక్కడి సిద్ధేశ్వ రుడి దర్శనానికి వచ్చే ప్రజా ప్రతినిధులు, రాజకీయ నేతలు.. తన్మయ త్వానికి లోనై ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు నిధులు కేటాయిస్తామంటూ హామీలు ఇస్తుంటారు. కానీ అవేమీ అమలుకు నోచుకోవటం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆలయంలో సిద్దేశ్వరుడు

అభివృద్ధి చేస్తే భక్త సందోహమే..

సిద్ధులగుట్టను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తే భక్తులు, పర్యాటకులతో కిటకిటలాడటం ఖాయమంటున్నారు. దశాబ్ద కాలం క్రితం ఈ గుట్టపై ఉన్న మూడు గుండాల్లో స్నానమాచరించనిదే భక్తులు సిద్ధేశ్వరుడిని దర్శించుకునేవారు కాదు. కింది నుంచి గుట్టపైభాగాన ఉన్న గుండాలు సుమారు కిలోమీటర్ దూరంలో ఉంటాయి. ఉరుకుల పరుగుల జీవితం, అనారోగ్య సమస్యలు చుట్టుముట్టడంతో కాలినడకన గుండాల వద్దకు భక్తులు తక్కువగా వెళుతున్నారు.

గతంలో కొడవటూరు సర్పంచ్‌గా పనిచేసిన గంగం సతీష్‌రెడ్డి గుట్టపైకి వాహనాలు వెళ్లే విధంగా రూట్‌మ్యాప్‌తో పాటు పర్యాటక అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికను తయారు చేసి, ఎమ్మెల్యే ఆమోద పత్రంతో దేవాదాయశాఖ అధికారులకు పంపారు. అలాగే గుట్ట కింది భాగంలో ఉన్న చెరువును ట్యాంక్‌బండ్ మాదిరిగా అభివృద్ధి చేయడం.. ఆలయానికి ముందు 30 అడుగుల శివలింగం, హనుమాన్ విగ్రహాలు ఏర్పాటు, ఆలయం వద్ద ఉన్న 6.19 ఎకరాల్లో వాటర్ ఫౌంటేన్లు, ఔషధ, పూల మొక్కల పెంపకం, కోతుల పార్కు, గుట్టచుట్టూ తిరిగేలా సుమారు నాలుగు కిలోమీటర్ల పరిధిలో రోడ్డు, నిర్మించి వదిలేసిన పర్యాటక అతిథి గృహాన్ని వినియోగంలోకి తేవటం లాంటి చర్యలు తక్షణం చేయాలని కోరుతున్నారు. ఇక ఆలయ పరిసరాల్లో వానరాల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వీటిని పట్టి అడవుల్లో వదిలేస్తే ఇబ్బందులు తొలగుతామని భక్తులు సూచిస్తున్నారు.



వరంగల్ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో రైల్ కోచ్ రెస్టారెంట్‌కు జరుగుతున్న ఏర్పాట్లు

రైల్ కోచ్ రెస్టారెంట్!

» త్వరలో వరంగల్ రేల్వే స్టేషన్‌లో ఏర్పాటు
» 24 గంటలు అందుబాటులో భోజనం

గిర్మాజీపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికులకు రైల్‌కోచ్ రెస్టారెంట్ అందుబాటులోకి రానుంది. ఇప్పటికే హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లో వివిధ రుచులతో ఆకట్టుకుంటున్న రైల్ కోచ్ రెస్టారెంట్ తరహాలో త్వరలో వరంగల్ రైల్వేస్టేషన్‌లో కూడా ఏర్పాటు చేయాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ప్రయాణానికి ఉపయోగపడని రైల్ కోచ్‌లను ఆధునికీకరించి రెస్టారెంట్లుగా ఏర్పాటు చేసేందుకు తీర్చిదిద్దుతోంది. ఇప్పటికే కాచిగూడ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో రెస్టారెంట్ ఆన్ వీల్స్ పేరుతో తొలి రైల్ కోచ్ క్యాంటీన్ ఏర్పాటుచేసిన అధికారులు రెండో రైల్ కోచ్ రెస్టారెంట్‌ను గత సెప్టెంబరు 11న నెక్లెస్ రోడ్‌లో ప్రారంభించారు. అదే రీతిలో వరంగల్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని ఐవోడబ్ల్యూ కార్యాలయం సమీపంలో రైల్ కోచ్ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ రెస్టారెంట్ 24గంటలు అందుబాటులో ఉండనుంది. దీనికి సంబంధించిన కాంట్రాక్ట్‌ను వరంగల్ నగరంలోని ప్రముఖ హోటల్ అయిన శంకర్ విలాస్ యాజమాన్యం పొందింది. రైల్ కోచ్‌ను ఆధునికీకరించే పనులను బుధవారం ప్రారంభించింది. నూతన సంవత్సరం నాటికి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని నిర్వాహకులు తెలిపారు.



వరంగల్‌లో రెస్టారెంట్ ఏర్పాటు చేయనున్న రైల్వే కోచ్



నెక్లెస్ రోడ్డులోని రైల్ కోచ్ రెస్టారెంట్ ఇదే, సుందరీకరించిన లోపలిభాగం

నారీ శక్తి

పల్నాడు గడ్డపై..



ప్రత్యర్థుల దాడిలో నుదుటిపై లోతైన గాయమైనా.. రక్తం ధారలా కారుతున్నా.. ధైర్యాన్ని కోల్పోలేదు. తాను నమ్మిన పార్టీ కోసం, రాజకీయ సిద్ధాంతం కోసం ప్రత్యర్థులను ఎదిరించి వార్తల్లో నిలిచారు. ఆమె ఎవరో కాదు. ఏపీలోని పల్నాడు జిల్లా రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన చెర్రెడ్డి మంజులారెడ్డి. తెలుగుదేశం పార్టీ సాధారణ కార్యకర్తగా ఉన్న ఆమె అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నాటి ఘటన తర్వాత ప్రత్యేక గుర్తింపు పొందారు. అంతేకాదు పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు దృష్టిలో పడిన ఆమె సాధారణ మహిళా నాయకురాలి నుంచి ఏపీ శిల్పారామం, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించే స్థాయికి ఎదిగారు. అలా ఏపీ రాజకీయాల్లో 'వీరవనిత'గా పేరు తెచ్చుకున్న మంజులారెడ్డి ఓరుగల్లు ఆడబిడ్డ కావడం గమనార్హం. భద్రకాళి అమ్మవారు వేంచేసిన నేలపై పుట్టిన మంజులారెడ్డి.. రాణీ రుద్రమదేవి పౌరుషాన్ని.. సమ్మక్క సారలమ్మ పోరాట తెగువను పల్నాటి గడ్డపై చూపారు.

ఓరుగల్లు పౌరుషం



ఏపీ శిల్పారామం, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మంజులారెడ్డి

- ఏపీ అసెంబ్లీ ఎన్నికల పోరులో ప్రత్యర్థులను ఎదిరించిన చల్లగరిగ ఆడబిడ్డ
- గొడ్డలి గాయమైనా వెనుకడుగేయని మంజులారెడ్డి
- అధినేత ఆశీస్సులతో 'దేశం'లో కీలక నేతగా గుర్తింపు
- ఏపీ శిల్పారామం, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్‌గా ప్రమాణం

హనుమకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చెర్రెడ్డి మంజులా రెడ్డి.. ఈ ఏడాది మే 13న ఏపీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రోజున వార్తల్లో నిలిచిన మహిళ. పల్నాడు జిల్లా మాచర్ల నియోజవర్గం రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన ఆమె తెలుగుదేశం పార్టీ తరపున పోలింగ్ బూత్ ఏజెంట్‌గా కూర్చుని.. ప్రత్యర్థి పార్టీ వైసీపీ వారి దాడికి గురయ్యారు. ఆ సమయంలో ఆమె నుదుటిపై గొడ్డలి వేటు కారణంగా లోతైన గాయమైంది. రక్తమోడుతున్నా ధైర్యం కోల్పోకుండా ఆమె ఏజెంట్‌గా తన బాధ్యతను నిర్వర్తించి వీర వనితగా వార్తల్లో నిలిచారు.

అలా పార్టీ కోసం కట్టుబడిన ఆమె ధైర్యాన్ని మెచ్చుకున్న టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్ర బాబు సాధారణ నాయకురాలిగా ఉన్న ఆమెను ఏపీ శిల్పా రామం, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్‌గా నియమించి.. ప్రత్యేక గుర్తింపునిచ్చారు. అంతలా పార్టీ కోసం ప్రాణాలను కూడా లెక్కచేయకుండా ప్రత్యర్థులకు ఎదురొడ్డి నిలిచిన మంజులారెడ్డి పుట్టిపెరిగింది ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే. మెట్టినింట తెలంగాణ పౌరుషాన్ని, రాణిరుద్రమదేవి ధీరత్వాన్ని ప్రదర్శించిన మంజులారెడ్డి ఇటీవల ఏపీ శిల్పారామం, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆ వరంగల్ ఆడపడుచు.. తనకు ఓరుగల్లు నేలతో ఉన్న అనుబంధాన్ని 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

నేను చల్లగరిగె ఆడపడుచును..

నా స్వస్థలం ప్రస్తుత జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగే గ్రామం. చల్లగరిగే అనగానే గుర్తొచ్చేది ప్రముఖ పాట రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్. ఆయనది, మాదీ ఒకే గ్రామం. నాన్న మోర్తాల బూసిరెడ్డి, అమ్మ అన్నపూర్ణ. మాది పెద్ద కుటుంబం. ఏడుగురు సంతానం. ఒక అన్న, ఆరుగురు అక్కలు. అందరికన్నా నేనే చిన్నదానిని. నా బాల్యమంతా పచ్చని పొలాలు, మట్టి మనుషుల మధ్య గడిచింది. చదువు కూడా చల్లగరిగలోని ప్రభుత్వ పాఠశాలలోనే సాగింది. చిన్నతనంలో ఎంతో అల్లరి చేసిన నేను ఆటల పోటీల్లో ఎప్పుడూ ముందుండేదాన్ని. దేనికీ భయపడని మనస్తత్వాన్ని నాకు పల్లె వాతావరణమే నేర్పింది. ఏడుగురు సంతానంలో చిన్నదాన్ని కావడంతో అందరూ గారాబంగా చూశారు. కానీ పెళ్లి కారణంగా పదోతరగతితోనే చదువు ఆపేయాల్సి వచ్చింది.

ఆంధ్రా సం'బంధం' ఎలాగంటే..

పక్కా తెలంగాణలో పుట్టిన నాకు ఆంధ్రాతో బంధం ఏర్ప డటానికి మా దగ్గర బంధువైన వేణుగోపాల్ రెడ్డి కారణం. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుకు చెందిన వేణుగోపాల్‌రెడ్డి ఆర్‌ఎంపీగా ఆంధ్ర ప్రాంతంలో కూడా వైద్యం చేస్తుండేవారు. ఈ క్రమంలో ఆయన అక్కడ అమ్మాయిని వివాహం చేసుకోవడంతో ఏర్పడిన పరిచయాలు, బంధుత్వాలతో నాకు ఆ పల్నాడు జిల్లా రెంటాల గ్రామానికి చెందిన చెర్రెడ్డి కోటిరెడ్డితో వివాహమైంది. నా భర్త కోటిరెడ్డి టీడీపీ నాయకుడిగా గతంలో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి వైసీపీ వారి ఆరాచకాలను ఎదిరించి సర్పంచ్‌గా గెలిచారు. అప్పుడు నాకు అంతగా రాజకీయాలంటే ఇష్టం లేకపోయినా ఓ సాధారణ మహిళా కార్యకర్త గా నా భర్త తరపున ప్రచారం చేశా. కానీ గత ఐదేళ్లలో వైసీపీ శ్రేణుల ఆరాచకాలను చూసి నాకు బాధేసింది. కోపం కూడా వచ్చేది. కానీ సంయమనం పాటించా. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాచర్ల నియోజకవర్గంలో నా భర్త, ఇతర మహిళా నాయకులతో కలిసి ప్రచారంలో పాల్గొన్నా. క్రియాశీలకంగా వ్యవహరించా. చివరకు పోలింగ్ రోజున మా గ్రామంలోని పోలింగ్ బూత్‌లో టీడీపీ ఏజెంట్‌గా కూర్చున్నా. కానీ వైసీపీ వారు దుర్మార్గానికి దిగారు. టీడీపీ తరఫున ఏజెంట్లు లేకుండా చేసేందుకు ప్రయత్నించారు. ఆక్రమంలోనే వైసీపీ వర్గీయులు నాపై దాడి చేశారు. రోడ్డుపై పడేసి గొడ్డళ్లతో గాయపరిచారు. అయినా వెనక్కి తగ్గకుండా నుదుటన గొడ్డలి గాటు పడినా.. రక్తం కారుతున్నా బూత్‌లోనే కూర్చుని వైసీపీ రిగ్గింగ్‌ను అడ్డుకున్నా. పోలింగ్ పూర్తయ్యాక ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకున్నా. నాలా కష్టపడే సాధారణ కార్యకర్తకు టీడీపీలో సముచిత స్థానం లభిస్తుందనడానికి.. ఓ కీలకమైన కార్పొరేషన్‌కు సీఎం చంద్రబాబు నన్ను చైర్‌పర్సన్‌గా నియమించడమే ఉదాహరణ.

ఓరుగల్లు పౌరుషం నారక్తంలోనే ఉంది

మెట్టినిల్లు ఆంధ్రా అయినా నా రక్తంలోనే ఓరుగల్లు పౌరుషం ఉంది. ఆ తెగింపుతోనే నేను వైసీపీ మూకలను ఎదుర్కోగలిగా. నేను ఏ స్థాయిలో ఉన్నా పుట్టినిల్లయిన చల్లగరిగె.. ఉమ్మడి ఓరుగల్లుతో నా అనుబంధం కొనసాగుతూనే ఉంటుంది. ఇప్పటికీ చల్లగరిగెకు రాకపోకలు సాగుతూనే ఉన్నాయి. వరంగల్, నెక్కొండ, రాఘవాపూర్, శనిగరంలో బంధువులు ఉన్నారు. తెలంగాణ పౌరుషం.. రాణి రుద్రమదేవి ఇచ్చిన ధీరత్వమే నన్ను నడిపిస్తోంది.. ఆటైనా పాటైనా, పోరాటమైనా అన్నిటా ముందు నిలిచేలా నా పుట్టినూరు చల్లగరిగే చైతన్యం నింపింది. ప్రస్తుతం హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మెన్‌గా బాధ్యతల స్వీకరించిన తర్వాత నేను రాజకీయాల్లో మరింత క్రియాశీలంగా ఉండాలనుకుంటున్నా. వీలైనంత మేరకు ప్రజలకు సేవ చేయాని నిర్ణయించుకున్నా. చల్లగరిగె ఆడబిడ్డగా పల్నాడు రాజకీయాల్లో నాదైన ముద్ర వేయాలనుకుంటున్నా.

పరిమళించిన పల్లె చిత్రం

» ఆర్ట్స్ ఫొటోగ్రఫీలో రాణిస్తున్న ఫక్రుద్దీన్
» పేదరికాన్ని జయించి.. అవార్డుల వైపు నడుస్తున్న మరిపెడ వాసి
» సామాజిక సేవలోనూ తనవంతు పాత్ర



మరిపెడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పుట్టింది పేద కుటుంబంలో అయినా తనకున్న ప్రతిభను ప్రపంచానికి చూపాడు. ఆర్ట్ ఫొటోగ్రఫీలో రాణించి గోల్డ్ మెడల్ సంపాదించాడు. పలు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో సత్తా చాటి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. అంతేకాదు ఫొటోగ్రఫీలో తాను సంపాదించే మొత్తంలో నుంచి కొంత సొమ్మును సామాజిక సేవలకు వినియోగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.. మరిపెడ బంగ్లాకు చెందిన ఫక్రుద్దీన్. ప్రకృతి రమణీయ ఫొటోల చిత్రీకరణ ఫక్రుద్దీన్ హాబీ. అయితే కమర్షియల్ ఫొటోగ్రాఫర్‌గా జీవనాన్ని ఆరంభించిన ఫక్రుద్దీన్ ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బీరోలులో జన్మించారు. ఏడో తరగతి వరకు చదివారు. నిరుపేద కుటుంబం కావడంతో ఇరువైయేళ్ల క్రితం జీవనోపాధి కోసం మరిపెడబంగ్లాకు వలస వచ్చి టైలరింగ్ వృత్తిలో స్థిరపడ్డారు. ఈ క్రమంలో ఫొటోగ్రఫీపై మక్కువ పెంచుకున్న ఫక్రుద్దీన్ టైలరింగ్ వృత్తిని ఫొటోగ్రాఫర్‌గా మారి ఆర్ట్స్ ఫొటోలపై మక్కువ పెంచుకొని అనతి కాలంలోనే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో తనదైన శైలిని ప్రదర్శిస్తూ అనేక బంగారు, రజత, కాంస్య పతకాలను సాధించారు.

ఫొటోగ్రఫీలోని కొత్త ఒరవడులకు నాంది పలికిన ఫక్రుద్దీన్ నేటి ఫొటోగ్రాఫర్లకు మార్గదర్శకుడిగా నిలిచారు. మరిపెడ మండల ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసి రాష్ట్రంలోనే మరిపెడ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్‌కు ఓ ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. ఫొటోగ్రాఫర్లకు డ్రెస్ కోడ్‌కు బీజం వేశారు. ఎప్పటికప్పుడు ఫొటోగ్రఫీలో మెళకువలను నేర్చుకుంటూ సాధన చేస్తూ ఆర్ట్స్ ఫొటోలను బంధించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటుతున్నారు.

సామాజిక సేవలోనూ..

ఫక్రుద్దీన్ తను బతుకుదానికి కమర్షియల్ ఫొటోగ్రాఫర్‌గా ఎదిగి, ఓ వైపు ఆర్ట్స్ ఫొటోగ్రఫీలో రాణిస్తూనే సామాజిక సేవలో తనకు సరిలేరెవ్వరని నిరూపించుకుంటున్నారు. వరంగల్ రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా రక్తదాన శిబిరాన్ని మరిపెడబంగ్లాలో ఏర్పాటు చేయించి వందల యూనిట్ల రక్తాన్ని ఫొటోగ్రాఫర్ల ద్వారా రెడ్‌క్రాస్‌కు అందచేసి అప్పటి ఉమ్మడి వరంగల్ కలెక్టర్ ఆమ్రపాలి చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. అలాగే పలు సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్నారు.







పతకాల పంట..

ఫక్రుద్దీన్‌కు ఆర్ట్స్ ఫొటోగ్రఫీలో పతకాల పంట పండింది. ఇప్పటి వరకు 10 బంగారు పతకాలు, 4 బ్రాంజ్ మెడల్స్, 15ఎఫ్ఐపీ రిబ్బన్స్ సాధించారు. దాంట్లో భాగంగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫొటోగ్రఫీలో ఆర్టిస్ట్ ఎఫ్ఐపీ డిస్టంక్షన్ పొందారు. అలాగే ఫెడరేషన్ మల్టీ కల్చరల్ ఫొటోగ్రఫిక్ ఆర్ట్ అమెరికా గౌరవ ఎక్స్‌లెన్స్ హానర్‌ను సాధించారు. ఈ మెడల్ డిసెంబరు 1న ఆయనకు ఆ సంస్థ విజయవాడలో అందజేయనుంది. ఇవే కాక మరో రెండు బంగారు పతకాలు దక్కించుకున్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషన్ ఎఫ్ఏపీ డీఎల్ ఆర్ట్స్ క్రియేషన్స్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో అనేక సంస్థలు నిర్వహించిన పలు పోటీల్లో పాల్గొని మరో ఐదు అవార్డు దక్కించుకున్నారు. మొట్టమొదటగా తెలుగు రాష్ట్రాల్లోని రాచకొండ ఫొటోగ్రఫీ పోటీల్లో పాల్గొని నగదు పారితోషికంతో పాటు సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నారు. కేరళ రాష్ట్రంలోని ఓ పోటీల్లో పాల్గొని బెస్ట్ అవార్డు అందుకున్నారు.



ఫక్రుద్దీన్ అందుకున్న పతకాలు



సైకిల్ కనుమరుగు.. ఉపాధి దేవుడెరుగు..

ఒకప్పుడు సైకిల్ అంటే సామాజిక హోదా. సైకిల్ ఉందంటే సమజాంలో ఓ గౌరవం ఉండేది. ఏ పనికి వెళ్లాలన్నా సైకిల్‌నే ఉపయోగించేవారు. అంతెందుకు పెళ్లి కుదిరిందంటే వధువు తల్లిదండ్రులు వరుడికి వరకట్నాల కింద సైకిల్, గడియారం లాంటి పెట్టేవారు. ఇక ఆ రోజుల్లో సైకిల్ ట్యాక్సీలు కూడా ఉండేవి. దాంతో నాడు సైకిల్ అద్దెకిచ్చే దుకాణాలు, పంక్చర్ షాపులు ఉండేవి. కానీ ఇప్పుడు వాహనాల వాడకం పెరగడంతో సైకిల్ తొక్కేవారి సంఖ్య బాగా తగ్గింది. ఒక వేళ వందలో ఒకరో ఇద్దరో సైకిల్ వినియోగించినా.. అవి కూడా ట్యూబ్‌లెస్ టైర్లవే ఉంటున్నాయి. దీంతో పంక్చర్ షాపుల వారికి ఉపాధి తగ్గిపోయింది. దాంతో వారిలో చాలామంది బైకుల టైర్లకు పంక్చర్లు వేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎంతైనా ఒకప్పటిలా గిరాకీ ఉండటం లేదని, తమ ఉపాధి ఎలాగో ఆ దేవుడికే తెలియాని పంక్చర్ షాపు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిగో ఇలా.. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ.. ఉపాధి కోసం ఎదురుచూస్తున్నారు. వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామంలో చిన్న పాటి పంక్చర్ షాపును నిర్వహిస్తున్న ఈ మెకానిక్ గిరాకీ కోసం ఎదురు చూస్తూ కనిపించాడు.

- వర్ధన్నపేట రూరల్, ఆంధ్రజ్యోతి

ఇథనాల్ ఫ్యాక్టరీని తరలిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

అక్కడే భోజనాలు చేశారు. చుట్టూ పక్కల గల మరో పది గ్రామాల రైతులు సైతం సంఘీభావం ప్రకటించి రాస్తా రోకోలో పాల్గొన్నారు. మంగళవారం రాస్తారోకో చేసిన రైతుల్లో కొందరిని పోలీసులు అరెస్టు చేశారన్న విషయం తెలుసుకున్న ఆందోళనకారులు.. పోలీసుల తీరును వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. కొంత మంది రైతులు తమ పిల్లలను వెంట తీసుకెళ్లి దిలావర్‌పూర్ పోలీసుస్టేషన్ వద్ద పురుగుల మందు డబ్బాలతో బైఠాయించారు. రైతుల ఆందోళనతో ఒక దశలో పరిస్థితి అదుపు తప్పే ప్రమాదం ఏర్పడింది. ఫలితంగా ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను నిలిపివేస్తున్నామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రకటించారు. రైతులు ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండటంతోనే పనులు నిలిపివేతపై నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. రైతుల అభిప్రాయాలను, వారి నిరసనలను.. ఇక్కడి పరిస్థితులపై నివేదిక తయారు చేసి సీఎంకు పంపినట్లు వెల్లడించారు. అయితే దిలావర్‌పూర్ నుంచి ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని పూర్తిగా తొలగిస్తామంటూ ప్రభుత్వం నుంచి లిఖితపూర్వకంగా హామీ లభిస్తే తప్ప ఆందోళన విరమించేది లేదని రైతులు స్పష్టం చేశారు. కలెక్టర్ అభిలాష అభినవ్ నోటి మాటగా ఇచ్చిన హామీపై తమకు విశ్వాసం లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం పరిస్థితి తీవ్రతను తగ్గించేందుకు ఇచ్చే ఇలాంటి హామీలు తమకు అవసరం లేదన్నారు. దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల ప్రజలు చేస్తున్న ఆందోళన తీవ్ర రూపం దాల్చడంతో నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల పరిస్థితిని ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదించారు. తర్వాత కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని రైతులతో సాయంత్రం కలెక్టరేట్‌లో సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ ఉద్దేశాన్ని వివరించారు. ఆందోళనలో భాగంగా రైతులపై పెట్టిన కేసులను కూడా ఎత్తివేయాలని రైతులు కోరగా ఎస్పీ సానుకూలంగా స్పందించారు. వెంటనే కలెక్టర్‌తో జరిగిన చర్చల వివరాలను సమావేశంలో పాల్గొన్న రైతులు దిలావర్‌పూర్ వద్ద ఆందోళన చేస్తున్న మహిళలకు, ఆయా గ్రామాల రైతులకు వివరించారు. ఆ వెంటనే ఎస్పీ కూడా దిలావర్‌పూర్‌కు చేరుకున్నారు. తప్పకుండా ఇథనాల్ పరిశ్రమ రద్దవుతుందని, ఇకపై వదంతులను నమ్మవద్దని కోరారు. మంత్రి సీతక్కతో ఫోన్‌లో మహిళలతో మాట్లాడించారు. ఆందోళన విరమించాలని దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల ప్రజలను మంత్రి కోరారు. ఇథనాల్ పరిశ్రమను ఇక్కడి నుంచి తరలించడమా, లేకుంటే రద్దు చేయడమా.. అన్న విషయమై ఏదో ఒకటి తప్పకుండా చేస్తామని మహిళలకు మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. ఇథనాల్ ఫ్యాక్టరీ, రైతుల ఆందోళనలపై ప్రభుత్వ వర్గాల్లో తీవ్ర చర్చ జరిగింది. ఫ్యాక్టరీ రద్దు చేసే అవకాశాలపైనా చర్చించారు. అనంతరం.. ఫ్యాక్టరీపై తదుపరి నిర్ణయం వెలువడే వరకు నిర్మాణ పనులను ఆపాలని సీఎస్ శాంతి కుమారిని ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వం నిర్ణయంతో దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామస్థుల సంబరాలు మిన్నంటాయి. పెద్ద ఎత్తున బాణసంచా పేల్చడంతో పాటు స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు.



రోడ్డుపైనే భోజనాలు చేస్తున్న మహిళా రైతులు

ఆ కంపెనీతో మాకు సంబంధంలేదు: తలసాని

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) నిర్మల్‌జిల్లాలో నిర్మించనున్న ఇథనాల్ కంపెనీ విషయంలో తమపై చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదని.. ఆ కంపెనీతో తమకు సంబంధం లేదని. మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇష్టారీతిన మాట్లాడటం సరికాదని కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి పేర్కొన్నారు. ఇథనాల్ కంపెనీలో తమకు భాగస్వామ్యం ఉన్నట్లు రుజువు చేస్తే ఆరోపణలు చేస్తున్న పార్టీకి, ఆ వ్యక్తులకే అప్పగిస్తానని చెప్పారు.

ఆర్డీవో నిర్బంధం గర్హనీయం

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ వెళ్లిన ఆర్డీవో రత్న కల్యాణిని ఆందోళనకారులు కారు నుంచి దిగకుండా సాయంత్రం వరకు నిర్బంధించడం గర్హనీయం అని డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు కె. చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాస్ ఖండించారు. ఇథనాల్ పరిశ్రమ పనులపై స్థానిక ప్రజల అభ్యంతరాల నేపథ్యంలో ఇరు వర్గాలతో చర్చించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు వెళ్లిన ఆర్డీవో పట్ల వ్యవహరించిన తీరు ఆమోద యోగ్యం కాదని, ప్రజాసేవకులైన అధికారులను చట్ట వ్యతిరేకంగా నిర్బంధించి వేధింపులకు పాల్పడటం తగదని పేర్కొన్నారు. ప్రజాక్షేత్రంలో పనిచేసే అధికారులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆర్డీవో అధికారిక వాహనాన్ని ధ్వంసం చేశారని, అప్రజాస్వామికంగా వ్యవహరించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సిర్పూర్ గజ గజ...

- 7.9డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు
- పలు జిల్లాల్లో 10డిగ్రీల లోపే
- ఉత్తర తెలంగాణలో తీవ్రత అధికం

హైదరాబాద్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, రంగారెడ్డి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలోని పలు ప్రాంతాల్లో అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొద్ది రోజులుగా అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్న ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో పరిస్థితి మరింత దిగజారింది. మంగళవారం రాత్రి అక్కడ ఉష్ణోగ్రతలు 7.9డిగ్రీల కనిష్ఠానికి పడిపోయాయి. మరోవైపు ఆదిలాబాద్ జిల్లాలో చలి వణకు పుట్టిస్తోంది. జిల్లాలోని భీంపూర్ మండలం అర్లి(టి)లో 9.2డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే జైనథ్, బేల, నేరడిగొండ, మావల, బోథ్ తదితర ప్రాంతాల్లో 10డిగ్రీల దిగువకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. అటు రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల జిల్లాల్లోనూ 10-12డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో చలి తీవ్రత కొనసాగుతోంది. పలు మండలాల్లో ఉష్ణోగ్రతలు 10డిగ్రీల లోపే ఉన్నాయి. కాగా, రాబోయే మూడు రోజుల్లో తెలంగాణ అంతటా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 8-14 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉత్తర తెలంగాణలో ప్రభావం మరింత ఉంటుందని పేర్కొంది. ఈ నేపథ్యంలోనే కొన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, మిగిలిన జిల్లాలకు యెల్లో అలర్ట్ జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ కేంద్రం సూచించింది.

బీఆర్ఎస్ హయాంలోనే ఇథనాల్ ఫ్యాక్టరీకి అనుమతులు

- ఆ కంపెనీలో తలసాని కుమారుడే డైరెక్టర్
- నిలదీయాల్సింది బీఆర్ఎస్ వారినే: మహేశ్ గౌడ్
- మహబూబ్‌నగర్ రైతు సభపై నేతలతో భేటీ

హైదరాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో పీఎంకే డిస్టిలేషన్‌కు ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు అనుమతినిచ్చింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. అప్పటి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కుమారుడు.. కిరణ్‌యాదవ్ ఆ కంపెనీలో డైరెక్టర్‌గా ఉన్నారన్నారు. ఇందులో కాంగ్రెస్ సర్కారుకు ఏం సంబంధమని ప్రశ్నించారు. బుధవారం గాంధీభవన్‌లో మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. ఇథనాల్ కర్మాగారానికి సంబంధించి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఆ కర్మాగారానికి సంబంధించి అన్ని అనుమతులు బీఆర్ఎస్ సర్కారు హయాంలోనే ఇచ్చారన్నారు. ఆ వివరాలను మీడియాకు చూపారు. అసలు ఈ ప్రాజెక్టుకు అంకురార్పణ చేసి రైతుల్ని ముంచాలని చూసిందే కేసీఆర్, కేటీఆర్ అని విమర్శించారు. బీఆర్ఎస్ నేతల్ని నిలదీయాలంటూ దిలావర్‌పూర్ రైతులకు పిలుపునిచ్చారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఈనెల 30న మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న రైతు సభపై మహేశ్ గౌడ్.. జూమ్ ద్వారా పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. నభూతో న భవిష్యత్తు అన్న విధంగా సభ జరగాలన్నారు. ప్రతి గ్రామం నుంచి సభకు రైతుల్ని తరలించాలంటూ సూచించారు. సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తదితర నేతలు పాల్గొన్నారు. ఇప్పటివరకు చేపట్టిన వ్యవసాయ సంక్షేమ కార్యక్రమాలను మహబూబ్‌నగర్‌లో జరిగే రైతు సదస్సులో వివరించనున్నట్లు తుమ్మల తెలిపారు. గురువారం మహబూబ్‌నగర్‌లో భారీ ఎత్తున వ్యవసాయ ప్రదర్శన ఉంటుందన్నారు. అలాగే ఈ మూడ్రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులనూ నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులే కార్యక్రమాలను చూసుకోవాలన్నారు. కాగా, నిజామాబాద్, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సన్నద్ధతపై ఆయా జిల్లాల నేతలతో గురువారం గాంధీ భవన్‌లో మహేశ్ గౌడ్ సమీక్ష నిర్వహించనున్నారు.



ప్రసాద్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం జిల్లా సీపీఐ కార్యదర్శి పోటు ప్రసాద్ మృతి

- తెల్లవారుజామున వాకింగ్ చేస్తుండగా గుండెపోటు
- మంత్రి పొంగులేటి నివాళి.. కూనంనేని కంటతడి



పోటు ప్రసాద్

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) ఖమ్మం జిల్లా సమితి కార్యదర్శి పోటు ప్రసాద్(64) బుధవారం హఠాన్మరణం చెందారు. స్నేహితులతో కలిసి తెల్లవారుజామున నగరంలోని లకారం ట్యాంక్‌బండ్‌పై వాకింగ్ చేస్తుండగా గుండెపోటు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. హుటాహుటిన ఆయన్ను ఆస్పత్రికి తరలించగా అప్పటికే ప్రసాద్ మరణించినట్లు వైద్యులు తెలిపారు. కాగా, సీపీఐ కార్యాలయంలో ఉంచిన పోటు ప్రసాద్ భౌతికకాయానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు తదితరులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు కంటతడి పెట్టారు. కామ్రేడ్ పోటు ప్రసాద్ ఆకస్మిక మరణం పార్టీకి, వ్యక్తిగతంగా తీరని లోటు అని కూనంనేని అన్నారు. ఖమ్మంలో పార్టీ బలోపేతానికి కృషి చేశారని, భూ పోరాటాల్లో పోలీసుల లాఠీ దెబ్బలనూ లెక్కచేయకుండా ప్రజల కోసం పోరాడారని ప్రసాద్ సేవలను కొనియాడారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రేణుకా చౌదరి తదితరులు ప్రసాద్ మృతి పట్ల సంతాపం ప్రకటించారు.

'తానా' నిధుల మళ్లింపుపై ఫిర్యాదు

- మాజీ కోశాధికారి శ్రీకాంత్ పోలవరపుపై ఎఫ్‌బీఐకి

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అగ్రరాజ్యం అమెరికాలో తెలుగువారి ప్రతిష్ఠాత్మక సంఘంలో ఆర్థిక కుంభకోణాలు వెలుగులోకి వస్తున్నాయి. లక్షకు పైగా సభ్యులున్న తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా)లో గత పదిహేనేళ్లుగా అనేక ఆర్థిక అవకతవకలు జరిగాయంటూ అమెరికా అత్యున్నత దర్యాప్తు సంస్థ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ)కు ఫిర్యాదు అందింది. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలంటూ తానా సభ్యులు కోరారు. గతంలో కోశాధికారిగా ఉన్న శ్రీకాంత్ పోలవరపు రూ.25 కోట్ల తానా ఫౌండేషన్ నిధులను తన సొంత కంపెనీలోకి బదిలీ చేసుకున్నారన్న విషయాన్ని తానా పాలకవర్గం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదే ప్రధానాంశంగా ఫిర్యాదు చేశారు. తానా ఫౌండేషన్‌కు చెందిన 37 లక్షల డాలర్లను శ్రీకాంత్.. టెక్సాస్‌లోని తన సొంత కంపెనీ బ్రిహత్ టెక్నాలజీస్‌లోకి మళ్లించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిధుల దుర్వినియోగంతోపాటు వేలాది మంది ఉన్న తానా సభ్యులను శ్రీకాంత్ మోసగించారని అందులో పేర్కొన్నారు. దీంతోపాటు గత పదిహేనేళ్లుగా తానాలో అనేక ఆర్థిక అవకతవకలు జరిగాయని కూడా ఫిర్యాదులో ప్రస్తావించారు. మ్యాచింగ్ గ్రాంట్ కుంభకోణం, మనీలాండరింగ్, ఇతర ఆర్థిక నేరాలు సైతం జరిగాయన్నారు. ఆర్థిక అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని తానా సభ్యులు అందించిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

దేవాదుల ప్రధాన కాలువ లైనింగ్‌కు అనుమతి

- రూ.148 కోట్లతో పనులు.. జీవో జారీ

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేవాదుల ఎత్తిపోతల పథకం రెండో దశలో భాగంగా ఆర్.ఎస్.ఘన్‌పూర్ ప్రధాన కాలువ సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులకు రూ.148.76 కోట్లతో పరిపాలన అనుమతినిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వరంగల్ జిల్లా ఆర్.ఎస్.ఘన్‌పూర్ మండలంలో ప్రధాన కాలువ 12.650 కిలోమీటర్ల నుంచి 31.20 కిలోమీటర్ల దాకా సీసీ లైనింగ్‌తో పాటు క్రాస్ డ్రైనేజీ పనులను చేపట్టనున్నారు. ఈ మేరకు బుధవారం నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా జీవో జారీ చేశారు.

మళ్లీ రంగంలోకి హైడ్రా!

ఫిర్యాదుల నేపథ్యంలో చెరువుల పరిశీలన

- గ్రేటర్‌తోపాటు శివార్లలోని చెరువుల సందర్శన
- ఆక్రమణలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చిన స్థానికులు
- షెడ్ల తొలగింపునకు రంగనాథ్ ఆదేశం
- చెరువులను కబ్జా చేస్తే విడిచిపెట్టబోమని హెచ్చరిక



నార్సింగ్‌లోని నెక్నాంపూర్ చెరువును పరిశీలిస్తున్న రంగనాథ్

హైదరాబాద్ సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చెరువుల ఆక్రమణలపై ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా మరోసారి రంగంలోకి దిగింది. గ్రేటర్‌తోపాటు శివారు ప్రాంతాల్లోని పలు చెరువులను కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. నివాసేతర ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని, వెంటనే తొలగించాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి మాదాపూర్‌లోని ఖానామెట్ సర్వే నెంబర్ 7లో 6.5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈదులకుంటను ఓ రియల్ ఎస్టేట్ సంస్థ మట్టితో పూడుస్తుందన్న ఫిర్యాదుతో అక్కడకు వెళ్లిన రంగనాథ్.. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరోసారి ఈదులకుంటను పరిశీలిస్తానని, నిర్మాణదారుల వద్ద ఉన్న డాక్యుమెంట్లు, సర్వే నివేదికను పరిశీలిస్తానన్నారు. మాదాపూర్‌లోని మేడికుంటను కూడా ఆయన పరిశీలించారు. మెజార్టీ కుంట మాయమై ఇప్పటికే అక్కడ బహుళ అంతస్తుల భవనాలు వెలిశాయి. నిజాంపేటలోని తలాబ్ (తురక లేక్) చెరువు ఆక్రమణల వివరాలను స్థానికులు కమిషనర్ రంగనాథ్‌కు వివరించారు. చెరువుకు సంబంధించిన మ్యాపులు, డాక్యుమెంట్లను ఆయన పరిశీలించారు. ఇదే చెరువు వద్ద నిజాంత ల్యాబ్‌ను కూడా పరిశీలించారు. కట్టకు ఆనుకుని ఉన్న షెడ్లను రెండు రోజుల్లో తొలగించాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కట్టపైకి వెళ్లిన కమిషనర్ చెరువులోకి ఇన్‌లెట్ ద్వారా వస్తోన్న మురుగునీటిని చూసి చెరువంతా కలుషితమవుతుందని, మళ్లింపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో చెరువుకు సంబంధించి సమగ్ర సర్వే చేయాలన్నారు. బండారి లే అవుట్ కమ్యూనిటీ అసోసియేషన్ సభ్యుల కోరిక మేరకు చెరువును పరిశీలించారు. నార్సింగ్‌లోని నెక్నాంపూర్ చిన్న చెరువును పరిశీలించిన ఆయన బఫర్ జోన్‌లో నిర్మాణాల వివరాలు తెలుసుకున్నారు. గేటెడ్ కమ్యూనిటీలోని మురుగు నీరు చెరువులో చేరుతుందని స్థానికులు ఫిర్యాదు చేశారు. తెల్లాపూర్‌లోని వనం, చెల్లికుంట, మేళ్ల చెరువులను ఆయన పరిశీలించారు. సుందరీకరణ పేరిట రియల్ కంపెనీలు కబ్జా చేస్తున్నాయని, చెరువులను పునరుద్ధరించాలని స్థానికులు కోరారు. రంగనాథ్ మాట్లాడుతూ.. ఇక నుంచి చెరువులు కబ్జా కాకుండా నియంత్రిస్తామని, పునరుద్ధరణకూ చర్యలు తీసుకుంటామన్నారు. డాక్యుమెంట్లు, సర్వే నివేదికలను పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలుంటాయని కమిషనర్ పేర్కొన్నారు.

చెరువుల సమగ్ర విచారణకు త్వరలో మళ్లీ వస్తా : రంగనాథ్

సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలంలోని తెల్లాపూర్ మేళ్లచెరువును కూడా హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. మేళ్ల చెరువు కట్టపై నుంచి ఏలియన్స్, నెవీ గార్డెన్, సంకల్ప, ఇండస్ట్రస్ట్, ఎన్‌సీసీ క్లబ్ హౌస్‌లు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నాయని అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కొల్లూరు పెద్ద చెరువులోకి వెళ్లే వరద కాలువను ఓ బిల్డర్ పూడ్చివేశారన్నారు. కొల్లూరు నుంచి మేళ్ల చెరువులోకి వచ్చే వరద కాలువను 177 సర్వే నంబరులో పూడ్చి వేసి పట్టాదారు తన భూమిలో కలుపుకున్నారని, ఈ వరద కాలువ కోసం ప్రభుత్వం 1.6 ఎకరాల భూమిని విడిచిపెట్టిందన్నారు. కమిషనర్ మాట్లాడుతూ చెరువుల సమగ్ర విచారణకు త్వరలో మళ్లీ వస్తానని, అధికారులు అన్ని రికార్డులతో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. చెరువులను కబ్జా చేశారని నిర్ధారణ అయితే ఎవరిని విడిచిపెట్టేది లేదన్నారు.

తెలంగాణ ప్రభుత్వము

కలెక్టర్ భద్రాద్రి కొత్తగూడెం వారి ప్రాథమిక నోటిఫికేషన్

ఫారం -6

భూ సేకరణ పునరుపాది కల్పనలో పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం - 2013

చట్టం- 30/2013 లోని సెక్షన్ 11(1) మరియు సబ్ రూల్ -1 రూల్ 19 ప్రకారం

రెవిన్యూ డివిజనల్ అధికారి,భద్రాచలం మరియు భూసేకరణ అధికారి, భద్రాచలం. ఆర్.సి.నెం.సి /1273/2024. తేది: 08/11/2024

జిల్లా కలెక్టర్ భద్రాద్రి కొత్తగూడెం గారి ఉత్తర్వులు: G/1072 /2024. తేది: 21/11/2024

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాజ పత్రము నెం: B3/ 32 /2024. తేది: 22/11/2024

తెలంగాణా ప్రభుత్వము/జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం ఆదేశానుసారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం మండలము, భద్రాచలం గ్రామంలో ఉన్న భూమి విస్తీర్ణం ఎ.0.32 1/2 గుంటల ప్రజా ప్రయోజనం నిమిత్తం అనగా భద్రాచలం పట్టణం లో పర్యాటక మరియు మౌళిక సదుపాయాల అభివృద్ధి పనులకు సంబంధించి ఈ దిగువ చూపిన భూమి అవసరమై ఉన్నదని భావించి నందున భూసేకరణ, పునరావాసము పునః నిర్మాణం కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 30/2013 లోని సెక్షన్ 11/(1) అనుసరించి ప్రకటన జారీచేయనైనది.

భూసేకరణ వల్ల కొన్ని కుటుంబాలు నిర్వాసితులవుతున్నారు. నిర్వాసిత కుటుంబాల పునరావాస, పునః నిర్మాణం అంశాలకు అదనపు కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం వారు భద్రాచలం పట్టణం లో పర్యాటక మరియు మౌళిక సదుపాయాల అభివృద్ధి పనులకు సంబంధించి అడ్మినిస్ట్రేటర్ గా నియమించబడినారు. కావున భద్రాచలం పట్టణం లో పర్యాటక మరియు మౌళిక సదుపాయాల అభివృద్ధి పనులకు సంబంధించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం మండలము భద్రాచలం రెవిన్యూ గ్రామంలోని విస్తీర్ణం ఎ.0.32 1/2 గుంటలు గల భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీ చేయనైనది.

షెడ్యూల్

గ్రామము:: భద్రాచలం మండలము :: భద్రాచలం జిల్లా:: భద్రాద్రి కొత్తగూడెం

క్ర.సంఖ్య	సర్వే. నెం. (సబ్ డివిజన్ ప్రకారం)	సర్వే. నెం. (పహాణీ ప్రకారం)	భూమి యాజమాన్యం	భూమి యొక్క రకం (మెట్ట/తరి)	ఎంజాయిమెంట్ సర్వే విస్తీర్ణం / చ.గ.	పట్టాదారు పేరు	అనుభవదారు పేరు	చెట్లు/ కట్టడముల వివరములు
1	2	3	4		5	6	7	8
1	121/13 /P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	168.59	గ్రామకంఠం	మందరపు వీర వెంకట సత్యనారాయణ చారి తండ్రి వీరాజు (లేటు)	రేకుల షెడ్డు-1 & బిల్డింగ్-1
2	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	139	గ్రామకంఠం	మందరపు సుందరి కుమారి భర్త. రాజు	బిల్డింగ్ & ఖాళీ స్థలం
3	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	119	గ్రామకంఠం	గొట్టుపుల్ల శశికళ దేవి భర్త. షటగోపం వెంకటరమణ	బిల్డింగ్
4	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	94.83	గ్రామకంఠం	షటగోపం సుదర్శన్ తండ్రి. పురుషోత్తమ చార్యులు (లేటు)	బిల్డింగ్ & ఖాళీ స్థలం
	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట			షటగోపం రవి కుమార్ తండ్రి. పురుషోత్తమ చార్యులు (లేటు)	
5	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	50.31	గ్రామకంఠం	మల్లెల పార్వతి భర్త. వెంకట శ్రీనివాస్	బిల్డింగ్
6	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	41.20	గ్రామకంఠం	రామవజ్జల నాగ వెంకట శ్రీనివాస రావు తండ్రి. ఆర్.వి.యస్. ప్రభాకర్ రావు	రేకుల షెడ్డు
7	121/13/P /B1	121/13P	ప్ర.భూ	మెట్ట	99.66	గ్రామకంఠం	రామవజ్జల వెంకట వీరభద్రరావు తండ్రి. ప్రభాకర్ రావు	బిల్డింగ్
8	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	185.79	గ్రామకంఠం	శ్రీ పాద పద్మిని	బిల్డింగ్
	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట			ధనకొండ మహాలక్ష్మి భర్త. దాను	
9	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	170.00	గ్రామకంఠం	పోటు విద్యులత భర్త. వెంకటరావు	బిల్డింగ్ & ఖాళీ స్థలం
10	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	138.48	గ్రామకంఠం	గోగినేని జానకి భర్త. రంగ రవీంద్ర ప్రసాద్ (లేటు)	బిల్డింగ్
11	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	178.70	గ్రామకంఠం	మంత్రి లక్ష్మి ముత్తేశ్వరి భర్త. మారుతి (లేటు) అడ్డగుడురు లలిత భర్త. రమేష్	బిల్డింగ్
12	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	115.11	గ్రామకంఠం	కామవరపు వెంకట సుబ్రమణ్య శర్మ తండ్రి. భైరవ మూర్తి (లేటు)	బిల్డింగ్
13	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	142.58	గ్రామకంఠం	పొడిచేటి సీతారామనుజా చార్యులు తండ్రి. రామకృష్ణ చార్యులు (లేటు)	బిల్డింగ్
14	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	58.38	గ్రామకంఠం	పొడిచేటి రంగాచార్యులు తండ్రి. సాయన్న చార్యులు (లేటు)	బిల్డింగ్
15	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	10.83	గ్రామకంఠం	పొడిచేటి లక్ష్మితయారు భర్త. యోగానంద నరసింహ చార్యులు (లేటు)	బిల్డింగ్
16	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	80.00	గ్రామకంఠం	పొడిచేటి జగన్నాథ చార్యులు తండ్రి శేషాచార్యులు (లేటు)	బిల్డింగ్
17	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	66.66	గ్రామకంఠం	ధనకొండ విజయలక్ష్మి భర్త.రాము	బిల్డింగ్
18	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	161.85	గ్రామకంఠం	చక్కా సుదర్శన్ తండ్రి. వెంకట సుబ్బారావు (లేటు)	బిల్డింగ్ + పెంకిటిల్లు
	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట			చక్కా సాయిరాం చందర్ తండ్రి. వెంకటసుబ్బారావు (లేటు)	
19	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	33.77	గ్రామకంఠం	చక్కా సుదర్శన్ తండ్రి. వెంకట సుబ్బారావు (లేటు)	RCC మరుగు దొడ్డు
	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట			చక్కా సాయిరాం చందర్ తండ్రి. వెంకటసుబ్బారావు (లేటు)	
	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట			చక్కా సుజాత తండ్రి సాయిబాబా (లేటు)	
20	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	81.7	గ్రామకంఠం	సురే అనంత వెంకట ధనలక్ష్మి దేవి భర్త. వెంకట చెంచు సుబ్బారావు	రేకుల షెడ్డు
21	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	37.77	గ్రామకంఠం	గాదే వెంకటరత్నం భర్త. శంకర్ రెడ్డి	రేకుల షెడ్డు
22	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	61.30	గ్రామకంఠం	కంభంపాటి సుశీల భర్త. బసవయ్య (లేటు)	రేకుల షెడ్డు
23	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	73.95	గ్రామకంఠం	వేమిరెడ్డి నారాయణమ్మ భర్త. లింగారెడ్డి(లేటు)	రేకుల షెడ్డు
24	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	91.31	గ్రామకంఠం	ఉదత రమేష్ తండ్రి. వెంకటేశ్వర రావు (లేటు)	బిల్డింగ్
25	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	33.21	గ్రామకంఠం	చారుగుండ్ల వెంకట రామారావు తండ్రి. సీతారామ స్వామి (లేటు)	బిల్డింగ్
26	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	28.00	గ్రామకంఠం	చిరునోముల రమాదేవి భర్త. వెంకటేశ్వర్లు (లేటు)	బిల్డింగ్
27	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	33.94	గ్రామకంఠం	ఉదత శ్రీనివాస్ తండ్రి. గోపయ్య (లేటు)	బిల్డింగ్
	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట			ఉదత రామకృష్ణ తండ్రి. గోపయ్య (లేటు)	
28	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	86.66	గ్రామకంఠం	చక్కా సుదర్శన్ తండ్రి. వెంకట సుబ్బారావు (లేటు)	పెంకిటిల్లు, ఖాళీ స్థలం
	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట			చక్కా సాయి రామ్ చందర్ తండ్రి వెంకటసుబ్బారావు (లేటు)	
29	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	98.61	గ్రామకంఠం	చక్కా సాయి సుభాష్ చంద్ర బోస్ తండ్రి సుదర్శన్ దాసు	ఖాళీ స్థలం
30	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	56.09	గ్రామకంఠం	హరినాథ బాబా దేవాలయం	ఖాళీ స్థలం
31	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	28.00	గ్రామకంఠం	ఖాళీ ప్రదేశం	ఖాళీ స్థలం
32	121/13/ P/B1	121/13P	ప్ర.భూ	మెట్ట	865.15	గ్రామకంఠం	గతంలో ఉన్న CC రోడ్డు	-
33	121/13/ P/B2	121/13P	ప్ర.భూ	మెట్ట	10.11	గ్రామకంఠం	పంజా సునీల్ తండ్రి. రాజేష్	రేకులు ఇల్లు
34	121/13/ P/B2	121/13P	ప్ర.భూ	మెట్ట	26.86	గ్రామకంఠం	పత్రీ లక్ష్మి భర్త. నారాయణరావు	రేకులు ఇల్లు
	121/13/ P/B2	121/13P	ప్ర.భూ	మెట్ట	15.88	గ్రామకంఠం	పవిత్ర కమలమ్మ భర్త. వీరయ్య	రేకులు ఇల్లు
35	121/13/ P/B2	121/13P	ప్ర.భూ	మెట్ట	18.48	గ్రామకంఠం	దానన రామకృష్ణ తండ్రి రాములు	రేకులు ఇల్లు
36	121/13/ P/B2	121/13P	ప్ర.భూ	మెట్ట	27.4	గ్రామకంఠం	ఏలూరి రాఘవమ్మ భర్త. పాపారావు	రేకులు ఇల్లు
37	121/13/ P/B2	121/13P	ప్ర.భూ	మెట్ట	29.53	గ్రామకంఠం	చింతలపూడి కొండమ్మ భర్త.నాగరాజు	రేకులు ఇల్లు
38	121/13/ P/B2	121/13P	ప్ర.భూ	మెట్ట	26.46	గ్రామకంఠం	పలాడి అనురాధ భర్త. శ్రావణ్ కుమార్	రేకులు ఇల్లు
39	121/13/ P/B2	121/13P	ప్ర.భూ	మెట్ట	32.62	గ్రామకంఠం	నాగులపల్లి నరసింహారావు తండ్రి. చిన్నయ్య	రేకులు ఇల్లు
40	121/13/ P/B2	121/13P	ప్ర.భూ	మెట్ట	28.86	గ్రామకంఠం	సింగదాల రజిని భర్త. రామారావు	రేకులు ఇల్లు
41	121/13/ P/B2	121/13P	ప్ర.భూ	మెట్ట	28.86	గ్రామకంఠం	సింగదాల సత్యనారాయణ తండ్రి సాయిబాబా	రేకులు ఇల్లు
42	121/13/ P/B2	121/13P	ప్ర.భూ	మెట్ట	27.7	గ్రామకంఠం	సింగదాల రామకృష్ణ తండ్రి సాయిబాబా	రేకులు ఇల్లు
43	121/13/ P/B2	121/13P	ప్ర.భూ	మెట్ట	8.08	గ్రామకంఠం	CC రోడ్	-
44	121/13/ P/B2	121/13P	ప్ర.భూ	మెట్ట	21.66	గ్రామకంఠం	గతంలో ఉన్న CC రోడ్డు	-
	మొత్తం				3932.93			
	మొత్తం చదరపు గజములు				3932.93			
	మొత్తం విస్తీర్ణం య.గు.				0.32 1/2			

ABSTRACT

క్రమ. సంఖ్య	భూమి స్వభావం	విస్తీర్ణం (య.గుం)	క్రమ. సంఖ్య	మరియు వివరములు	కట్టడములు సంఖ్య
1	పట్టా భూమి	0.00	1	రేకుల షెడ్డు / ఇల్లు	18
2	ప్రభుత్వ భూమి	0.32 1/2	2	బిల్డింగ్	25
	మొత్తం	0.32 1/2	3	పెంకిటిల్లు	1
			4	ఆర్.సి.సి. మరుగు దొడ్డి	1
				మొత్తం	45

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణ భూనిర్వాసితుల పునరావాసం మరియు పునఃనిర్మాణ చట్టం, 2013 (నెం.30/2013 సెక్షన్ 11(1) ప్రకారం సంబంధిత భూ యజమానులకు సరియైన భూ నష్టపరిహారం చెల్లించుటకుగాను నోటిఫికేషన్ జారీ చేయనైనది. భూమియొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మరియు భూసేకరణ అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, భద్రాచలం గారి కార్యాలయంలో ఉంచనైనది సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకోవచ్చును.

తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారు, భూసేకరణ అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, భద్రాచలం గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్ 12 ప్రకారం పై తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయంలో జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీ చేసిన తేదీ నుండి ఆప్రకటనలో ఉదాహరింపబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకం, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూసేకరణ విషయంలో సంబంధించిన భూ యజమానులు ఏదైనా అభ్యంతరములున్న యెడల చట్టంలోని 15వ విభాగం ప్రకారం జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ రెవిన్యూ డివిజనల్ అధికారి, భద్రాచలం వారికి ఇట్టి ప్రకటన జారీ చేసిన (60) దినములలోపల ఏదైనా అభ్యంతరములున్న యెడల తమ అభ్యంతరములు లిఖిత పూర్వకంగా తెలియచేయవలసి ఉన్నది.

సం/- శ్రీ కె. దామోదర్ రావు, భూసేకరణ అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, భద్రాచలం.

సం/- శ్రీ డి. వేణుగోపాల్, అదనపు కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సం/- శ్రీ జితేష్ వి. పాటిల్, జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.

DIPR No. 392/LA/PP-Agency/2024-25

బీఆర్‌ఎస్ గురుకుల బాట: కేటీఆర్

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చోటుచేసుకుంటున్న వరుస మరణాలు, విషాద ఘటనల నేపథ్యంలో అక్కడి పరిస్థితులు తెలుసుకునేందుకు గురుకుల బాట పేరిట ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నట్లు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఈ నెల 30 నుంచి డిసెంబరు 7 వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకుగాను ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో అయిదుగురు సభ్యులతో అధ్యయన కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆయనతోపాటు సభ్యులుగా ఆంజనేయులు గౌడ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, రాజారామ్ యాదవ్, వాసుదేవరెడ్డి ఉంటారన్నారు. బాలికల విద్యా సంస్థలను పార్టీ తరపున మహిళా నాయకులు సందర్శిస్తారన్నారు. అక్కడి స్థితిగతులు, సౌకర్యాలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, చేపట్టాల్సిన చర్యలపై ఈ కమిటీ అధ్యయనం చేసి నివేదిక ఇస్తుందన్నారు. కమిటీ గుర్తించిన సమస్యలు, పరిష్కారాలను ప్రభుత్వానికి సూచిస్తామని, వెంటనే స్పందించకుంటే ఒత్తిడి తెచ్చేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. తాము రాజకీయం చేయాలని ప్రయత్నించడం లేదని, కమిటీ నివేదికలోని అంశాలను శాసనసభలో లేవనెత్తుతామని తెలిపారు.

మూడేళ్లలో నషా ముక్త్ తెలంగాణ

» త్వరలో 2 లక్షల మంది డ్రగ్స్ వ్యతిరేక సైనికులు

» టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతో వచ్చే మూడేళ్లలో రాష్ట్రంలో డ్రగ్స్‌ను కట్టడి చేస్తామని తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో (టీజీ న్యాబ్) డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. త్వరలో 2 లక్షల మంది 'యాంటీ డ్రగ్ సోల్జర్స్'ను తయారు చేస్తామని చెప్పారు. 'నషా ముక్త్ తెలంగాణ' కోసం టీజీ న్యాబ్, పోలీసులు, ఇతర దర్యాప్తు సంస్థలకు అన్ని విభాగాలు, ప్రజల సహకారం అవసరమని కోరారు. 'యువతలో మాదకద్రవ్యాల వినియోగం, నివారణ, అవగాహన, పునరావాసం' అంశంపై విద్యా సంస్థలు, ఐటీ కంపెనీల నిర్వాహకులకు టీజీ న్యాబ్ ఆధ్వర్యంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. బుధవారం రాష్ట్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు యూనివర్సిటీలు, కళాశాలల సిబ్బంది హాజరయ్యారు. సందీప్ శాండిల్య వారికి పలు అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ కోఆర్డినేటర్లపై ఉందని చెప్పారు. మార్కెట్‌లోకి రోజుకో కొత్తరకం డ్రగ్ వస్తోందని, నిటాజిన్ అనే డ్రగ్ ఒక్క గ్రామ్ 40 కేజీల ఓపీఎంతో సమానమైందంటే దాని తీవ్రత ఎంత ఉంటుందో అర్థం చేసుకోవచ్చని చెప్పారు.

అప్పటి వరకు టాపర్.. ఒక్క రోజులో..

డ్రగ్స్ దుష్ప్రభావాల గురించి వివరిస్తూ సందీప్ శాండిల్య తన దృష్టికి వచ్చిన ఒక ఘటనను తెలిపారు. "ఓ ఇంజనీరింగ్ విద్యార్థిని మొదటి మూడేళ్లు అన్ని సబ్జెక్టుల్లో టాపర్‌గా నిలిచింది. ఓ రోజు స్నేహితుడు పుట్టిన రోజు పార్టీకి ఆహ్వానించడంతో అందరితో కలిసి వెళ్లిన అమ్మాయి అక్కడ సరదాగా డ్రగ్స్ తీసుకుంది. బాగుండటంతో రెండో రోజు కూడా అడిగి తీసుకుంది. ఇలా మొదట కొన్ని రోజులు ఫ్రీగా ఇచ్చినా ఆ తర్వాత ఒక్కో గ్రాం రూ.7 వేలకు విక్రయించారు. మొదట తన వద్ద ఉన్న బంగారం విక్రయించిన అమ్మాయి.. ఆ తర్వాత దొంగతనం చేయడం మొదలుపెట్టింది. చివరికి డ్రగ్స్ కోసం వ్యభిచారం చేసే స్థాయికి దిగజారింది. కుటుంబ సభ్యుల సహకారంతో మత్తు నుంచి బయటపడింది'ని చెప్పారు.

2019లోనే 5వ స్థానంలో తెలంగాణ

సామాజిక న్యాయ శాఖ 2019 నివేదిక ప్రకారం.. ఇంజక్షన్ల రూపంలో నేరుగా రక్తంలోకి డ్రగ్స్ తీసుకుంటున్న వారి సంఖ్యపరంగా (64 వేల మంది) దేశంలో తెలంగాణ 5వ స్థానంలో ఉంది. సైకోయాక్టివ్ రకం డ్రగ్ వినియోగం విషయంలో 3వ స్థానంలో నిలిచింది. 2.4 లక్షల మంది ఈ డ్రగ్ బారిన పడినట్లు నివేదిక పేర్కొంది. కొకైన్ వాడకంలో 10వ స్థానం, గంజాయి, చరస్ వాడకంలో తెలంగాణ 28వ స్థానంలో ఉన్నట్లు తేలింది.

'మధ్యాహ్న భోజనం' ధరల పెంపు



» ప్రాథమిక పాఠశాలలో ఒక్కో విద్యార్థికి రూ.6.19

» ప్రాథమికోన్నత పాఠశాలల్లో రూ.9.29

» 1 నుంచి పెంచిన ధరలు అమల్లోకి

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం ధరలను పెంచారు. స్కూల్ స్థాయిని బట్టి 74 పైసల నుంచి రూ.1.12కు వరకు పెంచారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. పెంచిన ధరలను రాష్ట్రంలో కూడా అమలు చేయనున్నారు. ఇందుకయ్యే వ్యయంలో 60 శాతం కేంద్రం, 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు భరించనున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఉచిత మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకానికి ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి రూ.5.45, ప్రాథమికోన్నత పాఠశాలల్లో రూ.8.17 చొప్పున చెల్లిస్తున్నారు. ఈ ధరలను రూ.6.19కి, రూ.9.29కి పెంచాలని నిర్ణయించారు. ప్రాథమిక పాఠశాలల్లో 74 పైసలు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో రూ.1.12 చొప్పున పెంచారు. పెంచిన ధరలను డిసెంబరు 1 నుంచి అమలు చేయనున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు అన్నం-కూర, అన్నం-ఆకు కూర పప్పు, వెజిటబుల్ బిర్యానీ వంటి వాటిని అందిస్తున్నారు. దీంతో పాటు వారానికి మూడు సార్లు కోడి గుడ్డును కూడా ఇస్తున్నారు. గుడ్డు కోసం అదనంగా రూ.5 చెల్లిస్తున్నారు. ఈ పథకానికి అవసరమయ్యే బియ్యాన్ని కూడా ప్రభుత్వమే సరఫరా చేస్తోంది. కూరగాయలు, ఇతర వంట సామగ్రి కోసం ఒక్కో విద్యార్థికి రూ.5.45, రూ.8.17 చొప్పున చెల్లిస్తున్నారు. ఇవి సరిపోవడం లేదంటూ ఎప్పటి నుంచో మధ్యాహ్న భోజన వర్కర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ధరలను పెంచారు. పెంచిన ధరల ప్రకారం విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండే పాఠశాలల్లో పర్వాలేదు కానీ, సంఖ్య తక్కువగా ఉంటే.. ఇబ్బందికర పరిస్థితి ఉందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా విద్యార్థుల సంఖ్య 50లోపు ఉన్న స్కూళ్లలో ప్రభుత్వం చెల్లించే ధరలు సరిపోవనే వాదన ఉంది.

గుడ్డు ధరలు చాలట్లే..

విద్యార్థులకు భోజనంలో ఇస్తున్న గుడ్డుకు చెల్లిస్తున్న ధరలు మార్కెట్ ప్రకారం లేవనే ఆందోళన వ్యక్తం అవుతోంది. మార్కెట్‌లో ఒక్కో గుడ్డు ధర రూ.6 వరకు ఉండగా ప్రభుత్వం రూ.5 చొప్పున చెల్లిస్తోందని వాపోతున్నారు. మధ్యాహ్న భోజనం వండి, వడ్డించే వర్కర్లకు ఇచ్చే భత్యాలు కూడా సరిపోవడం లేదంటున్నారు. ప్రస్తుతం వంద లోపు విద్యార్థులుండే పాఠశాలల్లో ఒక వంట మనిషి, ఒక హెల్పర్‌కు ఒక్కొక్కరికి రూ.3 వేలు చెల్లిస్తున్నారు. దీన్ని రూ.5 వేలకు పెంచాలన్న డిమాండ్ ఉంది.

పిల్లలు మరణిస్తే తప్ప.. స్పందించరా?

(మొదటిపేజీ తరువాయి)

దృష్టికి తెచ్చారు. మాగనూరు జడ్పీ హైస్కూల్‌లో ఒకే వారంలో వరుసగా మూడుసార్లు కల్తీ ఆహారం వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు పేర్కొన్నారు. 'ఏబీఎన్- ఆంధ్రజ్యోతి' లో వచ్చిన కథనాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. దీనిపై హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. "ఒకే పాఠశాలలో ఇన్నిసార్లు తప్పులు జరుగుతుంటే డీఈవో, ఫుడ్ సేఫ్టీ అధికారులు ఏం చేస్తున్నారు? పిల్లలు మరణిస్తే గానీ అధికారులు స్పందించరా? డీఈవో నిద్ర పోతున్నారా? రాష్ట్ర ప్రభుత్వం సైతం నిర్లక్ష్యంగా ఉన్నట్లు కనిపిస్తోంది" అంటూ మండిపడింది.

అక్రమాల్లో మీ వాటా ఎంత?



అధికారుల వివరణ తీసుకోవడానికి వారం రోజులు సమయం ఇవ్వాలని ప్రభుత్వ న్యాయవాది కోరడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. "తెలంగాణ వంటి చిన్న రాష్ట్రంలో ఒక అధికారి వివరణ తీసుకోవడానికి వారం రోజులు ఎందుకు? ఆయనేమైనా మైనస్ 30 డిగ్రీల చలిప్రాంతంలో పనిచేస్తున్నారా? అక్కడ ఫోన్, ఇంటర్నెట్ లేవా? నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తే ఐదు నిమిషాల్లో ఇక్కడ ఉంటారు. భవిష్యత్తు తరాలైన విద్యార్థుల పట్ల ఇలాగేనా వ్యవహరించేది? డీఈవో సస్పెన్షన్‌కు సిఫారసు చేస్తాం. మధ్యాహ్న భోజన పథకం అక్రమాల్లో మీ వాటా ఎంత? ఇలాంటి ఘటనల పట్ల ప్రభుత్వాధికారులు సిగ్గుపడాలి" అని ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. దీంతో వివరాలు తెలుసుకోవడానికి ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ మధ్యాహ్నం వరకు సమయం కోరడంతో విచారణ వాయిదా పడింది. మధ్యాహ్నం 2.15 గంటల తర్వాత ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదిస్తూ.. పాఠశాలలో దాదాపు 400 మంది వరకు పిల్లలు ఉన్నప్పటికీ.. కొంతమంది విద్యార్థులు బయట చిరుతిళ్లు కొనుగోలు చేసి తినడం వల్లే ఇలా జరిగినట్లు తెలిసిందని పేర్కొన్నారు. విద్యార్థులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఆహారకల్తీ జరిగిన పాఠశాల్లో నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపాలని, ఫుడ్‌పాయిజన్ ఘటనలపై సమగ్ర వివరాలతో నివేదిక సమర్పించాలని పేర్కొంటూ ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణ సోమవారానికి వాయిదా వేసింది.



కలుషిత ఆహారం ఘటనపై విద్యార్థుల నుంచి వివరాలు సేకరిస్తున్న పాఠశాల విద్య డైరెక్టర్ వెంకట నరసింహారెడ్డి, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఫుడ్ పాయిజన్ ఘటనలు పునరావృతం కావొద్దు

» మాగనూరు పరిశీలనలో రాష్ట్ర పాఠశాల విద్యా డైరెక్టర్

మాగనూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మాగనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటనలు పునరావృతం కాకూడదని రాష్ట్ర పాఠశాల విద్యా డైరెక్టర్ వెంకటనరసింహా రెడ్డి ఆదేశించారు. ఉపాధ్యాయులు రొటేషన్ పద్ధతిలో ప్రతిరోజూ మధ్యాహ్న భోజనానికి నాణ్యతా ప్రమాణాలు కలిగిన వంట సామగ్రి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మంగళవారం ఈ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్‌గౌతమ్, అదనపు కలెక్టర్ బెన్‌షాలంతో కలిసి వెంకట నరసింహారెడ్డి బుధవారంసదరు పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలోని 9, 10వ తరగతుల విద్యార్థులు 15 మందితో కమిటీ ఏర్పాటు చేసి రోజూ ఇద్దరు చొప్పున వంట వండే పరిసరాలను పరిశీలిస్తూ ఉండాలని, వంట వండిన తరువాత ఉపాధ్యాయులు విద్యార్థులతో కూడిన ఫుడ్ కమిటీ సభ్యులు తిన్న తరువాతే విద్యార్థులందరికీ వడ్డించాలని సూచించారు.పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి వెళ్లి పరీక్షలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సౌభాగ్యలక్ష్మిని ఆరా తీశారు. జిల్లా కలెక్టర్‌తో కలిసి పాఠశాలలో ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ నిర్వాహకులు గ్రామ మహిళా సమాఖ్య సభ్యులు, 10వ తరగతి విద్యార్థులతో విడివిడిగా మాట్లాడి మంగళవారం జరిగిన సంఘటనపై వివరాలు తెలుసుకున్నారు.



శేరిగూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఆకునూరి మురళి

మధ్యాహ్న భోజనంలో సమస్యలున్నాయ్

» త్వరలోనే పథకంలో మార్పులు

» విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

ఇబ్రహీంపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో మార్పులు చేస్తామని, ఇందు కోసం ఓ సాఫ్ట్‌వేర్‌ను తీసుకువస్తామని తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి తెలిపారు. ఆహారం కలుషితమవుతుండంతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న ఘటనలు వెలుగు చూస్తున్న నేపథ్యంలో బుధవారం ఆయన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని శేరిగూడ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తర్వాత అక్కడే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సిబ్బందితో మాట్లాడి లోపం ఎక్కడ జరుగుతుందని ఆరా తీశారు. ప్రభుత్వం సరాఫరా చేస్తున్న బియ్యంలో పురుగులు ఉంటున్నాయని సిబ్బంది వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మధ్యాహ్న భోజనం అందించడంలో రాష్ట్రవ్యాప్తంగా సమస్యలు కనబడుతున్నాయని తెలిపారు. కూరగాయలు, సామగ్రి కోసం ఒక్కో విద్యార్థికి కేటాయిస్తున్న బిల్లులు సరిపోవడం లేదని, కాబట్టే ఆహారంలో నాణ్యత తగ్గిపోయిందని పేర్కొన్నారు. ఈ పాఠశాలలో మెనూ ప్రకారం కాకుండా మరోకూరతో వడ్డించినా భోజనం బాగానే ఉందన్నారు. వంటగదిలో మెరుగైన వసతులు కల్పించాల్సి ఉందన్నారు. కాగా, గ్యాస్ కోసం అదనంగా డబ్బులు ఇప్పించాలని, గుడ్లను తక్కువ ధరకు అందించాలని సిబ్బంది ఆయనను కోరారు. అలాగే పెండింగ్ బిల్లులను త్వరగా విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

నవ్య | చిత్రజ్యోతి

విడాకులు మంజూరు

తమిళ హీరో ధనుష్ - ఐశ్వర్య రజనీకాంత్ చట్టపరంగా విడిపోయారు. ఈ దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ చెన్నై ఫ్యామిలీ కోర్టు బుధవారం తీర్పునిచ్చింది. దీంతో వీరిద్దరి రెండు దశాబ్దాల వివాహ బంధం ముగిసిపోయినట్లయింది. 2004లో వీరిద్దరూ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి వేద్, లింగా అనే ఇద్దరు మగ పిల్లలున్నారు. అయితే, మనస్పర్థల కారణంగా తాము విడిపోతున్నట్టు వారు 2022లో ప్రకటించారు. ఆరు నెలల క్రితం ధనుష్ విడాకులు కోరుతూ కోర్టును ఆశ్రయించారు. కోర్టు విచారణకు హాజరుకాకపోవడంతో వీరిద్దరూ మళ్లీ ఒక్కటవుతారని అందరూ భావించారు. కానీ, అనూహ్యంగా ఈ నెల 21వ తేదీన కోర్టుకు హాజరై విడాకులు మంజూరు చేయాలని అభ్యర్థించారు. వారిద్దరి ఏకాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి శుభాదేవి తుది తీర్పును 27వ తేదీకి వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఆ మేరకు బుధవారం వారికి విడాకులు మంజూరు చేస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు.



చెన్నై (ఆంధ్రజ్యోతి)



ఈ క్రిస్మస్ మాదే!

నితిన్

'భీష్మ' చిత్రం తర్వాత దర్శకుడు వెంకీతో చేస్తున్న సినిమా 'రాబిన్‌హుడ్'. నా కెరీర్‌లోనే ఇది హయ్యెస్ట్ బడ్జెట్ సినిమా. 'భీష్మ' మ్యాజిక్ రిపీట్ అవుతుందని స్ట్రాంగ్‌గా నమ్ముతున్నా. శ్రీలీలతో నాకు ఇది సెకండ్ ఫిల్మ్. మాది హిట్ పెయిర్ అని ఈ సినిమా తర్వాత అనిపించుకుంటాం. నిర్మాతలు పెట్టిన డబ్బుని రాబిన్‌హుడ్ రెట్టింపు మొత్తంలో మీ నుంచి దోచుకుని వారికి ఇస్తాడు. గ్యారంటీగా చెబుతున్నా ఈ క్రిస్మస్ మాదే' అన్నారు హీరో నితిన్. ఆయన హీరోగా నటించిన 'రాబిన్‌హుడ్' చిత్రం వచ్చే నెల 25న విడుదలవుతున్న సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. హీరోయిన్ శ్రీలీల మాట్లాడుతూ 'ఇప్పటివరకూ నన్ను కమర్షియల్ హీరోయిన్‌గా, డాన్సింగ్ స్పెషల్‌గా ఆడియన్స్ చూశారు. 'రాబిన్‌హుడ్'తో నా నటన గురించి ప్రత్యేకంగా మాట్లాడుకుంటారు' అని చెప్పారు. చిత్ర దర్శకుడు వెంకీ కుడుముల మాట్లాడుతూ 'నన్ను , కథని నమ్మి ఇంత బడ్జెట్ పెట్టి సినిమా తీసిన నిర్మాతలకు కృతజ్ఞతలు. సపోర్ట్ చేసిన నితిన్‌కు థాంక్స్. ఎడిటింగ్ రూమ్‌లో సినిమా చూసుకున్నా. చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నా. నిర్మాతలు కూడా చాలా హ్యాపీగా ఉన్నారు. ఇందులో ఓ ఐటెం సాంగ్ ఉంది. అది కూడా ట్రంప్ కార్డ్ అవుతుంది' అని చెప్పారు. నిర్మాతలు నవీన్, రవిశంకర్ మాట్లాడుతూ 'సినిమా చాలా బాగా వచ్చింది. మీ అందరికీ నచ్చుతుందని మా నమ్మకం' అన్నారు.



పదిహేనేళ్ల ప్రేమ

ఇటీవలే కీర్తి సురేశ్ తన చిరకాల స్నేహితుడు, కేరళకు చెందిన వ్యాపారవేత్త ఆంటోనీ తట్టిల్‌ని పెళ్లిచేసుకోబోతున్నారని వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈ విషయంపై స్పందించిన కీర్తి సురేశ్.. తన రిలేషన్ స్టేటస్‌పై స్పష్టత ఇచ్చారు. ఈ మేరకు దీపావళీ రోజున ఆంటోనీతో కలసి తీసుకున్న ఫొటోను ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. 'ఆంటోనీతో నాది 15 ఏళ్ల అనుబంధం. ఇక ముందూ మా ఇద్దరి బంధం ఇలాగే కొనసాగనుంది" అని తమ రిలేషన్‌షిప్ గురించి చెప్పారు. ఈ పోస్టు చూసిన పలువురు సినీ ప్రముఖులు కీర్తి సురేశ్‌కు అభినందనలు తెలుపుతున్నారు. అయితే వీరి వివాహానికి సంబంధించిన వివరాలు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. డిసెంబరు 11న గోవాలోని ఓ ప్రైవేట్ రిసార్ట్‌లో వీరి వివాహం జరగనుందనీ, పెళ్లికి రెండు రోజుల ముందే డిసెంబరు 9న వివాహ వేడుకలు ఆరంభమవుతాయని సమాచారం.



నటుడు సుబ్బరాజు వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఈ మేరకు తన సతీమణితో కలసి బీచ్‌లో దిగిన ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఈ పోస్టును చూసిన సినీ ప్రముఖులు, అభిమానులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అయితే సుబ్బరాజు భార్య గురించిన వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

నయనతార దంపతులపై ధనుష్ దావా

హీరోయిన్ నయనతార, ఆమె భర్త, సినీ దర్శకుడు విఘ్నేష్ శివన్‌లపై తమిళ హీరో ధనుష్ కోర్టులో దావా వేశారు. తాను నిర్మించిన 'నానుమ్ రౌడీ దాన్' చిత్రంలోని విజువల్స్‌ను 'నయనతార: బియాండ్ ద ఫేరీ టేల్' అనే డాక్యుమెంటరీలో తన అనుమతి లేకుండా వాడుకున్నారని ధనుష్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిని పరిశీలించిన మద్రాస్ హైకోర్టు విచారణకు స్వీకరించింది. ఈ డాక్యుమెంటరీ టీజర్‌లో 3 సెకండ్ల పాటు 'నానుమ్ రౌడీ దాన్' చిత్రం విజువల్స్‌ను వాడినందుకు రూ.10 కోట్లు డిమాండ్ చేస్తూ ధనుష్ నయనతారకు నోటీసు పంపించారు. దీంతో ఆగ్రహించిన నయనతార.. ధనుష్ వైఖరిని తప్పుబడుతూ బహిరంగ లేఖ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ధనుష్ హైకోర్టును ఆశ్రయించారు.



స్ఫూర్తిదాయకంగా అనిపించలేదు

"నేను 'నయనతార: బియాండ్ ద ఫేరీ టేల్'ను చూశా. స్ఫూర్తిదాయకమైన, ఆకట్టుకునే అంశాలు ఏమీ ఇందులో లేవు' అని డాక్యుమెంటరీపై ప్రముఖ రచయిత్రి శోభా దే అన్నారు. 'నాకు నయనతార గురించి తెలీదు. ఆమె గురించి తెలుసుకోవాలని ధైర్యం చేసి 45 నిమిషాల పాటూ చూశాను. వివాహాన్ని ఇలా వ్యాపార ప్రయోజనాలకు వాడుకోవడం మంచి పద్ధతి కాదు. ఇది చూసి అందరూ వీరినే ఫాలో అవుతారు" అని పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)



డిసెంబరులో వస్తున్న ఫియర్



వేదిక లీడ్ రోల్‌లో నటిస్తున్న సినిమా 'ఫియర్'. హరిత గోగినేని దర్శకత్వంలో దత్తాత్రేయ మీడియా బేనర్‌పై డా.వంకి పెంచలయ్య, ఏఆర్ అభి నిర్మిస్తున్నారు. కో ప్రొడ్యూసర్ సుజాత రెడ్డి. అరవింద కృష్ణ స్పెషల్ రోల్‌లో కనిపించనున్నారు.ఈ మూవీని డిసెంబరు 14 విడుదల చేయనున్నట్లు మేకర్స్ తాజాగా ప్రకటించారు. ఈ సినిమా విడుదలకు ముందే వివిధ అంతర్జాతీయ ప్రతిష్ఠాత్మక ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో 70కి పైగా అవార్డులను గెల్చుకోవడం కూడా మూవీపై హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ సంగీతం సమకూర్చారు.



సినిమాలు ఎందరికో స్ఫూర్తినిస్తాయి

- నిర్మాత ఏ.ఎం.రత్నం

డాక్టర్ ప్రతాని రామకృష్ణగౌడ్ నిర్మాతగా, గురుప్రసాద్ దర్శకత్వంలో లక్ష్మీ రాయ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఝాన్సీ ఐపీఎస్'. ఈనెల 29న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నిర్మాత ఏ.ఎం.రత్నం మాట్లాడుతూ 'సినిమాలు ఎందరికో స్ఫూర్తినిస్తాయి. 'ఝాన్సీ ఐపీఎస్' ట్రైలర్ చూశాను. చాలా బాగుంది. లక్ష్మీరాయ్ యాక్షన్ ఆకట్టుకుంటుంది" అన్నారు.



గద్దర్ నటించిన చివరి చిత్రం

నటుడు సత్యారెడ్డి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఉక్కు సత్యాగ్రహం'. ప్రజా గాయకుడు గద్దర్ నటించిన చివరి చిత్రం ఇది. ఈ నెల 29న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సత్యారెడ్డి మాట్లాడుతూ 'తన పదవికి రాజీనామా చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణతో పాటు ఎంతో మంది ఉద్యమకారులను దృష్టిలో ఉంచుకుని ఈ సినిమాలో కథానాయకుడి పాత్రను గద్దర్ తీర్చిదిద్దారు. ఆ పాత్రను పోషించే అవకాశం నాకు దక్కింది.' అన్నారు.

క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు చేయండి

- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలు
- ఎల్బీ స్టేడియంలో ఉత్సవాలకు సీఎం హాజరు



హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రజా భవన్‌లో వేడుకల కమిటీ సభ్యులు, ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని 200 ప్రాంతాలు, 95 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున క్రిస్మస్ ఉత్సవాలు నిర్వహించనున్నామని తెలిపారు. ఇందుకు జీహెచ్ఎంసీతో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కమిటీలు వేయాలని సూచించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో జరిగే క్రిస్మస్ వేడుకలకు సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని చర్చిల అధిపతులు పాల్గొనేలా చూడాలని, వారందరికీ ఆహ్వానాలు పంపాలని క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్‌కు సూచించారు. సాహిత్యం, క్రీడలు, కళల్లో అవార్డులకు ఎంపికైన వారికి రూ.లక్ష చొప్పున, సామాజిక కార్యక్రమాలు, విద్య, వైద్య సేవల అవార్డులకు ఎంపికైన వారికి రూ.2 లక్షల చొప్పున చెక్కులను సీఎం అందజేస్తారని తెలిపారు. ఈ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానించాలని సూచించారు.

లగచర్ల ఘటనలో పట్నం రిమాండ్ పొడిగింపు

వికారాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లగచర్లలో అధికారులపై దాడి కేసులో ప్రధాన నిందితుడిగా అభియోగాలు ఎదుర్కొంటూ చర్లపల్లి జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి రిమాండ్‌ను కోర్టు పొడిగించింది. నాటి ఘటనలో ఏ-1 నిందితుడు పట్నం నరేందర్‌రెడ్డిని ఈనెల 13వ తేదీన అరెస్టు చేసి కొడంగల్ కోర్టులో హాజరుపరచగా, కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. చర్లపల్లి జైలులో రిమాండ్‌లో ఉన్న నరేందర్‌రెడ్డి 14 రోజుల రిమాండ్ మంగళవారంతో పూర్తి కాగా, బుధవారం కొడంగల్ కోర్టు డిసెంబరు 11 వరకు మరో 14 రోజుల పాటు రిమాండ్‌ను పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. పట్నం నరేందర్‌రెడ్డికి బెయిల్ ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ లీగల్ సెల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ గురువారానికి వాయిదా పడింది. బుధవారం వికారాబాద్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టులో బెయిల్ పిటిషన్ విచారణకు రాగా, కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం ఇవ్వాలని పీపీ కోరడంతో జడ్జి గురువారానికి వాయిదా వేశారు.

జర్నలిస్టుల రైల్వేపాస్‌లను పునరుద్ధరించండి

- కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఈటల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, మల్కాజిగిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కరోనా సమయంలో నిలిపివేసిన జర్నలిస్టుల రాయితీ రైల్వేపాస్‌లను పునరుద్ధరించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన ఢిల్లీలో రైల్వేమంత్రిని కలిసి నియోజకవర్గానికి చెందిన పలు రైల్వే సమస్యలను వివరించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న ఆర్‌యూబీ, ఆర్‌వోబీల పనుల కోసం వినతిపత్రం సమర్పించారు.

ప్రజలు తిరగబడతారని ప్రభుత్వానికి వణుకు:కవిత

హైదరాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వారు చేసిన తప్పులకు ప్రజలు తిరగబడతారనే భయంతో ప్రభుత్వ పెద్దల్లో వణుకు పుడుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మాగనూరు పాఠశాల్లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలపై ప్రజలతో కలిసి ఉద్యమిస్తారని బీఆర్ఎస్ నేతల అక్రమ అరెస్టులకు కాంగ్రెస్ సర్కార్ తెరలేపిందని ఆమె ఆరోపించారు. ప్రజాపాలన అంటూ గొప్పలు చెబుతున్న కాంగ్రెస్ భయంతో బీఆర్ఎస్ నేతలను, ప్రజలను నిర్బంధిస్తూ, తెలంగాణ ఉద్యమం నాటి అణిచివేతలను గుర్తు చేస్తోందన్నారు.

డిమాలిషన్ మ్యాన్ రేవంత్: బీజేపీ

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూల్చివేతల మనిషి(డిమాలిషన్ మ్యాన్) అంటూ తెలంగాణ బీజేపీ తన సామాజిక మాధ్యమాల వేదికగా వ్యంగ్యాస్త్రాలు సంధించింది. వెనుకబడిన, పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన వారి ఇళ్లను మాత్రమే సీఎం కూల్చివేస్తారని ఆరోపించింది. కాంగ్రెస్, మిత్ర పక్షం బీఆర్ఎస్, కామన్ ఫ్రెండ్ ఒవైసీ సోదరుల విశాలమైన అక్రమ నిర్మాణాలను , ఫామ్‌హౌస్‌లను కూల్చబోరని విమర్శించింది.

32 మండల పరిషత్‌లకు సర్కారు ఆమోదం

రాష్ట్రంలోని మండల పరిషత్ పాలకవర్గాల గడువు గత జులైతో ముగియడంతో ప్రజా ప్రతినిధులు, ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు 32 కొత్త మండలాలను మండల పరిషత్‌లుగా ప్రభుత్వం ఆమోదించింది. దీంతో ఆయా మండలాల్లో పాలకవర్గాల ఏర్పాటు కోసం ఎన్నికల నిర్వహణకు అవకాశం ఏర్పడింది. గతంలోనే కొత్తగా 32 రెవెన్యూ మండలాలు ఏర్పాటు చేసినప్పటికీ.. ఉమ్మడి మండలాల పరిధిలో మండల పరిషత్ పాలక వర్గాలు ఉన్న కారణంగా.. కొత్త పాలకవర్గాలు ఏర్పడలేదు. ప్రభుత్వ నిర్ణయంతో మండలస్థాయి ప్రజాప్రతినిధులుగా ఎదగాలన్న రాజకీయపార్టీల నేతలు, ఆశావహుల్లో ఆనందం నెలకొంది.

మూసీ నిర్వాసితులందరికీ పునరావాసం

- కేంద్రానికి తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా అవసరం మేరకే కూల్చివేతలు ఉంటాయని, బాధితులందరికీ పునరావాసం కల్పిస్తామని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర సర్కారు కేంద్రానికి తెలిపిన సమాచారాన్ని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి టోకెన్ సాహూ పార్లమెంట్‌లో వెల్లడించారు. 'మూసీ ప్రాజెక్టు, కూల్చివేతలు, పేదలు నిరాశ్రయులు కావడాన్ని కేంద్ర ప్రభుత్వం గమనించిందా? దశాబ్దాలుగా అక్కడ నివసిస్తున్న లక్షలాది మంది ప్రజలకు తగిన పునరావాస చర్యలపై కేంద్ర జోక్యం ఉంటుందా?' అని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేశ్ రెడ్డి లిఖిత పూర్వకంగా అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి సాహూ బదులిచ్చారు. నదీ పునరుజ్జీవం, కాలుష్యాన్ని నిర్మూలించడం, పట్టణ వరదలను తగ్గించడం, ప్రజలను ముంపు నుంచి కాపాడడం, సుందరీకరణలో భాగంగా మూసీ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా చేపట్టినట్లు తెలంగాణ సర్కారు తెలిపిందన్నారు. పెద్దఎత్తున కూల్చివేతలు ఉండవని స్పష్టం చేసిందన్నారు.

ఆరోగ్య పథకంపై దామోదరతో టీజీవో చర్చలు

ఉద్యోగులకు అందించే ఆరోగ్య పథకంపై మంత్రి దామోదర రాజనర్సింహతో తెలంగాణ గెజిటెడ్ అధికారుల(టీజీవో) సంఘం ప్రతినిధులు చర్చించారు. ఈ మేరకు బుధవారం టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు నేతృత్వంలో మంత్రిని కలిశారు. ఉద్యోగుల నిష్పత్తి ఎంత ఉండాలి, ప్రభుత్వ వాటా ఎంత ఉండాలనేదానితో పాటు వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న ఉద్యోగుల వేతనాల నుంచి ఆరోగ్య పథకం కోసం ఎంత కేటాయించాలనే అంశాలను చర్చించారు. ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించి ఉద్యోగులకు ఆరోగ్య పథకం అందుబాటులోకి తీసుకొస్తామని టీజీవో ప్రతినిధులకు మంత్రి హామీ ఇచ్చారు.

దీపపు చిమ్నీ పేలి అగ్నిప్రమాదం

మణికొండలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఘటన

రూ.75 లక్షల ఆస్తి నష్టం

నార్సింగ్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గృహప్రవేశం రోజున వెలిగించిన అఖండ దీపం ఆరిపోకుండా ఉండేందుకు రక్షణగా పెట్టిన చిమ్నీ(గాజుపాత్ర) పేలి ఓ అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. రూ.75 లక్షల మేర ఆస్తి నష్టం జరిగింది. హైదరాబాద్‌లోని మణికొండ మునిసిపాలిటీ పరిధి పుప్పాలగూడలో ఉన్న ఈఐపీఎల్ కార్నర్ స్టోన్ అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో బుధవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. సంతోష్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఈఐపీఎల్ కార్నర్ స్టోన్ అపార్ట్‌మెంట్ ఎనిమిదో అంతస్తులోని తన ఫ్లాట్‌లో కుటుంబంతో కలిసి సోమవారం గృహప్రవేశం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా దేవుడి గదిలో వెలిగించిన దీపం చుట్టూ ఓ గాజుపాత్రను ఉంచారు. అయితే, దీపం నుంచి వెలువడిన వేడిని తట్టుకోలేక బుధవారం ఉదయం ఆ గాజుపాత్ర పేలగా.. దీపం ఎగిరిపడడంతో ఇల్లంతా వేగంగా మంటలు వ్యాపించాయి. సంతోష్ కుటుంబం సకాలంలో ఇంటి నుంచి బయటకు రావడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. కాగా, ఈ ఘటనపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఇంట్లోని వస్తువలన్నీ కాలిపోవడంతో రూ.75లక్షల మేర ఆస్తినష్టం జరిగిందని అంచనా వేశారు. అగ్నిప్రమాదంపై నార్సింగ్ పోలీసులు కేసు నమోదు చేశారు.

బాపూఘాట్‌లో మహాత్ముడి శాంతి విగ్రహం

- గాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేసే నాలెడ్జ్ హబ్
- 'గాంధీ సరోవర్ ప్రాజెక్టు'గా పేరు

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్వేచ్ఛకు చిహ్నంగా అమెరికాలోని న్యూయార్క్‌లో ఏర్పాటు చేసిన 'స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ' తరహాలోనే.. బాపూ ఘాట్‌లో ఏర్పాటుచేయబోయే అతి పెద్ద గాంధీ విగ్రహాన్ని 'స్టాచ్యూ ఆఫ్ పీస్'గా వ్యవహరించాలని ప్రభుత్వం సంకల్పించింది. మూసీ సుందరీకరణ తొలివిడత పనుల్లో భాగంగా బాపూ ఘాట్‌ను ప్రపంచస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు సర్కారు నడుంబిగించిన సంగతి తెలిసిందే. 'గాంధీ సరోవర్ ప్రాజెక్టు' పేరుతో చేపట్టే ఈ అభివృద్ధి పనుల్లో భాగంగా అక్కడ గాంధీ బోధలను ప్రపంచానికి చాటి చెప్పే విజ్ఞాన కేంద్రం (నాలెడ్జ్ హబ్), ధ్యాన కేంద్రం, సంప్రదాయ చేతివృత్తులకు ప్రోత్సాహం ఇచ్చేలా చేనేత ప్రచార కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. అలాగే.. తెలంగాణ సంప్రదాయాలు, కళలను ప్రదర్శించేందుకు ప్రత్యేక వేదికలను నిర్మించనున్నారు. గాంధీ సిద్ధాంతాలకు అత్యధిక ప్రాధాన్యమిస్తూనే.. పర్యాటకులకు వినోదాన్ని అందించేందుకు పలు వినోద కేంద్రాలను కూడా బాపూ ఘాట్‌లో ఏర్పాటు చేయనున్నారు. మూసీ తీరాన్ని ఆనుకుని ఉండే ఈ ఘాట్‌కు వచ్చే పర్యాటకులకు ఆహ్లాదం కలిగించేలా పచ్చిక బయళ్ల నిర్మాణం కూడా చేపట్టనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

తక్కువ కాలంలో.. ఎక్కువ వ్యతిరేకత

(మొదటిపేజీ తరువాయి)

వారితో చర్చించారు. పార్టీ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. దేశవ్యాప్తంగా బీజేపీని అడ్డుకోలిగే శక్తి ఏ పార్టీకి లేదని, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ బీజేపీకి ఏ కోశానా గట్టి పోటీ ఇచ్చే పరిస్థితులు లేవని ప్రధాని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను ఎదుర్కోవడం పెద్ద కష్టమేం కాదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాల్సిందని, కానీ.. కొన్ని కారణాల వల్ల రాలేకపోయామని తెలిపారు. ప్రస్తుతం పార్టీకి సానుకూల వాతావరణం ఉందన్నారు. మహారాష్ట్రలో బీజేపీ సాధించిన ఘనవిజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని పని చేయాలని, తెలంగాణలో కూడా అఖండ విజయం సాధించేందుకు ఇప్పటినుంచే కృషి చేయాలని సూచించారు. కలిసికట్టుగా, ప్రణాళిక బద్ధంగా పనిచేస్తే ఏదైనా సాధ్యమేనని అన్నారు. ఏక్ హైతో సేఫ్ హై అన్న నినాదం మహారాష్ట్రలో పార్టీని విజయపథంలో నడిపించిందన్నారు. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రధానమంత్రి ఆరా తీశారు.

ప్రభుత్వ తప్పులపై అప్రమత్తంగా ఉండాలి..

రాష్ట్ర ప్రభుత్వం చేసే తప్పులపై అప్రమత్తంగా ఉండాలని, సర్కారు ప్రజా వ్యతిరేక నిర్ణయాలను గట్టిగా ప్రతిఘటించాలని నిర్దేశించారు. మరోవైపు అభివృద్ధి ఎజెండాతో ప్రజల వద్దకు వెళ్లాలని, కేంద్ర ప్రభుత్వం పదేళ్లలో తెలంగాణలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రచారం చేయాలని చెప్పారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన అన్ని పెండింగ్ పథకాలు, నిధులు మంజూరు చేసేలా చూడాలని, అదే సమయంలో వాటి గురించి తమకు ముందే తెలియజేసి ప్రజలకు వివరించే అవకాశం కల్పించాలని తెలంగాణ బీజేపీ ప్రజాప్రతినిధులు ప్రధాని మోదీకి చెప్పినట్లు సమాచారం. కాగా, తెలంగాణలో బీజేపీ వేగంగా విస్తరిస్తోందని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. "రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బీజేపీ తన స్వరాన్ని గట్టిగా వినిపిస్తూనే ఉంటుంది. కార్యకర్తలు మా అభివృద్ధి ఎజెండాను వివరిస్తూనే ఉంటారు" మోదీ తెలుగులో ట్వీట్ చేశారు. ప్రధానితో భేటీ వివరాలను కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వెల్లడిస్తూ.. ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఎప్పుడూ పనిచేయాలని, ప్రభుత్వంతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషిచేయాలని మోదీ సూచించినట్లు తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి పనుల గురించి ప్రధాని అడిగి తెలుసుకున్నారని చెప్పారు. డిసెంబరు చివరి నాటికల్లా.. పార్టీ సంస్థాగత ఎన్నికలు పూర్తవుతాయని, ఆ తర్వాత పార్టీకి కొత్త అధ్యక్షుడి ఎన్నిక జరుగుతుందని అన్నారు.



పార్లమెంటులో ప్రధాని మోదీతో సమావేశమైన రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు

సమస్యలపై ప్రశ్నిస్తే.. వ్యక్తిగతంగా దాడులు: కిషన్‌రెడ్డి

రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలన కూడా కేసీఆర్ పాలనలాగే ఉందని, ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే వ్యక్తిగతంగా దాడి చేస్తున్నారని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. బెదిరింపులు, తిట్ల పురాణాలు, వ్యక్తిగత దాడులు, అక్రమ కేసులు, గాలిమాటలు తప్ప.. ఈ ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిందేమీ లేదన్నారు. బుధవారం కిషన్‌రెడ్డి తన అధికారిక నివాసంలో మీడియాతో మాట్లాడారు. 'నేను సమస్య గురించి మాట్లాడితే.. కిషన్ రెడ్డి డీఎన్ఏ ఏంటని అడుగుతున్నారు. నా డీఎన్ఏ.. బీజేపీ డీఎన్ఏ. మీలా పది పార్టీలు తిరిగిన డీఎన్ఏ కాదు' అని అన్నారు. అప్రజాస్వామిక భాష మాట్లాడటాన్ని కేసీఆర్ ప్రవేశపెడితే.. రేవంత్ కొనసాగిస్తున్నారని ఆరోపించారు. రాజకీయ పరమైన ఆరోపణలు, ప్రత్యారోపణలతో తెలంగాణ నష్టపోతోందన్నారు. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందన్నారు. రాష్ట్రంలోని సమస్యలను పరిష్కరించకుండా వారం రోజులపాటు ఉత్సవాలు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ ఆధ్వర్యంలో డిసెంబరు 1 నుంచి 5 వరకు రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కొమురం భీం జిల్లాలో.. శైలజ అనే విద్యార్థిని ఆహార కల్తీతో చనిపోతే ముఖ్యమంత్రి కనీసం పట్టించుకోలేదని మండిపడ్డారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులు, వ్యక్తిగత దాడులు.. అసాధ్యమైన అంశాల్లో.. ప్రజలను మభ్యపెట్టేలా పనులు చేయడంలో కేసీఆర్, రేవంత్ ఇద్దరూ ఇద్దరేనని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఆ రెండు పార్టీలు చట్టాలకు తూట్లు పొడుస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పాత అలవాటు ప్రకారం రాష్ట్రంలో అవినీతి విలయతాండవం చేస్తోందని, హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పూర్తిగా దెబ్బతిన్నదని తెలిపారు.



గంజాయి సాగు, రవాణా, విక్రేతలకు సంక్షేమ పథకాలు కట్

450 మంది పోలీసులతో ప్రత్యేక దళం

ఏపీ మంత్రివర్గ ఉపసంఘం భేటీలో నిర్ణయాలు

అమరావతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎవరు గంజాయి సాగు చేసినా.. సరఫరా చేస్తూ పట్టుబడినా.. మత్తు పదార్థాలు విక్రయించినా కటకటాలు లెక్కపెట్టాల్సిందే. అంతేకాదు.. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటికీ దూరం కావాల్సిందే! ఆంధ్రప్రదేశ్‌లో గంజాయిపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమైన కూటమి సర్కారు... దీనిపై బహుముఖ వ్యూహాన్ని అమలు చేస్తోంది. అన్ని వర్గాలను ఇందులో భాగస్వాముల్ని చేసి 'ఈగల్' ద్వారా మత్తు మహమ్మారిని శాశ్వతంగా నాశనం చేయాలని నిర్ణయించుకుంది. వైసీపీ హయాంలో 'దేశ గంజాయి రాజధాని'గా రాష్ట్రంపై పడిన ముద్రను తొలగించే దిశగా కఠిన చర్యలు చేపడుతోంది. ఈ దిశగా ఇప్పటికే ఉత్తరాంధ్రలో గంజాయిపై ఉక్కుపాదం మోపింది. రాష్ట్రవ్యాప్తంగా తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం సచివాలయంలో హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన నారా లోకేశ్ (విద్య), సత్యకుమార్ (వైద్య), గుమ్మిడి సంధ్యారాణి (గిరిజన సంక్షేమ), కొల్లు రవీంద్ర(ఎక్సైజ్)లతో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. మన్యంలో గంజాయి సాగు నుంచి బయట వినియోగం వరకూ అన్నింటిపైనా చర్చించిన మంత్రులు పలు కీలక సూచనలు చేశారు. ఇందులో ముఖ్యంగా... గంజాయి సాగు, సరఫరా, విక్రయంలో పాల్గొనే వారిపై కేసులు పెట్టడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటికీ అనర్హులుగా ప్రకటించాలని నిర్ణయించారు.

బుంగలు పూడ్చి.. ఆధారాలు లేకుండా చేశారు!

- అంతకుముందు జరపాల్సిన పరీక్షలను పట్టించుకోలేదు
- రాష్ట్ర నీటిపారుదలశాఖపై 'జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ' ఆక్షేపణ.. లేఖ

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీ పునాదుల కింద ఇసుక కొట్టుకుపోయి ఏర్పడిన బుంగలను పూడ్చడానికి ముందు, అక్కడి స్థితిగతులను తెలుసుకోవడానికి నిర్వహించాల్సిన పరీక్షలకు తెలంగాణ నీటిపారుదల శాఖ పట్టించుకోలేదు. జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్ఏ) సిఫారసులకు విరుద్ధంగా వ్యవహరించింది' అని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్ఏ) మండిపడింది. ఈ మేరకు ఎన్‌డీఎస్ఏ డైరెక్టర్ (టెక్నికల్) గత నెల 11న నీటిపారుదల శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. బ్యారేజీలు దెబ్బతినడానికి, వైఫల్యం చెందడానికి దారితీసిన కారణాలను విశ్లేషించడానికి అవకాశం లేకుండా కీలక సమాచారం, ఆధారాలు ధ్వంసమయ్యాయని ఈ లేఖలో ఆక్షేపించింది. 'మేడిగడ్డ బ్యారేజీ ప్లింత్ శ్లాబుకి ఎగువన, దిగువన గ్రౌటింగ్ చేసి భూగర్భంలో ఏర్పడిన బుంగలను పూడ్చివేయడంతో సీకెంట్ పైల్స్, పారామెట్రిక్ జాయింట్స్ వద్ద స్థితిగతుల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. బ్యారేజీలోని ఏడో బ్లాకు కుంగిన తర్వాత భూగర్భంలో ఉన్న వాస్తవ స్థితిగతులను అధ్యయనం చేయాల్సి ఉండగా, గ్రౌటింగ్‌తో స్థితిగతుల్లో మార్పులు చోటుచేసుకొని ఆ అవకాశం లేకుండా పోయింది' అని పేర్కొంది. కాళేశ్వరం మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాకు గతేడాది అక్టోబరు 23వ తేదీన కుంగిపోగా, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో బుంగలు ఏర్పడిన విషయం తెలిసిందే. దీనిపై అధ్యయనానికి ఏర్పాటైన ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీ మే 1న మధ్యంతర నివేదికను సమర్పించింది. బ్యారేజీలకు మరింత నష్టం జరగకుండా వర్షాకాలం ప్రారంభానికి ముందే తీసుకోవాల్సిన అత్యవసర మరమ్మతులతో పాటు బ్యారేజీల్లో లోపాలను నిర్ధారించడానికి నిర్వహించాల్సిన జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షలు ఇందులో ఉన్నాయి. ఈ అధ్యయనాలు/పరీక్షలు ప్రారంభించడంలో జాప్యం చేయడం ద్వారా నీటిపారుదల శాఖ విలువైన సమయాన్ని కోల్పోయిందని ఎన్‌డీఎస్ఏ తాజాగా తప్పుబట్టింది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ప్రస్తావిస్తూ.. వాటి పునాదుల కింద ఏర్పాటు చేసిన సీకెంట్‌పైల్స్ వాస్తవ స్థితిగతులను అధ్యయనం చేయడానికి ముందే కర్టెయిన్ గ్రౌటింగ్ చేసి భూగర్భంలో బుంగలను పూడ్చివేశారని పేర్కొంది. ఇప్పుడు పరీక్షలు నిర్వహిస్తే.. బ్యారేజీలు దెబ్బతినడానికి, వైఫల్యానికి గల కారణాలు కూడా తెలియవని స్పష్టం చేసింది. నీటిపారుదల శాఖ చర్యలతో ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీ పని ప్రణాళికకు సైతం విఘాతం కలిగిందని ఆక్షేపించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వైఫల్యం, లోపాలపై డిసెంబరు నెలాఖరుకల్లా నివేదిక అందిస్తామని ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీ గతంలో చెప్పింది. అయితే, ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరిలో నివేదిక అందే అవకాశాలున్నాయి. మరోవైపు, మేడిగడ్డకు ఎగువన మట్టి కట్ట లేదా రబ్బర్ డ్యామ్ కట్టి రానున్న రబీ సీజన్‌కు నీటిని అందించాలనే ప్రయత్నాలకు కూడా తాజా పరిణామాలతో బ్రేక్ పడింది.

సాక్ష్యాలన్నీ ధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

నివేదిక సమర్పించకపోవడానికి ప్రధాన కారణం తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారుల తీరేనన్నారు. ఈ ఏడాది జూలై-ఆగస్టులో పీసీ ఘోష్ కమిషన్‌కు కాళేశ్వరం ప్రాజెక్టుపై వెదిరె శ్రీరామ్ ఫిర్యాదు చేయగా.. అఫిడవిట్ దాఖలు చేయాలని కమిషన్ సూచించింది. ఈ నేపథ్యంలో, బుధవారం జస్టిస్ పీసీ ఘోష్‌ను కలిసి అఫిడవిట్ సమర్పించారు. ఈ సందర్భంగా ఎన్‌డీఎస్ఏ రిపోర్టుపై కమిషన్ ఆయనను ఆరా తీసింది. శ్రీరామ్ వివరణ ఇస్తూ.. బ్యారేజీల ఎగువ, దిగువ భాగాల్లో గుంతలు ఏర్పడ్డాయని, దీన్ని గ్రౌటింగ్ చేయడంతో జియో టెక్నికల్ డేటాను కోల్పోవడం జరిగిందని గుర్తు చేశారు. వానలు తగ్గాక బ్యారేజీల వద్ద జియో టెక్నికల్, జియో ఫిజికల్ పరీక్షలు చేసి నివేదికలు అందిస్తే... ఆ తర్వాత రెండు నెలల్లో తాము పూర్తి నివేదిక ఇస్తామని ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీ స్పష్టం చేసిందన్నారు. అయితే, కమిషన్‌కు సహాయంగా వేసిన నిపుణుల కమిటీ సూచనలతోనే గ్రౌటింగ్ చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు చెప్పారన్నారు. దాంతో జియోఫిజికల్ పరీక్షలు చేసి, నివేదికలు అందించాలని ఎన్‌డీఎస్ఏ చెప్పినప్పటికీ ఇప్పటిదాకా నివేదిక ఇవ్వలేదని పేర్కొన్నారు. బ్యారేజీల దిగువ భాగంలో ఏయే సమస్యలు ఉన్నాయనే దానిని తెలుసుకోలేని పరిస్థితి తలెత్తిందన్నారు.

నీటి లభ్యత ఉన్నా లేనట్లు చెప్పి..

75 శాతం డిపెండబిలిటీతో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టిలో 160 టీఎంసీల లభ్యత ఉందని కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) చెప్పిందని, అయితే నీటి లభ్యత లేదనే కారణాలు చూపించి రీ ఇంజనీరింగ్‌తో కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టారని వెదిరె శ్రీరామ్ తన అఫిడవిట్‌లో ఆక్షేపించారు. వ్యాప్కోస్ అనేది ఒక వాణిజ్య సంస్థ అని, ఎవరు పని అప్పగిస్తే వారి ప్రయోజనాలకు అనుగుణంగా పని చేస్తుందన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టి రూ.32 వేల కోట్లతో 16.4 లక్షల ఎకరాలకు నీరు అందించడానికి వీలుగా ప్రాణహిత-చేవెళ్లను చేపట్టగా... కేవలం 2 లక్షల అదనపు ఆయకట్టు కోసం రూ.90 వేల కోట్లతో కాళేశ్వరం చేపట్టారని గుర్తు చేశారు. దాని వ్యయం ప్రస్తుతం రూ.1,27,000 కోట్లకు చేరుకుందన్నారు. 2019లో కాళేశ్వరం బ్యారేజీలు పూర్తికాగా... ఏటా 180 టీఎంసీలు తరలిస్తామని గత ప్రభుత్వం చెప్పిందని ప్రస్తావించారు. కానీ, 2019-20లో 61.66 టీఎంసీలు, 2020-21లో 31.82 టీఎంసీలు, 2021-22లో 33.97 టీఎంసీలు, 2022-23లో 25.97 టీఎంసీలు, 2023-24లో కేవలం 8.93 టీఎంసీలు కలుపుకొని ఐదేళ్లలో 162 టీఎంసీలు మాత్రమే తరలించారన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్లతో బ్యారేజీ కడితే... 85 శాతం ముంపు మహారాష్ట్రలో ఉంటే... 15 శాతం మాత్రమే తెలంగాణలో ఉండేదని పేర్కొన్నారు. బ్యారేజీ ఎత్తును 148 మీటర్లకు తగ్గించాలని మహారాష్ట్ర కోరిందని, అలా తగ్గించినప్పటికీ, 160 టీఎంసీలను తరలించడానికి అవకాశం ఉండేదన్నారు. మహారాష్ట్రలో ముంపు కారణంగా రీ ఇంజనీరింగ్ జరిపామనే వాదన అర్థరహితమని కొట్టివేశారు. మెరుగైన పునరావాసం, పునర్‌నిర్మాణం, పరిహారానికి చర్యలు తీసుకొని ఉంటే.. బ్యారేజీ కట్టడానికి ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావని పేర్కొన్నారు.

రూ.11.9 వేల కోట్లు వృథా

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుపై రూ.11,917 కోట్లను వెచ్చించారని, ఆ నిధులన్నీ రీ ఇంజనీరింగ్‌తో వృథా అయ్యాయని శ్రీరామ్ తెలిపారు. కాళేశ్వరం డిజైన్లను సీడబ్ల్యూసీ ఆమోదించలేదని, వాటిని ఆమోదించింది నీటిపారుదలశాఖలోని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) అని గుర్తు చేశారు. తగిన సాంకేతిక పరీక్షలు జరపకుండానే కాళేశ్వరం బ్యారేజీలు కట్టారని.. ప్లానింగ్, డిజైన్, క్వాలిటీ కంట్రోల్, నిర్మాణం, ఓ అండ్ ఎం లోపాలే బ్యారేజీల వైఫల్యానికి కారణమన్నారు. వీటన్నింటి వల్లే గతేడాది అక్టోబరులో బ్యారేజీ కుంగిందని నివేదించారు. తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాతే.. మార్చి నెలలో ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీని వేశారని పేర్కొన్నారు. అయితే జియో టెక్నికల్ పరీక్షలు చేయాలని ఎన్‌డీఎస్ఏ ఆదేశించినప్పటికీ.. గ్రౌటింగ్ జరగటం వల్ల.. బ్యారేజీల వైఫల్యానికి గల కారణాలు తెలుసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. మొత్తం 29 పేజీలతో వెదిరె శ్రీరామ్ అఫిడవిట్ దాఖలు చేశారు.

కమిషన్ ముందు కథలు చెప్పొద్దు!

మీరు ఇంజనీరేనా? ఏ కాలేజీలో చదివారు? .. నీటి లభ్యత ఖరారు ఇక్కడి ఇంజనీర్ల పనే కదా?

- సీడబ్ల్యూసీ మీదికి తోయడం ఎందుకు?
- ఎవరినైనా కాపాడేందుకు ప్రయత్నాలా?
- నిబద్ధతతో కడితే బ్లాకులెందుకు కొట్టుకుపోయాయి
- ఇంజనీర్లకు కాళేశ్వరం కమిషన్ ప్రశ్నలు
- 3 రోజుల్లో 49 మందికి పైగా విచారణ



కమిషన్ విచారణకు హాజరైన ఇంజనీర్లు

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై కొనసాగుతున్న బహిరంగ విచారణలో భాగంగా హైడ్రాలజీ మాజీ చీఫ్ ఇంజనీర్ శంకర్ నాయక్.. బుధవారం కమిషన్ ముందు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషన్ పలు ప్రశ్నలు సంధించింది. డిజైన్ ఫ్లడ్స్ అంటే ఏమిటి అని అడిగిన ప్రశ్నకు.. క్యాచ్‌మెంట్‌లో వచ్చే వరద ఆధారంగా డిజైన్ చేయడమేనని శంకర్‌నాయక్ సమాధానమిచ్చారు. దీంతో కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. మీరు ఇంజనీరా? ఏ యూనివర్సిటీలో చదువుకున్నారు? డిజైన్ ఫ్లడ్ అంటే తెలియదా? అని నిలదీసింది. హైడ్రాలజీ క్లియరెన్స్ మీరే ఇచ్చారా? అని అడిగితే.. కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) హైడ్రాలజీ క్లియరెన్స్ ఇచ్చిందని శంకర్‌నాయక్ తెలిపారు. దీనిపై కమిషన్ స్పందిస్తూ.. 'నీటి లభ్యతను ఖరారు చేయాల్సింది తొలుత ఇక్కడి ఇంజనీర్లే కదా? కేంద్రంపై తోయడమెందుకు? ఎంత ప్రయత్నించినా వాస్తవాలన్నీ వెలుగులోకి తెస్తాం. ఏమైనా దాస్తున్నారా? పదవీ విరమణ చేశాకా ఇంకా దాచడానికి ఏముంది? విచారణను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారా?' అని ఘాటు వ్యాఖ్యలు చేసింది. బ్యారేజీల నిర్మాణ ప్రదేశాల్లో నీటి లభ్యత వివరాలు అందజేయాలని మీరు లేఖ రాశారా? రాస్తే జవాబు వచ్చిందా? దేని కోసం నీటి లభ్యత అధ్యయనాలు చేస్తారు? కమిషన్ ముందు కథలు చెబుతున్నారా? అని కమిషన్ మండిపడింది. బ్యారేజీల నిర్మాణ ప్రదేశంలో నీటి లభ్యత ఏ విధంగా ఉందో వివరాలు అందించాలని లేఖలు రాయడం జరిగిందని శంకర్ నాయక్ వెల్లడించారు. అన్నారం ఏఈఈ ఆర్మూరి రామచందర్‌పైన కూడా.. విచారణ సందర్భంగా కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించింది. అన్నారంలో ఎప్పటి నుంచి పని చేస్తున్నారని కమిషన్ ప్రశ్నించగా.. 2016 నుంచి చేస్తున్నానని రామచందర్ బదులిచ్చారు. 'మీరు నిబద్ధతతోనే పని చేశారా? బ్లాకులెందుకు కొట్టుకుపోయాయి? దీనికి కారణాలేంటి? బ్లాకులు కొట్టుకుపోతే పై అధికారులకు లేఖ రాశారా? సరైన పద్ధతిలోనే నిర్మాణం జరిగిందా? ఎందుకు లేఖలు రాయలేదు? ఎందుకు సమాచారం ఇవ్వలేదు? మౌఖికంగానే సమాచారం ఇస్తారా? నిబద్ధత ఎక్కడుంది?' అంటూ నిలదీసింది. విచారణ సందర్భంగా మరో మాజీ సీఈ (ఓఅండ్ఎం) జి. రమేష్‌ను కూడా కమిషన్ ఘాటుగా ప్రశ్నించింది. 'మీ పదవీ కాలంలో బ్యారేజీలను ఎన్నిసార్లు సందర్శించారు? నివేదికలు ఏమైనా ఇచ్చారా?' అని అడగ్గా.. 2021 జూలైలో ఒకసారి పరిశీలించి, నివేదిక ఇచ్చానని రమేష్ తెలిపారు. 'అఫిడవిట్‌లో పినాకిని అని రాశారు. పినాకిని అంటే అర్థం తెలుసా? అఫిడవిట్ తొలి లైన్‌లోనే తప్పిదాలు ఉంటే ఎట్లా? సంతకం చేయడానికి ముందు అఫిడవిట్‌ను చదువుకోవాల్సిన అవసరం లేదా?' అని కమిషన్ నిలదీసింది. కాగా, కె.విఠల్‌రావు అనే మాజీ ఇంజనీర్ కమిషన్ ఎదుట పలు అంశాలను ప్రస్తావించారు. తగిన అధ్యయనం చేయకుండానే, బ్యారేజీల నిర్మాణంపై నిర్ణయాలు తీసుకున్నారని, బ్యారేజీల వైఫల్యానికి ప్రధాన కారణం హైపవర్ కమిటీయేనని గుర్తు చేశారు. కాళేశ్వరం కమిషన్ మూడు రోజుల్లో 49 మంది ఇంజనీర్లను క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. తదుపరి క్రాస్ ఎగ్జామినేషన్ డిసెంబరు 2వ తేదీ నుంచి జరుగనుంది.

ఐడీటీఆర్ ఏర్పాటుకు అనుమతివ్వండి

- మరిన్ని ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటయ్యేలా చూడండి
- కేంద్ర మంత్రి గడ్కరీకి రాష్ట్ర మంత్రి పొన్నం వినతి

న్యూఢిల్లీ, హైదరాబాద్, నవంబరు 27: దేశ రాజధాని న్యూఢిల్లీలో మాదిరిగా హైదరాబాద్‌లోనూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ అండ్ రీసెర్చ్(ఐడీటీఆర్)ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ఐడీటీఆర్ కోసం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 40 ఎకరాల భూమిని కూడా గుర్తించామని తెలియజేశారు. ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, ఆర్ రఘురామి రెడ్డి, గడ్డం వంశీకృష్ణ, సురేష్ షెట్కార్‌తో కలిసి కేంద్ర మంత్రి గడ్కరీని న్యూఢిల్లీలోని ఆయన నివాసంలో మంత్రి పొన్నం బుధవారం కలిశారు. తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారులు, రైల్వే అండర్ రోడ్డు బ్రిడ్జి పనులపై చర్చించారు. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు ఇచ్చిన పన్ను రాయితీలు సహా రాష్ట్ర రవాణా శాఖ చేపట్టిన పలు కార్యక్రమాలను కేంద్ర మంత్రికి వివరించారు. కేంద్రం సహకరిస్తే రాష్ట్ర రవాణా శాఖ మరింత పురోగతి సాధిస్తుందని చెప్పారు. 15 ఆర్థిక సంఘం కింద రాష్ట్రానికి ఐడీటీఆర్ కేటాయించాలని కోరారు. అలాగే, మల్టీలేన్ వెహికిల్ ఫిట్‌నెట్ టెస్టింగ్‌స్టేషన్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని అడిగారు. ఎలక్ట్రానిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఆటోమెటిక్‌గా ఈ చలాన్లను జారీ చేసేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం జాతీయ, రాష్ట్ర రహదారులను గుర్తించాలని అడిగారు. రాష్ట్రంలో మరిన్ని ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు సహకరించాలని విన్నవించారు.

భగీరథ నీళ్లను వినియోగించేలా చర్యలు

- ఆర్వో ప్లాంట్లు, బోరు నీళ్ల వాడకాన్ని తగ్గించాలి: సీతక్క

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ నీళ్లను వినియోగించేలా చర్యలు చేపట్టాలని, ఇందు కోసం సరఫరా అవుతున్న తాగునీటిపై ప్రజలకు విశ్వాసం, అవగాహన కల్పించాలని మంత్రి సీతక్క అధికారులకు సూచించారు. రూ.వేల కోట్లు ఖర్చుచేసి మిషన్ భగీరథ వ్యవస్థను ఏర్పాటు చేసినా... ప్రజలు ఇంకా ఆర్వో ప్లాంట్లు, బోరునీళ్లపై ఆధారపడుతున్నారని ఈ పరిస్థితిని అధిగమించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్వో ప్లాంట్లు, బోరునీటి వల్ల దీర్ఘకాలంలో ఎటువంటి సమస్యలు తలెత్తుతాయో ప్రజలకు వివరించాలన్నారు.

త్వరలో వికలాంగుల పింఛన్ పెంపు

అసెంబ్లీ ఎన్నికల్లో హామీనిచ్చిన మేరకు వికలాంగులకు త్వరలోనే పింఛన్‌ను పెంచుతామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. డిసెంబరు 3న ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వికలాంగుల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై క్రీడోత్సవాలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వైకల్యాన్ని దురదృష్టంగా భావించకుండా.. ఓటమి వచ్చినా కుంగిపోకుండా ప్రతిభతో పట్టుదలగా లక్ష్య సాధనకు ప్రయత్నం చేయాలని సూచించారు.

చెరువుల పరిరక్షణపై నివేదిక ఇవ్వండి: హైకోర్టు

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) పరిధిలోని 3,532 చెరువుల రక్షణకు తీసుకుంటున్న చర్యలు, వాటిలో ఆక్రమణల తొలగింపు, ఎన్ని చెరువులకు హద్దులు గుర్తిస్తూ తుది నోటిఫికేషన్ జారీ చేశారనే అంశాలపై స్థాయీ నివేదిక సమర్పించాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రత్యేక సుమోటో రిట్ పిటిషన్‌ను హైకోర్టు ఇటీవల రిజిస్టర్ చేయగా.. బుధవారం మరోసారి చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. నోటిఫికేషన్ జారీచేసే ప్రక్రియ కొనసాగుతోందని ప్రభుత్వం తరఫున న్యాయవాది పొట్టిగారి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం వరకు 2,846 చెరువులకు ప్రాథమిక, 530 చెరువులకు తుది నోటిఫికేషన్లు జారీ చేశామని, మిగిలిన వాటికి సైతం ఇస్తామని చెప్పారు. ఈ పిటిషన్‌ను మూడు నెలల తర్వాతకు వాయిదా వేయాలని కోరారు. 'అప్పుడు మీరు వచ్చి ఎలాంటి పురోగతి లేదని చెప్తే మేం ఏం చేయాలి? కాబట్టి డిసెంబరు 30న మరోసారి పురోగతిపై నివేదిక ఇవ్వాల'ని ధర్మాసనం ఆదేశించింది. ఫైనల్ నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు తాము పర్యవేక్షిస్తామని తెలిపింది. 'చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు పనిని 'లేక్ ప్రొటెక్షన్ కమిటీ' చేస్తుందా, హైడ్రా చేస్తుందా అనేది మాకు సంబంధం లేదు. మాకు కావాల్సింది పని పూర్తి కావడమ'ని వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను డిసెంబరు 30కి వాయిదా వేసింది.

సామాజిక బహిష్కరణపై చర్యలు తీసుకోండి

- డీజీపీకి లేఖ రాసిన బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీసీ కమిషన్ ఆధ్వర్యంలో బహిరంగ విచారణ నిర్వహిస్తున్న క్రమంలో రాష్ట్రంలో అక్కడక్కడా సామాజిక బహిష్కరణ అంశాలు తమ దృష్టికి వచ్చాయని, అలాంటి ఘటనలపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ కోరారు. ఈ మేరకు బుధవారం డీజీపీ జితేందర్‌కు లేఖ రాశారు. నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లోని పలుచోట్ల "గ్రామీణాభివృద్ధి కమిటీలు" అక్కడి బీసీలను కమిషన్ నిర్వహించిన బహిరంగ విచారణలో పాల్గొనకుండా అడ్డుకున్నాయని లేఖలో పేర్కొన్నారు. బీసీ వర్గాలను లక్ష్యంగా చేసుకుని సామాజిక బహిష్కరణకు పాల్పడుతున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని నిరంజన్ విజ్ఞప్తి చేశారు.

94 శాతం సర్వే పూర్తి!

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కులగణన సర్వే బుధవారం నాటికి 94 శాతం పూర్తయింది. సర్వేలో భాగంగా సేకరించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు కంప్యూటరీ కరిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సర్వే నిమిత్తం 1,18,02,726 ఇళ్లను గుర్తించగా, వీటిలో ఇప్పటి వరకు 1,10,98,360 ఇళ్ల నుంచి సమాచారాన్ని సేకరించినట్టు సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 29,82,034 ఇళ్లకు సంబంధించిన సమాచారాన్ని కంప్యూటరీకరించినట్లు వెల్లడించారు. కంప్యూటరీకరణలో ములుగు జిల్లా 70.03 శాతంతో మొదటి స్థానంలో ఉండగా, యాదాద్రి భువనగిరి జిల్లా 59.8 శాతంతో రెండో స్థానంలో ఉంది. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోనూ సర్వే ఊపందుకుంది. సర్వేలో భాగంగా జీహెచ్ఎంసీ పరిధిలో 25,05,517 ఇళ్లను గుర్తించగా ఇప్పటివరకు 20,15,965 నివాసాలలో సమాచార సేకరణ పూర్తయింది.

రాజ్యసభకు నాగబాబు?

- అన్న కోసం ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ యత్నం
- ఖాళీ అయిన మూడిట్లో ఒకటి జనసేనకు దక్కేలా ప్రణాళిక
- దీనిపై బీజేపీ పెద్దలతో పవన్ చర్చలు
- పెద్దల సభలో సేనకు సీటుపై ఓకే!

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాజ్యసభలో జనసేన ప్రాతినిధ్యం కోసం ఆ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో బీజేపీ పెద్దలను కలిసి విన్నవించినట్టు తెలిసింది. రాష్ట్రంలో ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాల్లో తమకు ఒకటి కేటాయించాలని ఆయన కోరినట్లు సమాచారం. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈ విషయాన్ని కేంద్ర పెద్దల వద్ద ఆయన ప్రస్తావించినట్లు తెలిసింది. పవన్ చర్చలు ఫలిస్తే ఆయన అన్న, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు పెద్దల సభలో అడుగు పెట్టడం నల్లేరుపై నడకేకానుంది. జనసేన ఆవిర్భావం నుంచి నాగబాబు పార్టీ కోసం పని చేస్తున్నారు. ప్రస్తుతం పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో అనకాపల్లి పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గంలో పర్యటించి అన్నీ సిద్ధం చేసుకున్నారు. కానీ, కూటమి పార్టీల సీట్లు పంపకాల్లో భాగంగా అనకాపల్లి స్థానాన్ని బీజేపీ తీసుకోవడంతో నాగబాబుకు అవకాశం దక్కలేదు. ఆ సమయంలోనే రాజ్యసభకు పంపిస్తానని నాగబాబుకు పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో మూడు రాజ్యసభ స్థానాలు ఖాళీ కావడంతో దీనిలో ఒకటి తీసుకుని నాగబాబును పెద్దల సభకు పంపించాలని పవన్ భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఢిల్లీ పర్యటనలో ఉన్న డిప్యూటీ సీఎం ఈ విషయాన్ని కేంద్రంలోని బీజేపీ పెద్దల వద్ద ప్రస్తావించినట్లు తెలిసింది. దీనికి వారు కూడా అంగీకారం తెలిపినట్లు సమాచారం. ఈ చర్చలు ఫలిస్తే రాజ్యసభలో కూడా జనసేనకు ప్రాతినిధ్యం లభించనుంది.



సీఎం రేవంత్‌రెడ్డితో తెలంగాణ యువ ఐపీఎస్‌లు భేటీ అయ్యారు. 2023, 2024 బ్యాచ్‌కు చెందిన నూతన ఐపీఎస్‌లు సీఎంను జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

రైతు భరోసా.. సంక్రాంతి నుంచి

(మొదటిపేజీ తరువాయి)

పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు మూడు విడతలుగా రుణమాఫీ చేసింది. ఈ మూడు విడతల్లో తెల్ల రేషన్ కార్డులు లేనివారు, కుటుంబ నిర్ధారణ కాని వాళ్లు.. ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, పేర్ల పరంగా తప్పులు దొర్లిన వారు.. ఇలా సుమారు 3.50 లక్షల మందికి రుణమాఫీ జరగలేదు. ఈ మేరకు 'క్రాప్ లోన్ వీవర్ (సీఎల్‌డబ్ల్యు)యాప్' ను ప్రత్యేకంగా రూపొందించి సదరు రైతుల వివరాలు నమోదు చేయాలనిమండల వ్యవసాయ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఆగస్టు 29వ తేదీ నుంచి సెప్టెంబరు నాలుగో తేదీ వరకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. తర్వాత నుంచి ఏఈవోలు క్షేత్రస్థాయికి వెళ్లి రైతులు, కుటుంబసభ్యుల వివరాలు, ఆధార్ కార్డులు సేకరించి, సెల్ఫీలు దిగి, రైతు నుంచి డిక్లరేషన్ తీసుకొని, ఆ 'యాప్'లో నమోదు చేశారు. కుటుంబ నిర్ధారణ పూర్తిచేశారు. ఇతర తప్పులను కూడా సరిచేశారు. ఇక కెనరా బ్యాంకుతోపాటు కొన్ని బ్యాంకులు రాష్ట్ర ప్రభుత్వానికి పంట రుణాలు తీసుకున్న రైతుల వివరాలు నిర్ణీత వ్యవధిలో ఇవ్వలేదు. దీంతో ప్రభుత్వం మరొక అవకాశం ఇచ్చింది. ఈ మేరకు 50 వేల మంది రైతుల అప్పుల వివరాలను బ్యాంకర్లు సమర్పించారు. దీంతో మొత్తం కలిపి 4 లక్షల మంది రైతుల లెక్క తేలింది. ఈ రైతులకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేయటానికి రూ. 2,700 కోట్ల నుంచి రూ. 2,800 కోట్లు అవసరమవుతున్నాయి. రైతు సదస్సు రోజున లాంఛనంగా చెక్కులు పంపిణీ చేసి... ఆ తర్వాత డిసెంబరు మొదటి వారంలో ఉద్యోగులకు వేతనాలు, పింఛన్లు చెల్లించిన తర్వాత... రుణ మాఫీ సొమ్మును రైతుల ఖాతాల్లో జమచేయనున్నారు. దాంతో రూ. 2 లక్షల వరకు బకాయిలున్న రైతుల రుణ మాఫీ ప్రక్రియ పూర్తవుతుంది. ఆ తర్వాత రూ. 2 లక్షలకు మించి బకాయిలున్న రైతులకు రుణమాఫీ చేయాల్సి ఉంటుంది.

'భరోసా'పై పరిమితి?

రైతుభరోసాకు ప్రాతిపదికపై ప్రజల్లో జోరుగా చర్చ సాగుతోంది. వ్యవసాయ భూముల జాబితాలో భూములు ఉన్నా కూడా సాగుకు యోగ్యంగా లేని



వాటిని ఈ రైతుభరోసా పథకం నుంచి తొలగించనున్నారు. అంటే.. బీడు భూములు, రాళ్లు రప్పలు, కొండలు, గుట్టలున్న భూములతో పాటు స్థిరాస్తి వెంచర్లుగా మారినప్పటికీ వ్యవసాయ భూముల జాబితాలో ఉన్నవాటికి పెట్టుబడి సాయం నిలిపివేయనున్నారు. ఆ మేరకు పంటలు సాగుచేసే భూములకు మాత్రమే ఇస్తారని, సాగు చేయకుండా ఖాళీగా పెట్టిన భూములకు భరోసా ఇవ్వరనే చర్చ కూడా సాగుతోంది. ఇక ప్రతి రైతుకు ఎంత విస్తీర్ణం ఉంటే అంత భూమికి రైతు భరోసా ఇవ్వాలా? వద్దా? అనే చర్చ కూడా ఉంది. అయితే ఎక్కడో ఒక చోట నియంత్రణ పెట్టాలనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి ఈ నియంత్రణ ఎన్ని ఎకరాలకు పెడతారు? పదెకరాల వరకు ఇస్తారా? ఏడున్నర ఎకరాల వరకు పరిమితం చేస్తారా? అనేది మంత్రివర్గ ఉపసంఘం నివేదిక, శాసనసభలో చర్చ నిర్వహించిన తర్వాత నిర్ణయించే అవకాశాలున్నాయి.

యాసంగిలోనూ సన్నాలకు బోనస్?

సన్న వడ్లకు క్వింటాకు రూ. 500 చొప్పున ఇస్తున్న ప్రోత్సాహకాన్ని ఈ యాసంగి పంటకాలంలో కూడా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. అయితే ఈ వానాకాలానికో, యాసంగికో పరిమితం కాకుండా యేటా, ప్రతి పంటకాలంలో కూడా సన్నాలకు రూ. 500 ప్రోత్సాహకాన్ని ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తున్న రైతులు ఈ విషయంపై ఆరా తీస్తున్నారు. యాసంగిలో కూడా సన్నాలకు బోనస్ ఇస్తారా? అని వ్యవసాయశాఖ అధికారులను, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను అడుగుతున్నారు. ఈ అంశాన్ని ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికితీసుకెళ్లగా సన్నాలకిచ్చే బోనస్ పథకం కొనసాగుతుందని, ఈమేరకు రైతులకు కూడా సమాచారం, స్పష్టతనివ్వాలని ఉన్నతాధికారులు మౌఖికంగా ఆదేశాలు ఇచ్చినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

రైతు సదస్సుకు సర్వం సిద్ధం

తుమ్మల చేతుల మీదుగా నేడు ప్రారంభం

మహబూబ్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వం మహబూబ్‌నగర్‌లో నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర స్థాయి రైతు సదస్సుకు సర్వం సిద్ధమైంది. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అమిస్తాపూర్ వద్ద ఏర్పాటు చేసిన రైతు సదస్సు వేదికను అధికారులు సిద్ధం చేశారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, యాంత్రీకరణపై అవగాహన కల్పించేందుకుగాను సదస్సు జరిగే ప్రాంగణంలో 155 స్టాళ్లతో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న ఈ రైతు సదస్సును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభం కానుంది. సదస్సులో తొలి రోజు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన సుమారు 5 వేల మంది రైతులు పాల్గొంటారు. రెండో రోజు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన మరో 5 వేల మంది రైతులు పాల్గొంటారు. వీరిందరికి వివిధ అంశాలపై ఈ సదస్సులో అవగాహన కల్పిస్తారు. ఇక, చివరి రోజు, శనివారం జరిగే సదస్సుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతారు. ఈ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి లక్ష మంది రైతులను తీసుకొచ్చేందుకు అధికారులు ప్రణాళిక చేస్తున్నారు.

30న 4 లక్షల మంది రైతులకు రుణమాఫీ

- బ్యాంకు ఖాతాల్లోకి 'బోనస్' జమ కూడా
- వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలో పంటల బీమా
- కొహెడ వద్ద అతిపెద్ద మోడల్ మార్కెట్
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటన

షాద్‌నగర్ /షాద్‌నగర్ అర్బన్ నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ అమలు కోసం ఎదురుచూస్తోన్న రైతులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుభవార్త చెప్పారు. వివిధ కారణాల వల్ల నిలిచిపోయిన 4 లక్షల మంది రైతులకు సంబంధించిన మాఫీని మహబూబ్‌నగర్ వేదికగా శనివారం(30వ తేదీ) జరిగే రైతు పండగ కార్యక్రమంలో అమలు చేస్తామని ప్రకటించారు. అలాగే, సన్నరకాల ధాన్యంకు సంబంధించి రైతులకు ఇస్తామన్న రూ.500 బోనస్‌ను కూడా అదే రోజున బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని వెల్లడించారు. వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని, ప్రీమియం సొమ్ము ప్రభుత్వమే చెల్లిస్తుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధ్యక్షతన బుధవారం జరిగిన షాద్‌నగర్ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవంలో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ముఖ్యమంత్రి వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నారని, అందుకే బడ్జెట్‌లో రూ.47 వేల కోట్లు కేటాయించారని తెలిపారు. మహబూబ్‌నగర్ వేదికగా మూడు రోజులు పాటు జరిగే రైతుల పండగ కార్యక్రమంలో భాగంగా ఆఖరి రోజు చేపట్టనున్న రైతు రుణమాఫీ, బోనస్ జమ అంశాలను వెల్లడించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తి చేయాలన్న సంకల్పంతో సీఎం ఉన్నారని చెప్పారు. రంగారెడ్డి జిల్లా కొహెడలో రూ.2వేల కోట్లతో రాష్ట్రంలోనే అతిపెద్ద మోడల్ మార్కెట్‌ను నిర్మించబోతున్నామన్నారు. తెలంగాణలో ఉత్పత్తయ్యే ధాన్యానికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉందని, సన్న బియ్యం ఎగుమతి చేయాలని మలేషియా, ఫిలిపిన్స్ తదితర దేశాలు కోరుతున్నాయన్నారు. రైతు పండగ కార్యక్రమం ద్వారా ఆధునిక సేద్యంపై రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థకు రూ.50వేల కోట్లు బాకీ పడగా అందులో రూ.12వేల కోట్లను తమ ప్రభుత్వం తీర్చిందని మంత్రి తెలిపారు. మిగిలిన మొత్తాన్ని విడతల వారీగా తీరుస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన కీలక పత్రాలు మాయమయ్యాయని ఆరోపించారు. ప్రభుత్వం ఎంత ధాన్యం కొనుగోలు చేసింది ? ఎంతమంది మిల్లర్లకు విక్రయించింది ? తదితర వివరాలు తెలిపే పత్రాలు లేవన్నారు. ఇక, సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజవర్గ అభివృద్ధికి పారిశ్రామిక కారిడార్ ప్రకటిస్తే బీఆర్ఎస్ నేతలు లగచర్లలో కలెక్టర్ సహా అధికారులపై దాడులు చేయడం హేయమని విమర్శించారు.

అన్నదాతకు పెద్దపీట

తొలి ఏడాదిలో రైతుల సంక్షేమానికి రూ.55 వేల కోట్లు!

- 22.22 లక్షల మంది రైతుల రుణమాఫీకి రూ.17,870 కోట్లు
- ఉచిత విద్యుత్ సబ్సిడీకి 10,444 కోట్లు
- ఏడాది పాలనలో వ్యవసాయరంగంపై సీఎంవో ప్రకటన

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం తొలి ఏడాదిలో అన్నదాతకు పెద్దపీట వేసింది. వ్యవసాయరంగంపై ప్రత్యేక దృష్టిసారించిన సర్కారు.. రైతుల సంక్షేమానికి సుమారుగా రూ.55 వేల కోట్లు ఖర్చు చేసింది. కీలకమైన రుణమాఫీతోపాటు రైతుభరోసా, ఉచిత విద్యుత్తు, రైతుబీమా పథకాలకు పెద్దఎత్తున నిధుల కేటాయింపులు చేసినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. తెలంగాణ రైతులను దేశానికే తల మానికంగా నిలపాలనే ఉద్దేశంతో రైతుల సంక్షేమం, అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం తొలి ఏడాదిలోనే భారీగా నిధులు ఖర్చు చేసినట్లు పేర్కొంది. ఏడాదిలో రూ.54,280 కోట్లతో వివిధ పథకాలను అమలు చేసినట్లు ప్రకటించింది. దేశంలోనే వరి సాగు విస్తీర్ణంలో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిందని, 66.77 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా గతంలో ఎన్నడూ లేని విధంగా 153 లక్షల టన్నుల దిగుబడి వచ్చిందని పేర్కొంది. 'దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతులకు ఒకేసారి రూ.2 లక్షల వరకు పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. కేవలం 27 రోజుల్లోనే దాదాపు 22.22 లక్షల మంది రైతుల కుటుంబాలకు దాదాపు రూ.17,870 కోట్ల రుణమాఫీ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసింది. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తామని ఇటీవలే వేములవాడ సభలో సీఎం రేవంత్ ప్రకటించారు. అధికారం చేపట్టిన వెంటనే రైతుల బాగుకు కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేసింది. ఉచిత విద్యుత్తు పథకాన్ని నిరాటంకంగా ప్రజా ప్రభుత్వం మళ్లీ తీసుకు వచ్చింది. రైతులకు ఇచ్చే ఉచిత విద్యుత్తుకు ఈ ఏడాది రూ.10,444 కోట్లు సబ్సిడీగా చెల్లించినట్లు' సీఎంవో వెల్లడించింది. 'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారం చేపట్టిన తొలి మూడు నెలల్లోనే ప్రభుత్వం రైతు భరోసా నిధులను పంపిణీ చేసింది.



యాసంగి సాగుకు పెట్టుబడి సాయంగా ఎకరానికి రూ.5వేల చొప్పున రైతు భరోసా నిధులను రైతులందరి ఖాతాలో జమ చేసింది. మొత్తం 1,57,51,000 ఎకరాలకు రూ.7,625 కోట్లు విడుదల చేసింది. మొత్తం 69,86,519 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో ఈ నిధులు జమ చేసింది. గతంలో ఎన్నడూ లేనంత వేగంగా రైతు భరోసా నిధులను మే నెల మొదటి వారంలోనే జమ చేసినట్లు' సీఎంవో ప్రకటనలో పేర్కొంది. రాష్ట్రంలోని రైతుల తరఫున పంటల బీమా ప్రీమియం చెల్లించేందుకు రూ.1,300 కోట్లు కేటాయించినట్లు వెల్లడించింది. రైతు కుటుంబాలు ధీమాగా ఉండేలా రైతు బీమాను అమలు చేసిందని, ఎవరైనా రైతులు ఏ కారణంతో మరణించినా రూ.5 లక్షల బీమా పరిహారం బాధిత కుటుంబానికి అందిస్తోందని పేర్కొంది. రైతు బీమా పథకం ప్రీమియంగా రూ.1,455 కోట్లు చెల్లించినట్లు వెల్లడించింది.

గతం కన్నా ఎక్కువ కొనుగోలు కేంద్రాలు

రైతులు దళారుల చేతిలో మోసపోకుండా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను కట్టుదిట్టంగా నిర్వహించింది. గతంలో కంటే ఎక్కువ కొనుగోలు కేంద్రాలు నెలకొల్పింది. రైతులు నెలల కొద్దీ ఎదురు చూడకుండా డబ్బులను వేగంగా చెల్లించి రికార్డు నెలకొల్పింది. రబీ సీజన్‌కు సంబంధించి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అవిమ్మిన రైతులకు కేవలం మూడు రోజుల్లోనే డబ్బులు చెల్లించింది. రాష్ట్రంలో దాదాపు 9 లక్షల మంది రైతుల నుంచి రూ.10,547 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసింది. వానాకాలం సీజన్ నుంచి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం సన్న వడ్లకు రూ.500 బోనస్ ప్రకటించింది. కొనుగోలు కేంద్రాల్లో సన్న వడ్లు అమ్మిన రైతులకు బోనస్ చెల్లించింది. దీంతో రాష్ట్రంలో సన్నరకాల వరిసాగు విస్తీర్ణం పెరిగింది. అన్ని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను అమర్చనుంది. తొలి విడతగా 110 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2,601 రైతు వేదికల నుంచి రైతులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడే ఏర్పాట్లు చేసింది.

కేటీఆర్ భ్రమల్లో బతుకుతున్నారు

- కాంగ్రెస్‌ను పెకిలించడం ఎవరి తరం కాదు
- గురుకుల ఘటనలపై సర్కారు సీరియస్
- కాంగ్రెస్ పంచిన 26 లక్షల ఎకరాల అసైన్డ్ లెక్కలు తీస్తున్నాం
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో డిప్యూటీ సీఎం

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ భ్రమల్లో బతుకుతున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌ను కూకటి వేళ్లతో సహా పెకిలించడం ఎవరి తరమూ కాదన్నారు. 'గత కొద్ది రోజులుగా కేటీఆర్ ఏమి.. ఎందుకు మాట్లాడుతున్నాడో అర్థం కావట్లేదు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నడు. కలెక్టర్‌ను పట్టుకుని సన్నాసి అంటున్నాడంటే ఆయన మైండ్ సెట్ సరిగా లేదని అర్థమవుతోంది' అని వ్యాఖ్యానించారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో భట్టి ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. మంత్రుల్లో అభిప్రాయ భేదాలు లేవని, తమవి ఉమ్మడి నిర్ణయాలని చెప్పారు. తాము బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పార్టీ ఫిరాయింపునకు ప్రోత్సహించట్లేదన్నారు. వారే అక్కడ ఇమడలేక గ్రూపులుగా మారి ఆ పార్టీని వీడుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా తమకు టచ్‌లోనే ఉన్నారన్నారు. ప్రగతిశీల ఆలోచన, సంక్షేమం, అభివృద్ధి అనే మూడు అంశాలతో ముందుకెళ్తున్నామని తెలిపారు. రైతు భరోసా విధివిధానాలపై కసరత్తు జరుగుతోందన్నారు. రుణమాఫీ విషయంలో రేషన్ కార్డులు లేక.. పొరపాట్లు జరిగి ఉన్నవాటికి సంబంధించి సర్వే చేసి వారికీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఇటీవల చోటుచేసుకుంటున్న సంఘటనలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు.. ఆయా వసతి గృహాలను ప్రత్యక్షంగా పర్యవేక్షించాలంటూ సీఎం ఆదేశించారని తెలిపారు. 'రాష్ట్రంలో ఏయే కులాల వారు ఎంతమంది? రాజ్యాంగ ప్రవేశిక ప్రకారం అందరూ సమానంగా ఎదిగారా? లేదా? అన్నది తెలుసుకునేందుకు కుల గణన సర్వే చేస్తున్నాం. ఇంతకాలం రాష్ట్రాన్ని దోపిడీ చేసిన బ్యాచ్‌కు ఈ లెక్కలు తీస్తే ఇబ్బంది.. అందుకే వ్యతిరేకిస్తోంది' అన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించామని, త్వరలోనే పెద్ద ఎత్తున ప్రారంభోత్సవాలు ఉంటాయని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో పంచిన 26 లక్షల ఎకరాల అసైన్డ్ భూముల వివరాలు సేకరిస్తున్నామని, ధరణి వచ్చిన తర్వాత వాటి పరిస్థితి ఏంటన్నది ఆరా తీస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న అసైన్డ్ భూములను తిరిగి అర్హులైన వారికి పంచుతామని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ గ్రాఫ్ పెరుగుతోందని, బీజేపీకి డౌన్ ట్రెండ్ ప్రారంభమైందని భట్టి చెప్పారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారని, మధ్యప్రదేశ్‌లో బీజేపీ మంత్రిని కాంగ్రెస్ అభ్యర్థి ఓడించారని గుర్తు చేశారు.

కేటీఆర్ దందాలు బయటికి తెస్తున్నారనే: ఆది శ్రీనివాస్

అధికారం పోయినా కేటీఆర్‌కు ఇంకా అహంకారం తగ్గలేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సీఎం రేవంత్ మొదలుకుని సిరిసిల్ల జిల్లా కలెక్టర్ వరకు అందరిపైనా కేటీఆర్ నోరు పారేసుకుంటున్నాడని మండిపడ్డారు. సీఎల్పీ మీడియా హాల్లో మాట్లాడుతూ.. సిరిసిల్లలో గత పదేళ్లుగా కేటీఆర్ చేసిన భూ, ఇసుక దందాలను కలెక్టర్ బయటకు తీస్తున్నందునే ఆయనపై అక్కసు వెళ్లగక్కుతున్నాడన్నారు. సుమారు వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూములను కేటీఆర్ తన అనుచరులకు అప్పనంగా కట్టబెట్టారని ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలు ప్రజా విశ్వాసాన్ని కోల్పోయాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి అన్నారు. సచివాలయ మీడియా సెంటర్‌లో మాట్లాడుతూ.. ప్రతిపక్ష పార్టీలు నిర్మాణాత్మక పాత్రను పోషించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా సంకుచిత మనస్తత్వంతో వ్యవహరిస్తున్నాయని ధ్వజమెత్తారు. అధికారాన్ని కోల్పోయి, అసహనంతో ఉన్న ఒక పార్టీ, మతతత్వవాదంతో అడ్డదారిన అందలమెక్కేందుకు ప్రయత్నిస్తున్న మరో పార్టీ.. సర్కారుపై కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఈనెల 30న మహబూబ్‌నగర్‌లో సీఎం సభను విజయవంతం చేయాలన్నారు.



గాంధీభవన్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి

కాళేశ్వరం ప్యాకేజీ పనుల వేగవంతానికి ఆదేశం

నల్లవాగు ఎత్తిపోతలకు గ్రీన్‌సిగ్నల్.. నీటి పారుదల శాఖ సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మల్లన్నసాగర్ నుంచి సింగూరు రిజర్వాయర్‌కు 20 టీఎంసీలు నీటిని తరలించడానికి ఉద్దేశించిన ప్యాకేజీ-19ఏ పనులను పునఃప్రారంభించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డితో కలిసి కాళేశ్వరం ప్యాకేజీ పనులపై జలసౌధలో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ప్యాకేజీ 19ఏ కింద ప్రధాన కాలువ 82వ కిలోమీటరు నుంచి 109.5 కిమీ వరకు చేపట్టాల్సిన కెనాల్ లైనింగ్, పంప్‌హౌస్ తదితర పనులను పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆదేశించారు. సింగూరు కాలువల లైనింగ్ పనులకు రూ.168.30కోట్లతో పరిపాలన అనుమతి ఇచ్చిన నేపథ్యంలో పూడికతీత పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు చెప్పారు. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాల పనుల్లో వేగం పెంచాలన్నారు. పెద్దారెడ్డిపేట ఎత్తిపోతల పథకం పనులకు డిసెంబరు నెలాఖరులో శంకుస్థాపన చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని నల్లవాగు మీడియం ప్రాజెక్ట్ కెనాల్‌తోపాటు జిల్లాలోని 38 చిన్న నీటిపారుదల చెరువులకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కారముంగి గ్రామంలో మంజీరా నదిపై చేపట్టనున్న నల్లవాగు ఎత్తిపోతల పథకానికి మంత్రి ఈ సందర్భంగా ఆమోదం తెలిపారు. 6030 ఎకరాలకు సాగునీటిని అందించేలా రూ.73.70 కోట్ల వ్యయంతో చేపట్టే నల్లవాగు పథకానికి అవసరమైన పరిపాలన అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్, పునరావాసం, పునర్‌నిర్మాణ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, డిసెంబరు 4న పెద్దపల్లి వేదికగా సీఎం సభ జరగనున్న నేపథ్యంలో కరీంనగర్ ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి... కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎం సభను జయప్రదం చేయాలని కోరారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.



భారత క్రికెట్‌లో పెను తుపాను సూర్యకుమార్ యాదవ్. అతడు క్రీజ్‌లోకి వచ్చింది మొదలు పెవిలియన్‌కు వెళ్లేదాకా... బౌండరీల వర్షం కురుస్తూనే ఉంటుంది. ఒకప్పటి సాధారణ ఆటగాడు నేడు అసాధారణ ఆటతో చెలరేగుతున్నాడంటే... అది అతనొక్కడి విజయం కాదు. అన్నింటా తోడై... స్ఫూర్తి మంత్రమై... సూర్యలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిన అతడి సహచరి... **దేవిషా శెట్టి**కీ అందులో భాగం దక్కుతుంది. జాతీయ టీ20 జట్టు కెప్టెన్‌గా అతడు అపురూప విజయాలు అందిస్తున్నాడంటే... దాని వెనుక ఆమె కృషి వెల కట్టలేనిది.

ఆమే అతడి విజయం

దేవిషా శెట్టి పేరు ప్రపంచానికి తెలిసింది భారత స్టార్ క్రికెటర్ సూర్యకుమార్ యాదవ్ జీవిత భాగస్వామిగానే కావచ్చు... కానీ ఆమెకంటూ ఒక గుర్తింపు ఉంది. ముంబయిలో పుట్టి పెరిగిన దేవిషా బహుముఖ ప్రజ్ఞాశాలి. స్వయంశక్తితో ఎదిగిన పారిశ్రామికవేత్తగా, మంచి నర్తకిగా, నాట్య గురువుగా, సామాజిక కార్యకర్తగా విభిన్న పాత్రలు పోషిస్తున్నారు. 'బాంబే స్కాటిష్ స్కూల్'లో ప్రాథమికోన్నత విద్య పూర్తి చేసిన ఆమె... 'ఆర్ఏ పొదార్ కామర్స్ అండ్ ఎకనామిక్స్ కాలేజీ' నుంచి డిగ్రీ పట్టా పొందారు. 'హెచ్ఆర్ కాలేజీ ఆఫ్ కామర్స్ అండ్ ఎకనామిక్స్'లో మాస్టర్స్ చదివారు. ఆమె తండ్రి దేవ్‌దాస్ శెట్టి హోటల్ రంగంలో పని చేస్తున్నారు. తల్లి లత గృహిణి. వీరి ఇద్దరు కూతుర్లలో రెండో సంతానం దేవిషా.

నాట్య గురువుగా మొదలై...

బాల్యం నుంచి దేవిషాకు కళలంటే మక్కువ. అందుకే చదువుతూనే సంప్రదాయ నాట్యం అభ్యసించారు. కళాకారిణిగా పలు ప్రదర్శనలు ఇచ్చారు. ఆ తరువాత నాట్య గురువుగా తన కెరీర్‌ను ప్రారంభించారు. ఇప్పుడామె ముంబయిలో పేరుపొందిన డ్యాన్స్ కోచ్. అంతేకాదు... సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనేవారు. చదువుకొనే రోజుల్లో స్వచ్ఛంద సంస్థ అయిన 'లైట్‌హౌస్ ప్రాజెక్ట్'తో కలిసి రెండేళ్లపాటు వాలంటీర్‌గా పని చేశారు. అనాథలు, అణగారిన వర్గాల పిల్లలకు అండగా నిలిచే సంస్థ అది. ఆ సంస్థ తరుపున పలు మురికివాడల్లో పర్యటించారు.

పరిచయం అలా...

సూర్యకుమార్ యాదవ్‌ను దేవిషా తొలిసారి చూసింది తన కాలేజీ వేడుక(2012)లో. ఆ వేడుకలో ఆమె నాట్యం చూసి ముగ్ధుడయ్యాడు సూర్య. అక్కడే ఇద్దరికీ పరిచయమైంది. తరువాత స్నేహితులయ్యారు. కొన్నాళ్ల స్నేహంలో మనసులు కలిశాయి. దేవిషా డ్యాన్స్‌ను ఆస్వాదిస్తూ సూర్య... మైదానంలో అతడి సొగసరి షాట్లకు చప్పట్లు కొడుతూ ఆమె... ఒకరి కోసం ఒకరన్నట్టు నాలుగేళ్ల వారి ప్రేమాయణం సాగింది. ఆ బంధాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాలని... ఇకపై కలిసి జీవిద్దామని నిర్ణయించుకుని... 2016లో ఇద్దరూ ఒక్కటయ్యారు.

అండగా... ఆత్మస్థైర్యంగా...

భార్యంటే భర్తలో సగం. దాన్ని అక్షర సత్యం చేసి చూపారు దేవిషా. పెళ్లి నాటి నుంచి జీవిత భాగస్వామిగా సూర్య కెరీర్‌కు ఆమె మూల స్తంభం అయ్యారు. ఇప్పుడైతే కళ్లు చెదిరే షాట్లతో అలరిస్తున్నాడు కానీ... కెరీర్ ఆరంభంలో సూర్య ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నాడు. ఎత్తుపల్లాలను చూశాడు. అలాంటి సమయంలో అతడికి అండగా నిలిచారు దేవిషా. ఒక దశలో తన ప్రతిభపై తనకే సందేహపడినప్పుడు... అతడిలో ఆత్మస్థైర్యం నింపారు. శారీరకంగానే కాకుండా... మానసికంగానూ సూర్యను దృఢంగా మార్చడంలో దేవిషా కృషి అమూల్యం. భారత జట్టులో చోటు కోసం ప్రయత్నించి విఫలమైనప్పుడు... ఇక తనకు అది అందదని అనుకున్నప్పుడు ఆమే ధైర్యం చెప్పారు. అతడి ఆటపై అతడికి నమ్మకం కలిగించి, బలహీనతలను అధిగమించేలా ఆత్మవిశ్వాసాన్ని నింపి... తిరుగులేని ఆటగాడిగా తీర్చిదిద్దడంలో సఫలం అయ్యారు. అందుకే సంతోషమైనా... బాధైనా... విజయమైనా... వైఫల్యమైనా సూర్య తొలుత తన భార్యతోనే పంచుకొంటాడు. ముఖ్యంగా తీవ్ర ఒత్తిడిలోకి వెళ్లినప్పుడు, మానసికంగా కుంగిపోయినప్పుడు... అతడికి గుర్తుకువచ్చేది దేవిషా మాత్రమే. అలాగే ఆమె కెరీర్‌కు ఏమేం కావాలో అవన్నీ సూర్య చేసి పెడతాడు. అడిగినవన్నీ సమకూర్చుతాడు. ఇద్దరి మధ్య ఎలాంటి బేషజాలు, ఎక్కువ తక్కువ అనే భావనలు లేవు.



జంతు ప్రేమికులు...

దేవిషా అందించిన ప్రోత్సాహం, సహకారం, ప్రేమే నేడు సూర్యను జాతీయ టీ20 జట్టుకు సారథిని చేసింది. పలు ఇంటర్వ్యూల్లో సూర్య ఈ విషయం పంచుకున్నాడు. దేవిషాకు భర్త అంటే ప్రాణం. అతడి గెలుపే ఆమె గెలుపు. అతడి కల ఆమె కల. ఒకరిపై ఒకరికున్న ప్రేమానురాగాలే తమ అన్యోన్య దాంపత్యానికి పునాది అంటున్న ఆమెకు ఇన్‌స్టాలో దాదాపు ఏడు లక్షలమంది ఫాలోవర్స్ ఉన్నారు. అక్కడ ఎక్కువగా సూర్యతో కలిసివున్న మధుర క్షణాలనే ఆమె పంచుకొంటారు. వంటలు, కేక్‌లు చేయడం ఆమె అభిరుచి. జంతువులంటే ఇద్దరికీ ప్రాణం.

ప్రతి సందర్భంలోనూ...

2021లో జాతీయ జట్టుకు ఎంపికైన సూర్య... ఆ మరుసటి ఏడాది టీ20 ప్రపంచ కప్‌లో దుమ్మురేపే బ్యాటింగ్‌తో పతాక శీర్షికలకు ఎక్కాడు. అతడి కెరీర్‌ను మలుపు తిప్పిన ఇన్నింగ్స్ అది. 360 డిగ్రీల ఆటగాడిగా పేరు గడించిన దక్షిణాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలర్స్ సైతం అతడి బ్యాటింగ్‌కు మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు. ఏబీలా 360 డిగ్రీల ఆటగాడిగా పోలుస్తూ సూర్యను సీనియర్లు, అభిమానులు ఆకాశానికి ఎత్తినప్పుడు అందరికంటే ఎక్కువ సంతోషపడింది దేవిషానే. తన ఆనందాన్ని నాడు ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. మ్యాచ్ ముగిసిన వెంటనే మైదానం నుంచి భార్యకు వీడియో కాల్ చేసిన సూర్య... భావోద్వేగానికి లోనయ్యాడు. అలాగే ఈ ఏడాది టీ20 ప్రపంచ కప్ ఫైనల్లో బౌండరీ లైన్‌పై అద్భుతమైన క్యాచ్‌ను అందుకొని... భారత్‌కు చిరస్మరణీయ విజయం అందించాడు. అప్పుడూ తన భార్యను పొగడకుండా ఉండలేకపోయాడు. దేవిషాతో ఫొటోలను ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తూ... 'నిజానికి అత్యంత విలువైన క్యాచ్ నేను ఎనిమిదేళ్ల కిందటే పట్టాను' అని రాసుకొచ్చాడు. ఆమెతో కలిసి వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టి ఎనిమిదేళ్లు పూర్తయ్యాయనే ఉద్దేశం అతడిది. దేవిషా లేనిదే తాను లేనని ప్రతి సందర్భంలోనూ అతడు గుర్తు చేస్తూనే ఉంటాడు.

పండ్ల మొక్కలు పెంచేద్దాం..!

పూల మొక్కలు, పండ్ల మొక్కలు పెంచాలనే ఆసక్తి చాలామందికి ఉంటుంది. కానీ ఇంటి పరిసరాల్లో మొక్కలను పెంచడానికి సరిపోయే స్థలం లేదని బాధపడుతూ ఉంటారు. అలా కాకుండా బాల్కనీలో చిన్న కుండీల్లో సులువైన పద్ధతుల్లో పెంచుకునే పండ్ల మొక్కల వివరాలు తెలుసుకుందాం.



బొప్పాయి

- బోన్సాయి రకం బొప్పాయి చెట్టును కుండీలో పెంచవచ్చు. ఈ పండ్లు చాలా తీయగా రుచికరంగా ఉంటాయి కూడా. ఈ చెట్టును పెంచడానికి పద్దెనిమిది అంగుళాల కన్నా ఎక్కువ లోతున్న కుండీని ఎంచుకోవాలి. అందులో ఇసుక పాళ్లు ఎక్కువగా ఉండే నల్ల మట్టిని నింపాలి. దీనిలో యూరియా తదితర ఎరువులు కలపాలి. నర్సరీ నుంచి బోన్సాయి రకం బొప్పాయి మొక్కను తెచ్చి కుండీలో లోతుగా నాటాలి. ప్రతి రోజూ తగినన్ని నీళ్లు పోస్తూ సూర్యరశ్మి తగిలేలా ఉంచాలి. నాలుగు నుంచి ఆర్నెల్లలో బొప్పాయి కాత ఆరంభమవుతుంది.



స్ట్రాబెర్రీ

- ఈ మొక్కని కుండీలో పెంచడం చాలా సులువు. చలికాలంలో ఇది వేగంగా పెరుగుతుంది కూడా. ఈ మొక్కని పెంచడానికి అంతగా లోతు లేని వెడల్పాటి కుండీని ఎంచుకోవాలి. దీనిలో తోట మట్టి నింపాలి. ఇందులో స్ట్రాబెర్రీ గింజలు చల్లి మొక్కలు పెంచవచ్చు. లేదంటే నర్సరీ నుంచి స్ట్రాబెర్రీ మొక్కను తెచ్చి నాటవచ్చు. ఈ మొక్క పెరుగుతున్నపుడు దానికి ఊతగా కర్ర లేదా చెక్కను నిలబెట్టాలి. పెద్దగా సంరక్షణ అవసరం లేదు.



కివీ

- పిల్లలకు, పెద్దలకు ఇష్టమైన పండు ఇది. చలికాలంలో ఈ పండు మొక్కను పెంచడం చాలా సులువు. బోన్సాయి రకాన్ని కూడా కుండీలో పెంచవచ్చు. లోతుగా ఉన్న పెద్ద కుండీలో తోటమట్టి, సేంద్రియ ఎరువు కలపాలి. కనీసం పది వారాల వయసు ఉన్న మొక్కను నర్సరీ నుంచి తెచ్చి కుండీలో నాటాలి. ఈ మొక్కకు ఎండ తగిలేలా ఉంచి రోజుకు రెండు పూటలా దానిపై నీరు చిలకరించాలి.



నిమ్మ

- ఎండ తగులుతూ ఉంటే నిమ్మ మొక్క కూడా వేగంగానే పెరుగుతుంది. ఒక కుండీలో తోటమట్టి, కొబ్బరి పీచు, సేంద్రీయ ఎరువు, ఆవుపేడ వేసి బాగా కలపాలి. ఇందులో నిమ్మ మొక్కను తెచ్చి నాటాలి. లేదంటే నిమ్మ గింజలను పలుచని పేపర్లో మొలకెత్తించి కూడా నాటవచ్చు. ఈ మొక్క పెరుగుతున్నపుడు దానిపై కొన్ని నీళ్లను చిలకరిస్తే చాలు. ఈ మొక్కకు ముళ్లు కూడా ఉంటాయి.

మధుమేహం ఉన్నట్లేనా!

మహిళలను వేధిస్తున్న ప్రధాన సమస్య మధుమేహం. దీనిని ప్రారంభ దశలో గుర్తిస్తే సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. మధుమేహం ఉన్న మహిళల్లో నాలుగు ప్రధాన లక్షణాలు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. అవి...

అధిక దాహం

- రక్తంలో చక్కెర స్థాయి ఎక్కువైనపుడు మూత్రపిండాలు అదనంగా ఉన్న గ్లూకోజ్‌ను బయటికి పంపేందుకు నిరంతరం శ్రమిస్తుంటాయి. దీనివల్ల శరీరంలో ఉన్న నీరు మూత్ర రూపంలో విసర్జితమవుతుంది. వెంటనే శరీరంలో తేమ శాతం తగ్గి దాహమేస్తుందన్న భావన కలుగుతుంది. అంతేకాకుండా మూత్రాశయంలో మంట, దురద వంటివి బాధిస్తుంటాయి. ఈ సమస్యలు రాత్రిపూట ఎక్కువగా కనిపిస్తుంటాయి.



ఇన్సులిన్ నిరోధకత

- మహిళల్లో హార్మోన్ల అసమతుల్యత కారణంగా పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్(పీసీఓఎస్) ఏర్పడుతుంది. దీని వల్ల శరీరం ఇన్సులిన్‌ను సరిగా ఉపయోగించుకోలేదు. అప్పుడు టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశం ఉంది. దీని కారణంగా నెలసరి సరిగా రాకపోవడం, శరీరం బరువు పెరగడం, మొటిమలు రావడం వంటి సమస్యలు కనిపిస్తాయి.

మూత్రాశయ వ్యాధులు

- శరీరంలో చక్కెర స్థాయి పెరిగినపుడు మూత్రంలో గ్లూకోజ్ సాంద్రత పెరుగుతుంది. దీనివల్ల మూత్రాశయంలో హానికారక బ్యాక్టీరియాలు పెరిగే ప్రమాదముంటుంది. తరచూ మూత్ర విసర్జన, శరీరం త్వరగా అలసిపోవడం, నీరసం, కళ్లు మసకబారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

నెలసరి సమస్యలు

- మధుమేహం ఉన్నట్లయితే మహిళల్లో రుతుచక్రం అస్తవ్యస్తమవుతుంది. నెలసరి సమయంలో అధిక రక్తస్రావం, నెలసరి సరిగా రాకపోవడం వంటి సమస్యలు కనిపిస్తాయి. అధిక గ్లూకోజ్ కారణంగా హార్మోన్ల అసమతుల్యత తద్వారా ప్రత్యుత్పత్తి వ్యవస్థ దెబ్బతింటుంది.

హృదయాలకు అండగా..!

ఆడుతూ పాడుతూ గడపాల్సిన బాల్యంలో గుండె జబ్బు పాలైంది. అంతలోనే రోడ్డు ప్రమాదం వెంటాడింది. కలలు కన్న ప్రపంచ సుందరి కిరీటం తృటిలో చేజారింది. అయినా ఆత్మవిశ్వాసంతో లక్ష్య సాధన కోసం పని చేస్తోంది మాజీ మిస్ వరల్డ్ మొదటి రన్నరప్ శ్రీ సైని. సవాళ్లు ఎదురైనా కుంగిపోకూడదని చెబుతూ... గుండె సంబంధిత వ్యాధులపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పిస్తోంది.

"నేను పంజాబ్‌లోని లూధియానాలో పుట్టాను. నాకు అయిదేళ్ల వయసు ఉన్నపుడే కుటుంబంతో కలిసి అమెరికా వెళ్లిపోయా. అక్కడే పాఠశాలలో చేరా. నాకు నృత్యం చేయడమంటే చాలా ఇష్టం. ఆటలు కూడా బాగా ఆడేదాన్ని. ఒక రోజు పాఠశాలలో నిర్వహించిన పరుగు పందెంలో ఓడిపోయా. అందరిలా నేనెందుకు వేగంగా పరుగెత్తలేకపోయానో అప్పుడు నాకు అర్థం కాలేదు. ఒకరోజు మా అమ్మ నన్ను మామూలు ఆరోగ్య పరీక్షల కోసం ఆసుపత్రికి తీసుకెళ్లింది. అప్పుడు నాకు పన్నెండేళ్లు ఉంటాయి. నా చేయి పట్టుకుని నాడి పరీక్షిస్తున్న వైద్యుని ముఖంలో రంగులు మారడాన్ని నేనిప్పటి వరకు మర్చిపోలేదు. నా గుండె అయిదు సెకన్లు కొట్టుకోలేదని ఆ వైద్యుడు చెప్పాడు. వెంటనే ఆరోగ్య పరీక్షలన్నీ పూర్తి చేసి నా గుండెలో బ్లాక్ ఉందని, దానివల్లనే గుండె నిర్ణీత లయలో కొట్టుకోవడం లేదని చెప్పారు. కుటుంబ సభ్యుల రోదనల మధ్యనే నాకు శస్త్రచికిత్స చేసి పేస్‌మేకర్ అమర్చారు. జీవితంలో ఎప్పటికీ నృత్యం చేయకూడదని, శ్రమ అనిపించే ఆటలు ఆడకూడదని వైద్యులు చెప్పినపుడు నా వేదనకు అంతు లేకుండా పోయింది.

ఆత్మవిశ్వాసంతో....

ఎప్పుడో ఎనభై ఏళ్ల తరవాత అమర్చాల్సిన పేస్‌మేకర్‌ను నాకు పన్నెండేళ్లకే పెట్టాల్సి వచ్చింది. దీని వల్లనే నేను ఇంకా బతికి ఉన్నా అని అనుక్షణం గుర్తుకు వచ్చేది. శస్త్రచికిత్స తరవాత నేను కోలుకోవడానికి చాలా నెలలు పట్టింది. ఎప్పుడూ మంచంలోనే ఉండడం వల్ల ఒంటరితనం వేధించేది. కాస్త కోలుకున్నాక పాఠశాలకు వెళ్లడం మొదలుపెట్టా. నెలలపాటు హాజరు లేనందున అక్కడ ఇబ్బందులు తప్పలేదు. కన్నీళ్లు దాచుకుని నాకు నేనే ధైర్యం చెప్పుకొనేదాన్ని. ఎవరు మనల్ని బాధపెట్టినా వారితో మనం ప్రేమగా నే వ్యవహరించాలని అమ్మ చెప్పడం నన్ను ఆలోచనలో పడేసింది. అదే సమయంలో మిస్ వరల్డ్ పోటీలు, ఆ పోటీదార్ల సానుకూల దృక్పథం నన్ను ఆకర్షించాయి. నేను కూడా ఈ పోటీల్లో పాల్గొనాలని బలంగా నిర్ణయించుకున్నా. పాఠశాల విద్య పూర్తయి కాలేజీలో చేరిన కొన్నాళ్ళకే కారు ప్రమాదంలో నా ముఖం పూర్తిగా కాలిపోయింది. నన్ను నేను అద్దంలో చూసుకోవడానికే భయపడేదాన్ని. ఒక ఏడాది పాటు కాలేజీ మానేస్తే ముఖానికి సర్జరీ చేస్తామని వైద్యులు చెప్పారు. కానీ పాఠశాల సంఘటనలు గుర్తుకు వచ్చి నేను ఎలా కనిపించినా సిగ్గుపడకుండా కాలేజీకి వెళ్లి చదువుకోవాలని నిర్ణయించుకున్నా. కాలిన గాయాలకు ఎండ తగలకుండా తలపై టోపీ, ముఖానికి ముసుగు వేసుకునేదాన్ని. ఒక వైపు చదువుకుంటూనే మరోవైపు ప్రపంచ సుందరి పోటీలకు సన్నద్ధమవుతూ ఉండేదాన్ని. నిరంతర సాధన, పట్టుదలతో 'మిస్ వరల్డ్ అమెరికా'గా ఎంపికయ్యా. 'ప్రపంచ సుందరి 2021' పోటీల్లో మొదటి రన్నరప్‌గా నిలిచా. ఈ సంఘటన నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. నాకు అందిన ఈ గౌరవం ఆసరాగా ప్రజలకు మంచి చేయాలని నిర్ణయించుకున్నా.





క్యాన్సర్ కంటే ప్రమాదం....

ప్రపంచంలో మూడో వంతు మంది అంటే ఏటా 18 మిలియన్ల మంది గుండె జబ్బుల కారణంగానే చనిపోతున్నారు. క్యాన్సర్ కంటే గుండె సంబంధిత వ్యాధులే ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. ఆరోగ్యకరమైన జీవన శైలి, గుండె ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గుండె పరీక్షల గురించి ప్రపంచవ్యాప్తంగా ప్రజలందరికీ అవగాహన కల్పించడమే జీవిత లక్ష్యంగా నిర్దేశించుకున్నా. ఈ ప్రయత్నం వల్ల 80 శాతం మరణాలను నివారించవచ్చని నా అభిప్రాయం.

"నాకు ఇప్పటిదాకా ఎనిమిదిసార్లు గుండెకు శస్త్రచికిత్స జరిగింది. రెండుసార్లు పేస్‌మేకర్ మార్చారు. పేస్‌మేకర్లో ఉండే బ్యాటరీలు నిర్ణీత సమయం వరకు మాత్రమే పనిచేస్తాయి. తరవాత కొత్తదాన్ని అమర్చాల్సి ఉంటుంది. 'నా గుండె చాలా పెద్దది. దానికి జనరేటర్ అమర్చండి' అని వైద్యులతో హాస్యమాడుతూ ఉంటాను."

సేవా దృక్పథంతో...

శారీరకంగా, మానసికంగా ఎన్నో కష్టాలు అనుభవించాను. కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకొనేవారు ఎవరో ఒకరు ఉండాలి. కానీ ఏ సాయం అందని అభాగ్యులు ఎందరో మన చుట్టూ జీవిస్తున్నారు. అలాంటివారికి సహాయం చేయాలని నిర్ణయించుకున్నాను. ఇతరులకు చేయూత అందిస్తే... అది వారి బంగరు భవిష్యత్తుకు భరోసా ఇచ్చినవారం అవుతాం. మనవల్ల ఏ ఒక్కరి జీవితం మలుపు తిరిగినా చాలు... నాకు అంతకు మించిన సంతృప్తి మరొకటి ఉండదు. ఈ దిశగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న లాభాపేక్షలేని పలు సంస్థలతో కలిసి పనిచేస్తున్నాను. గుండె ఆరోగ్యానికి సంబంధించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. 'అమెరికన్ హార్ట్ అసోసియేషన్'తో కలిసి పని చేస్తున్నాను. నా ప్రయత్నం ఎంతోమందిని అకాల మరణం నుంచి కాపాడింది. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను స్వీకరించడంలో వాటిని ఎదుర్కోవడంలో అందరికీ మార్గనిర్దేశనం చేస్తున్నాను."

సలహా

గర్భాశయంలో గడ్డలుంటే?

డాక్టర్! నా వయసు 30 ఏళ్లు. పెళ్లై ఐదేళ్లయినా పిల్లలు కలగడం లేదు. వైద్య పరీక్షల్లో ఫైబ్రాయిడ్లు ఉన్నాయని తేలింది. పిల్లలు కలగకపోవడానికి ఫైబ్రాయిడ్లే కారణమా? వీటిని తొలగించుకునే మార్గం లేదా?

\- **ఓ సోదరి,** విశాఖపట్నం.

పునరుత్పత్తి వ్యవస్థలో ప్రధాన పాత్ర పోషించే గర్భాశయంలో ఫైబ్రాయిడ్లు అనే గడ్డలు కొందరు మహిళల్లో తయారవుతూ ఉంటాయి. ఇవి రకరకాల పరిమాణాల్లో ఉంటాయి. ఒకటి నుంచి రెండు సెంటీమీటర్ల కంటే చిన్న ఫైబ్రాయిడ్లను వైద్య చికిత్స సహాయంతో తగ్గించుకోవలసి ఉంటుంది. ఫైబ్రాయిడ్స్ ఉన్న మహిళల్లో నెలసరి స్రావంలో రక్తపు గడ్డలు కనిపించడం, నొప్పి లాంటి లక్షణాలు ఉంటాయి. ఒకవేళ ఫైబ్రాయిడ్స్ చాలా పెద్దవిగా ఉంటే, గర్భసంచి పక్కన ఉండే మూత్రాశయం మీద ఒత్తిడి పడడం మూలంగా మూత్రసంబంధ సమస్యలు (తరచూ మూత్రవిసర్జన చేయవలసి రావడం, మూత్రవిసర్జన పూర్తిగా జరగకపోవడం) మొదలవుతాయి. అలాగే కడుపులో నొప్పి, కడుపు ఉబ్బరం, కొన్నిసార్లు జీర్ణ సమస్యలు కూడా తలెత్తే అవకాశాలుంటాయి. కొన్ని రకాల ఫైబ్రాయిడ్లు గర్భసంచి లోపలి పొరల్లో ఏర్పడతాయి. వీటి వల్ల గర్భస్రావం జరిగిపోవడం, గర్భం దాల్చలేకపోవడం లాంటి సమస్యలు తలెత్తుతాయి.



కొందర్లో ఫైబ్రాయిడ్లు ఉన్నప్పటికీ ఎటువంటి లక్షణాలూ కనిపించకపోవచ్చు. ఇలాంటప్పుడు ఆరు నెలలు లేదా ఏడాదికోసారి అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకుంటూ ఫైబ్రాయిడ్ల పరిమాణాన్ని కనిపెడుతూ ఉండాలి. అలాగే కొందరు మహిళల్లో పెద్ద సైజు ఫైబ్రాయిడ్లు ఉంటాయి. ఇతరత్రా వైద్య చికిత్సలు ఫలితాన్నివ్వవు. కాబట్టి సర్జరీ ద్వారా మాత్రమే వాటికి చికిత్స చేయవలసి ఉంటుంది. ఫైబ్రాయిడ్‌ను మాత్రమే తొలగించే మయోమెక్టమీ లేదా ఫైబ్రాయిడ్స్‌తో పాటు, గర్భసంచిని కూడా తొలగించే హిస్ట్రక్టమీ సర్జరీలను ఎంచుకోవలసి ఉంటుంది. అయితే ఎవరికి ఏ సర్జరీ అవసరం అనేది వారి వారి వయసు, ఫైబ్రాయిడ్ మూలంగా తలెత్తే సమస్యల మీద ఆధారపడి ఉంటుంది. యువతుల్లో ఫైబ్రాయిడ్ల వల్ల గర్భధారణ సమస్యలున్నా, నెలసరి సమస్యలున్నా ఫైబ్రాయిడ్ గడ్డను మాత్రమే తొలగించే మయోమెక్టమీ సర్జరీ అవసరం అవుతుంది. అలా కాకుండా పిల్లలు కలిగి, 40 నుంచి 45 ఏళ్లు దాటి, ఫైబ్రాయిడ్ పరిమాణం వేగంగా పెరుగుతున్న పరిస్థితి ఉంటే, ఫైబ్రాయిడ్‌తో పాటు గర్భసంచిని కూడా తొలగించవలసి ఉంటుంది. ఇలా ఫైబ్రాయిడ్ సైజును బట్టి, వయసును బట్టి, బాధిస్తున్న సమస్యలను బట్టి సర్జరీ అవసరాన్ని వైద్యులు అంచనా వేస్తారు.

డాక్టర్ ఎమ్. రజని,
కన్సల్టెంట్ గైనకాలజిస్ట్, హైదరాబాద్.

నాజూగ్గా... నల్లపూసలు

ఎన్ని నగలు ఉన్నప్పటికీ వివాహమైన మహిళలు నల్ల పూసల గొలుసుకు ఇచ్చే ప్రాధాన్యం మాత్రం ప్రత్యేకం. అందుకే సంప్రదాయం, ఆధునికతల సమ్మేళనంతో కాలానుగుణంగా నల్ల పూసల గొలుసులు రూపుదిద్దుకుంటున్నాయి. ట్రెండ్‌ను అనుసరించే ఉద్యోగినులను ఆకట్టుకునే విధంగా ఎన్నో రకాలు లభ్యమవుతున్నాయి. బంగారం, నవరత్నాలు, క్రిస్టల్స్, సిజెడ్స్‌తో కలగలిసి మహిళల మనసు దోచుకున్న ట్రెండీ డిజైన్స్ ఇవే...

బంగారం, వజ్రాలతో: బంగారు తీగకు నల్ల పూసలను జతచేసి అందమైన అమరికలో చుడతారు. బంగారం అల్లిక ఎక్కువగా, నల్ల పూసల అల్లిక తక్కువగా ఉండేలా రూపొందిస్తారు. దీనికి చిన్న వజ్రాలతో తయారు చేసిన లాకెట్‌ను జోడిస్తారు. లాకెట్‌ను పోలిన జుంకాలు లేదా దిద్దులు, ఉంగరం కూడా అందుబాటులో ఉంటాయి. నాజూగ్గా ఉంటూనే గొప్పగా కనిపించే ఈ నల్ల పూసల గొలుసు ఏ వయసువారికైనా నప్పుతుంది.

ముత్యాలతో: నల్ల పూసలు దగ్గరగా ఉండేలా బంగారు తీగతో గొలుసులా చుడతారు. లాకెట్ స్థానంలో పెద్ద సైజు ముత్యాలను, బంగారు గుండ్లను ఒక క్రమంలో అమర్చి గొలుసుకు జోడిస్తారు. ఈ గొలుసుకు మరో పెద్ద ముత్యాన్ని వేలాడేలా అమరుస్తారు. ఈ నల్లపూసల గొలుసు నాజూగ్గా ఉంటూ ఉద్యోగినులకు అనుకూలంగా ఉంటుంది.

రాశి గుర్తులతో: బంగారు తీగతో నల్ల పూసలను గొలుసులా అల్లిన తరవాత దానికి జోడించే లాకెట్‌లో భార్య భర్తల జన్మ రాశి గుర్తులను బంగారంతో తయారు చేసి అమరుస్తారు. లేదంటే రాశి గుర్తులనే లాకెట్‌లా జోడిస్తారు. ఈ రాశి గుర్తుల మీద వజ్రాలు లేదా సిజెడ్‌లను కూడా పొదుగుతారు. కావాలనుకుంటే కెంపులు, పచ్చలు కూడా అమర్చుకోవచ్చు. బాలీవుడ్ నటి సోనమ్ కపూర్ ఈ తరహా నల్లపూసల గొలుసు ధరించడంతో అప్పటి నుంచి ఈ మోడల్ అత్యంత మహిళాదరణ పొందింది.

నవరత్నాలతో: పొట్టిగా ఉండే నల్లపూసల గొలుసుకు నవరత్నాలను ఒక క్రమంలో లాకెట్‌లా జోడిస్తారు. దీనికి వజ్రాన్ని వేలాడేలా అమరుస్తారు. ఈ మోడల్ గొలుసు ఆధునిక దుస్తుల మీద బాగుంటుంది. నవరత్నాలైన పగడం, గోమేధికం, పుష్యరాగం, నీలం, మాణిక్యం, మరకతం, వజ్రం, వైఢూర్యం, ముత్యంలను ఒకే పరిమాణంలో ఉండేలా మార్చి వాటిని బంగారంతో అందమైన ఆకృతిలో జోడించి లాకెట్ రూపొందిస్తారు. దీనిని నల్లపూసల గొలుసుకు అమరుస్తారు. అప్పుడు అది చిన్న నెక్లెస్‌లా కనిపిస్తుంది. రోజువారీ వేసుకోవడానికి గృహిణులకు, ఉద్యోగినులకు అనుకూలంగా ఉంటుంది.

చాంద్‌బాలీతో: అర్ధచంద్రాకారపు చాంద్‌బాలీ లాకెట్‌ను జోడించి తయారు చేసే ఈ నల్ల పూసల గొలుసు చాలా అందంగా కనిపిస్తుంది. నల్ల పూసల గొలుసు మూడు లేదా అయిదు వరుసలు ఉండేలా కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ గొలుసుల్లో చిన్న, పెద్ద బంగారు గుండ్లను కూడా చేరిస్తే మంచి హారంలా మారుతుంది. చాంద్‌బాలీ లాకెట్‌కు ముత్యాలు లేదంటే నల్ల పూసల గుత్తులు వేలాడేలా చేస్తే ఈ నల్ల పూసల హారం ఇంకా గొప్పగా కనిపిస్తుంది.



మీనాకారీతో: నల్ల పూసల గొలుసుకు జోడించే లాకెట్‌ను బంగారంతో మాత్రమే కాదు. రాగి, వెండి లోహాలతో కూడా తయారు చేయవచ్చు. వీటి మీద అందమైన ఎనామిల్ రంగులు వేసి రంగురంగుల కుందనాలు అద్ది మీనాకారీ హారం రూపొందిస్తారు. ఈ మీనాకారీ హారం అన్ని రకాల చీరల మీద గొప్పగా కనిపిస్తుంది. మహిళలు ఎటువంటి సంకోచం లేకుండా అన్ని సందర్భాల్లో ధరించేందుకు వీలుగా ఉంటుంది.